


శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 101 | బుధవారం | 11-03-2026 | కరీంనగర్

Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00


కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు ఆది పుష్కరాలు

రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక అక్రమ తవ్వకాలపై విజిలెన్స్ దాడులు

భారీగా ఇసుక, యంత్రాలు స్వాధీనం 03



సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, చిత్రంలో సిపిఐ మరో జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఎస్.బాల్‌రాజ్

సాయుధ పోరాటం ద్వారా

# అతికొద్ది మందితో అంతిమ లక్ష్యం అసాధ్యం

- కమ్యూనిస్టులు కోరుకుంటున్న సమసమాజాన్ని సాధించేందుకు కలిసిరావాలి
- జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులు మాతృ సంస్థ సిపిఐలో చేరాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపు
- మోదీ సర్కార్ దౌత్య విధానం పూర్తిగా విఫలం
- సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజాబలం లేని అతికొద్దిమందితో సాయుధ పోరాటం ద్వారా అంతిమ లక్ష్యం సాధ్యం కాదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. కమ్యూనిస్టులంతా కోరుకుంటున్న సమ సమాజాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా సాధించుకునేందుకు అందరూ కలిసి పని చేయాలని, ఇందుకు ఇటీవల జన జీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులు తమ మాతృసంస్థ సిపిఐలో చేరాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ బహిరంగంగా సాదరంగా ఆహ్వానం పలుకుతోందని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం మంగళవారం తరువాయి 2లో

వెలుగుమట్ల బాధితులకు

## నేడు పట్టాలు పంపిణీ

311 మందిని అర్హులుగా తేల్చిన అధికారులు

ప్రజాపక్షం/ఖమ్మం

వెలుగుమట్ల బాధితులకు నివాస స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లో జరగనుంది. గత నెల 24న వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలోని భూదాన్ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని దశాబ్దాల పాటు జీవిస్తున్న వారి నివాసాలను బుల్‌డోజర్లతో కూలగొట్టి బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో అధికారులు సర్వే నిర్వహించి 311 మందిని అర్హులుగా తేల్చినట్లు సమాచారం. అర్హులందరికీ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం ఐదు గంటలకు ఖమ్మం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హాజరు కానున్నట్లు అధికారిక సమాచారం. స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరుకు సంబంధించి కడపటి సమయానికి సమాచారం లేదు. విపక్షాలు ముఖ్యంగా వామపక్షాలు భూదాన్ భూముల్లోనే బాధితులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అర్హులైన 311 కుటుంబాలకు కూడా భూదాన్ భూముల్లోనే స్థలాలు కేటాయించి పట్టాలు ఇవ్వనున్నట్లు సమాచారం. నిన్న మొన్నటి వరకు రఘునాథపాలెం మండలంలోని ప్రభుత్వ భూముల్లో పట్టాలు ఇస్తారని ప్రచారం జరిగినప్పటికీ ప్రాథమిక సమాచారం ప్రకారం భూదాన్ భూముల్లోనే పట్టాలు ఇవ్వడానికి అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. వెలుగుమట్ల నివాసాల కూల్చివేతకు సంబంధించి ప్రభుత్వం పెద్ద ఎత్తున బదనామైంది. రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి.

# యుద్ధం మహోధృతం



- ఇరాన్ క్షిపణి నిల్వ డిపోలు, రక్షణ పరిశ్రమ ధ్వంసం
- 50 ఇరాన్ కీలక నౌకలు నీట ముంచేశాం
- నిర్ణయాత్మక విజయం సాధిస్తున్నాం : హెగ్సెత్
- ఇరాన్ క్షిపణిదాడి సామర్థ్యం 90 శాతం క్షీణించింది
- ఖతార్, అరబ్ ఎమిరేట్స్, ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి వర్షం
- కుర్దిస్థాన్‌లో యుఎస్ కాన్సులేట్‌పై దాడి
- బాంబు దాడులతో దద్దరిల్లిన ఇరాన్ ప్రాంతాలు
- రక్షణ చర్యలు ముమ్మరం చేసిన యుఎఇ
- 1900 మంది ఇరాన్ సైనికులు, కమాండర్లు మృతి

**దుబాయ్ :** పశ్చిమాసియాలో మంగళవారం యుద్ధం (11వ రోజు ) మహోధృతంగా సాగింది. అందుకు దీటుగా ఇరాన్ కూడా ఖతార్,అరబ్ ఎమిరేట్స్,ఇజ్రాయెల్‌పై క్షిపణి వర్షం కురిపించింది. ఇరాక్‌లో ఉన్న ఇరాన్ అనుకూల సంస్థలు అమెరికా స్థావరాలపై దాడులు చేశాయి. చాలా తీవ్రస్థాయిలో దాడులు చేశామని, ఇరాన్‌లోని క్షిపణి నిల్వ కేంద్రాలు, క్షిపణి లాంఛర్ వాహనాలు, రక్షణ రంగ పరిశ్రమ స్థావరాన్ని గగనతల దాడుల ద్వారా ధ్వంసం చేశామని అమెరికా రక్షణమంత్రి పెట్ హెగ్సెత్ ప్రకటించారు. ''ఈరోజు ఎన్నడూలేనంత భీకర దాడులు చేశాం, శత్రువు మళ్ళీ లేవకుండా అణచివేశాం, గడచిన 24 గంటల్లో ఇరాన్ చాలా తక్కువ క్షిపణులను ప్రయోగించింది, ఇరాన్ యుద్ధ సామర్థ్యం క్షీణించిపోయింది'' అన్నారు. అమెరికా–ఇజ్రాయెల్ నిర్ణయాత్మక విజయం సాధిస్తున్నాయని అన్నారు. యుద్ధం మొదలైన తర్వాత ఇంత తక్కువస్థాయిలో క్షిపణి దాడులు ఇదే మొదటిసారి అన్నారు. అదేవిధంగా అమెరికా త్రివిధ దళాధిపతుల ప్రధానాధికారి, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ జనరల్ డాన్ కైన్ కూడా హెగ్సెత్‌ను సమర్థిస్తూ, ఇరాన్ క్షిపణి దాడులు 90 శాతం క్షీణించాయని, డ్రోన్ దాడులు కూడా 83 శాతం మేరకు క్షీణించాయని చెప్పారు. బాలిస్టిక్ క్షిపణి దాడులు కూడా 90 శాతం క్షీణించాయన్నారు. ఈ యుద్ధంలో ఇప్పటి వరకూ 50 ఇరాన్ యుద్ధ నౌకలను నీట ముంచేశామని చెప్పారు. ఈ విధంగా ఇరాన్ నౌకావ్యవస్థను కూడా ధ్వంసం చేశామన్నారు. ఇరాన్ యుద్ధం నుండి అమెరికా వైదొలగుతుందని వస్తున్న వార్తల నేపథ్యంలో హెగ్సెత్,డాన్‌కైన్ మంగళవారం సాయంత్రం తరువాయి 2లో

క్యూబా ప్రభుత్వాన్ని

## కూలదోసేందుకు యత్నిస్తున్నాం

ట్రంప్ బరితెగింపు ప్రకటన



**ఫ్లోరిడా:** క్యూబాలో పరిపాలన అంతిమ దశలో ఆర్థిక పతనం అంచున ఉందని ఉందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. క్యూబాలో ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నం చేస్తున్నామని, తమ విదేశీమంత్రిత్వశాఖ ఇంకా ఆ ప్రయత్నాలు కొనసాగిస్తోందని బహిరంగ ప్రకటన చేశారు. క్యూబాలో పెద్ద మార్పు రాబోతోందని సోమవారం రాత్రి ట్రంప్ ఫ్లోరిడాలో పాత్రికేయులకు చెప్పినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. అమెరికా విదేశీమంత్రిత్వశాఖ క్యూబాపై దృష్టి సారించిందని, ఇప్పటికీ ఇంకా ప్రయత్నం చేస్తున్నామని, ఈ ప్రణాళికలో క్యూబాను అమెరికా స్నేహపూర్వకంగా స్వాధీనం చేసుకోవచ్చు లేదా చేసుకోకపోవచ్చునని అన్నారు. అమెరికా విదేశీమంత్రి మార్కో రుబియో క్యూబా వ్యవహారాలను దగ్గరుండి చూసుకుంటున్నారని చెప్పారు. వారు రెచ్చగొడుతున్నారు, వారి దగ్గర డబ్బు లేదు, శక్తి సామర్థ్యాలు లేవు, తరువాయి 2లో

హైదరాబాద్‌కు కొత్త గవర్నర్

## శివప్రతాప్ శుక్లా రాక

- ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, సిఎస్ రామకృష్ణారావు, డిజిపి శివధర్‌రెడ్డి
- నేడు శుక్లాతో ప్రమాణం చేయించనున్న హైకోర్టు సిజె జస్టిస్ అపరేశ్ కుమార్



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన శివ ప్రతాప్ శుక్లా హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న గవర్నర్ దంపతులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి శివధర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం అక్కడే గవర్నర్‌తో సిఎం రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ కొత్త గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో బుధవారం ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను లోక్ భవన్ అధికారులు పూర్తి చేశారు. ఇటీవల పలు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం కొత్త గవర్నర్లను నియమించింది. ఇందులో భాగంగానే హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ గా కొనసాగుతున్న శివప్రతాప్ శుక్లాను తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా నియమించింది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా పని చేసిన జిష్ణు దేవ్ వర్మను మహారాష్ట్రకు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

# హోటళ్లు బంద్!

సిలిండర్ల సరఫరా నిలిపివేయడంతో తీవ్ర ప్రభావం



**ప్రజాపక్షం/హైదరాబాద్ / న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల యుద్ధ ప్రభావం, హర్మూజ్ సంధిలో చమురు నౌకల రాకపోకలపై చిక్కులు మన దేశంలోని హోటళ్ల పరిశ్రమపై పడింది. దీంతో వెంటనే కమర్షియల్ గ్యాస్ సిలిండర్లపై పెట్రోలియం కంపెనీలు నియంత్రణ చర్యలకు పూనుకున్నాయి. హోటళ్లకు సిలిండర్ల సరఫరా నిలిపివేయాలని ఆయా సంస్థలు తమ డీలర్లకు ఆదేశాలు జారీ చేశాయి. ఆస్పత్రులు, హాస్టళ్లకు మాత్రమే కమర్షియల్ సిలిండర్లు సరఫరా చేయాలని పెట్రోలియం యాజమాన్యాలు స్పష్టంగా పేర్కొన్నాయి. కమర్షియల్ గ్యాస్ కొరతతో దేశవ్యాప్తంగా హోటల్ పరిశ్రమ ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతోంది. ముంబై, బెంగళూరు, చెన్నై సహా పలు ప్రధాన నగరాల్లోని హోటళ్లకు ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్లు గ్యాస్ ఇబ్బందులను తెచ్చిపెట్టింది. గ్యాస్ కొరతతో ఇప్పటికే దేశవ్యాప్తంగా చిన్న చిన్న హోటళ్లు మూతబడుతున్నాయి. గ్యాస్ వినియోగదారులు తప్పకుండా ఇకెవైసి చేసుకోవాలని సూచించాయి. అలా చేసుకోని గృహ వినియోగదారులకు సైతం ఇక నుంచి గ్యాస్ బుకింగ్ నిలిచిపోనుంది. ఇటీవల గృహ వినియోగ సిలిండర్ బుకింగ్ వ్యవధిని 20 నుంతి 25 రోజులకు కేంద్ర ప్రభుత్వం పెంచిన సంగతి తెలిసిందే.

**గ్యాస్ కొరతపై స్పందించిన డిస్ట్రిబ్యూటర్ల అసోసియేషన్**

తెలంగాణ రాష్ట్రంలో గ్యాస్ కొరతపై డిస్ట్రిబ్యూటర్ల అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి స్పందించారు. మన రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎల్పీజీ కొరత వచ్చే అవకాశం లేదని, పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఇబ్బందులు ఎదురవకుండా మాత్రమే కేంద్రం అప్రమత్తమైందని తెలిపారు. గృహ వినియోగదారులకు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రం ముందస్తు చర్యలు చేపట్టిందని స్పష్టం చేశారు. కాగా ఇప్పటికే వ్యాపార, హోటల్స్‌కు సిలిండర్లను నిలుపుదల చేస్తూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. డిస్ట్రిబ్యూటర్ల నుంచి 19 కిలోల వాణిజ్య సిలిండర్ల సరఫరా దాదాపు ఆగిపోయింది. హాస్టళ్లకు, ఆస్పత్రులు లాంటి అత్యవసర విభాగాలకు ఎస్మా నుంచి మినహాయింపును ఇచ్చారు. గ్యాస్ సరఫరా విషయంలో కొన్ని విభాగాలకు పరిమితులు విధించారు. యుద్ధం కారణంగా సరిపడినంత గ్యాస్ సరఫరా లేకపోవడంపై తరువాయి 2లో

మోదీ వైఫల్యానికి

## మూల్యం చెల్లిస్తున్న ప్రజలు

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

**న్యూఢిల్లీ :** విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, పెరుగుతున్న ఎల్‌పిజి ధరలు, వాణిజ్య సంస్థలకు ఎల్‌పిజి పంపిణీపై ఆంక్షలు వంటి నిత్యావసర వస్తువుల చట్టం కింద ఆంక్షలు, భారతదేశ ఇంధన భద్రతను కాపాడటంలో మోదీ ప్రభుత్వం విఫల్యాలను ప్రతిబింబిస్తున్నాయని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. ప్రజల్లో భయాందోళనలు, అక్రమ నిల్వలను ప్రేరేపిస్తాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ట్రంప్‌ను శాంతింపజేయడం, ఫోటో అవకాశాల కోసం వెంబడించడం బాధ్యతాయుతమైన పాలనను ప్రత్యామ్నాయం కాబోవు అని అన్నారు. ఇరాన్‌పై దాడి చేయడానికి కొన్ని రోజుల ముందు ఇజ్రాయెల్‌లో ఉన్న స్వయం ప్రకటిత విశ్వగురు దేశంలో తగిన ఇంధన నిల్వలను నిర్వహించడంలో విఫలమయ్యాడని ఎద్దేవా చేశారు. తన వైఫల్యాలకు భారత ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదల, ప్రజలపై భారాలు మోపిన దుస్థితిని ప్రతిఘటించి, పోరాడుదామని పిలుపునిచ్చారు.



లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

## పక్షపాతంతో సభను నడిపారు

గగోయ్ 05

సిఐసి తీరుపై లోక్‌సభలో

## ప్రతిపక్షాల నినాదాలు

మూడేళ్లలో పంచాయతీలకు

# శాశ్వత భవనాలు

- ప్రణాళికలు సిద్ధం చేసుకొని ముందుకెళ్లాలి
- అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి
- అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కోర్సులు
- ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాబోయే మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలో శాశ్వత భవనాలు లేని గ్రామపంచాయతీలు అన్నిటికి శాశ్వత భవనాలు నిర్మించాలని ఆ మేరకు పంచాయతీరాజ్ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు పోవాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ప్రీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వివేక్ లతో కలిసి ఆయా శాఖల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ స్థలాలు అందుబాటులో ఉన్నచోట తహసీల్దార్ కార్యాలయాలు, ఎంపీడీవో తరువాయి 12లో



చైనా సహా భారత్ సరిహద్దు దేశాల ఎఫ్‌డిఐ

# కఠిన నిబంధనలు సడలింపు

కేంద్ర మంత్రివర్గం తీర్మానం

జల్‌జీవన్ మిషన్ 2028 డిసెంబర్ వరకు పొడిగింపు

**న్యూఢిల్లీ:** భారతదేశంతో భౌగోళిక సరిహద్దులు పంచుకున్న దేశాల నుండి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై (ఎఫ్‌డిఐ) విధించిన నిబంధనలను సడలిస్తూ కేంద్రమంత్రివర్గం ఒక తీర్మానం చేసిందని న్యూఢిల్లీలోని వర్గాలు పేర్కొన్నాయి. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో చేసిన తీర్మానాలను సంప్రదాయబద్ధంగా కేంద్ర సమాచార ప్రసారాల శాఖామంత్రి అశ్వనీ వైష్ణవ్ మీడియాకు తెలియజేయాల్సి ఉంది. కానీ ఆయన ఈ తీర్మానం మినహా మిగిలిన అన్ని తీర్మానాలను అధికారికంగా ప్రకటించారు. 2020లో చైనాతో సరిహద్దుల్లో సంఘర్షణలు చెలరేగినప్పుడు చైనాకు సంబంధించి కేంద్రం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఆ దేశం నుండి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను స్వీకరించడానికి నిబంధనలు కఠినం చేసింది. ఈ నిబంధనలు కేవలం చైనాకు మాత్రమే పరిమితం కాకుండా మనదేశం చుట్టూ సరిహద్దులు పంచుకునే పాకిస్థాన్,అఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, మయన్మార్, భూటాన్, నేపాల్ దేశాలకు కూడా వర్తిస్తాయని తెలిపింది. కానీ ఇప్పుడు మాత్రం పొరుగు దేశాలతో సంబంధాలను మెరుగుపరచుకుంటూ పెట్టుబడుల ప్రవాహం పెంచడానికి ఈ దేశాలను కూడా తరువాయి 12లో



అక్రమ సరోగసీ రాకెట్ కేసు

## రూ.29.76 కోట్ల ఆస్తులు ఇడి జప్తు

ప్రజాపక్షం/హైదరాబాద్

అక్రమ సరోగసీ రాకెట్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ, రీసెర్చ్ సెంటర్ పేరుతో డాక్టర్ పాచిపల్లి నమ్రత, అథ్లూరి నమ్రత నిర్వహిస్తున్న సరోగసీ వ్యవహారంపై కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కీలక చర్యలు చేపట్టింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్‌ఎ), 2002 కింద తరువాయి 12లో

# త్వరలో యుద్ధం ముగిస్తాం

**చమురును అడ్డుకుంటే అణచివేత**
**డెత్–ఫైర్–ఫ్యూరీ తప్పదు**
**ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక**



**ఫ్లోరిడా:** ప్రపంచ దేశాలకు చమురు రవాణా జరగకుండా ఇరాన్ అడ్డుకుంటే ఆ దేశాన్ని ఇరవైరెట్లు బలంతో కోలుకోలేనంతగా అణచివేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక చేశారు. చమురు నౌకలను అడ్డుకుని ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి ఆజ్యం పోస్తే "డెత్–ఫైర్–ఫ్యూరీ" తప్పదని హెచ్చరించారు.గడచిన పది రోజుల యుద్ధంలో ఇరాన్‌లోని 5,000 స్థావరాలపై అమెరికా భారీస్థాయిలో దాడులుచేసి ధ్వంసం చేసిందని చెప్పారు. ఇరాన్‌తో యుద్ధం త్వరలోనే ముగిసిపోతుందని, నాలుగు వారాల గడువు కూడా అవసరం లేదని ట్రంప్ ఫ్లోరిడాలో సోమవారం రాత్రి పొద్దుపోయాక ప్రకటించిన కొద్ది గంటల్లోనే హోర్ముజ్ జలసంధి ద్వారా నౌకా రవాణాకు అంతరాయంపై ఆయన స్పందించారు. అమెరికా చమురు రవాణాపై విధించిన ఆంక్షలను కూడా ఆయన సడలించారు. ఈ సడలింపువల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం సమస్య పరిష్కారం కాగలదన్నారు. ఇరాన్‌లో యుద్ధం చాలా తొందరలోనే ముగిసిపోతుందని, ఐతే ఈ వారంలో మాత్రం యుద్ధం ముగిసే అవకాశాలు లేవని చెప్పారు. అదేవిధంగా ఇరాన్ సర్వాధినేతగా మోజ్తాబా నియామకంపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మా సమ్మతి లేకుండా నియామకం జరిగిందని, ఆయన ఎంతకాలం ఆ పదవిలో కొనసాగుతారో తెలియదని హెచ్చరించారు. ఇజ్రాయెల్ ఆయుధాగారం ఖాళీ అవుతోందని అన్నారు. వారి సామర్థ్యం అడుగంటిందన్నారు.

**ట్రంప్ ప్రకటనతో తగ్గిన ఆయిల్ ధరలు**

త్వరలో యుద్ధం ముగిస్తామని ట్రంప్ చేసిన ప్రకటనతో కళ్లెం లేకుండా పరుగులు తీసుకున్న క్రూడాయిల్ ధరలు తిరోగమనం పట్టాయి. ఐనప్పటికీ కూడా హెచ్చుస్థాయిలోనే ఉన్నాయి. చమురు రవాణాను అడ్డుకుంటే ఇరవైరెట్లు బలంతో తీవ్రస్థాయిలో అణచివేస్తామని ట్రంప్ ప్రకటన కూడా ధరల తగ్గుదలకు ఒక భరోసాగా నిలిచిందని, ఐఆర్‌జిసి దూకుడు తగ్గే అవకాశాలు ఉంటాయని మార్కెట్‌లో అంచనాలు వచ్చాయి.

ఒక దశలో బ్యారెల్ ధర 200 వరకూ కూడా చేరి పోయే పరిస్థితులు కనిపించడంతో "ఓరి నాయనో...ఇక ప్రపంచం ఈ ధరలను తట్టుకుని నిలబడుతుందా...?" అని బెంబేలెత్తే పరిస్థితి కూడా వచ్చింది.

కానీ నాలుగువారాలు కూడా అవసరం లేకుండా యుద్ధం ముగిస్తామని ట్రంప్ చేసిన ప్రకటన చమురు మార్కెట్‌కు, మదుపరులకు ఊరట కలిగించింది. బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ధర 120 డాలర్ల నుండి 90 డాలర్లకు తగ్గింది. ఐనప్పటికీ ఈ ధర హెచ్చుగానే ఉంది. మార్చి ఐదో తేదీ నుండి చమురు ధరలు ప్రపంచ మార్కెట్లను వణికిస్తున్నాయి.

# యుద్ధం ముగిసేవరకూ ఆయిల్ బ్లాకేడ్

**ఎప్పుడు ముగించాలో మేం నిర్ణయిస్తాం : ఐఆర్‌జిసి**
**ఆయుధాల కొరత లేదు, ఆరునెలల యుద్ధానికి సిద్ధం**
**ఆపరేషన్ ట్రూ ప్రామిస్–4లో 650 మంది హతం**
**ఐఆర్‌జిసి బ్రిగేడియర్ మొహమ్మద్ నైనీ**



**టెహ్రాన్:** యుద్ధం ముగిసేవరకూ చమురు రవాణాపై నిషేధం అమలులో ఉంటుందని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) ప్రకటించింది. అదేవిధంగా ట్రంప్ చేసిన ప్రకటనపై తీవ్రంగా స్పందించింది. యుద్ధం ఎప్పుడు ముగించాలనే విషయాన్ని తాము నిర్ణయిస్తామని ఐఆర్‌జిసి అధికార ప్రతినిధి, బ్రిగేడియర్ జనరల్ అలీ మొహమ్మద్ నైనీ స్పష్టం చేశారు. ఇరాన్ అణుక్షిపణుల వ్యవస్థను నాశనం చేశామని అమెరికా అధ్యక్షుడు చేసిన ప్రకటనలను ఆయన తీవ్రంగా ఖండించారు. తిరస్కరించారు. ట్రంప్‌తో చర్చల ప్రశ్నేలేదని, అందుకు తావివ్వబోమని విదేశీ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ప్రకటన నేపథ్యంలో స్పందిస్తూ, ఆరునెలల సుదీర్ఘ యుద్ధానికి ఇరాన్ సిద్ధంగా ఉందని నైనీ చెప్పారు. ఇరాన్ వద్ద పదినన్ని ఆయుధాలు ఉన్నాయని, 2012 నుండి తయారు చేసిన క్షిపణులు తమ వద్ద ఉపయోగించకుండా సిద్ధంగా ఉన్నాయని, ఇంకా భారీ సంఖ్యలో ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు.ఒక టన్నుకంటే ఎక్కువ బరువుగల వార్‌హెడ్స్ తమ వద్ద సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. యుద్ధం ఎప్పుడు ముగించాలో చెప్పేది ట్రంప్ కాదని, తామే ముగించాల్సిన సమయంలో యుద్ధం ముగిస్తామన్నారు. అమెరికా–ఇజ్రాయెల్ కు వ్యతిరేకంగా ఇరాన్ ప్రారంభించిన 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్–4' సందర్భంగా 650 మంది అమెరికా సైనికులు హతమయ్యారని, వీరిలో గాయపడినవారు కూడా ఉన్నారని చెప్పారు. తమ దేశ సర్వాధినేత మోజ్తాబా ఖమేనీ పట్ల పూర్తి విధేయత ప్రకటిస్తూ, ఆయన నాయకత్వంలో మొదటిసారి మార్చి తొమ్మిదో తేదీ నుండి ఇజ్రాయెల్–అమెరికా స్థావరాలపై దాడులు ప్రారంభించామని చెప్పారు. శత్రుదేశాలపై మంగళవారం 31వ విడత ఆపరేషన్ ట్రూ ప్రామిస్–4 ద్వారా భారీ ఎత్తున క్షిపణులు,డ్రోన్లతో విరుచుకుపడ్డామని, శత్రుస్థావరాలను ధ్వంసం చేశామని, ఇజ్రాయెల్‌పై రెండోసారి చేసిన ఈ దాడులను తమ అత్యున్నత కమాండర్ మోజ్తాబా ఖమేనీకి అంకితం చేశామన్నారు.

**ఇక చర్చలు జరగవు : అబ్బాస్ అరాఘ్చీ**

అమెరికాతో ఇక చర్చలకు తావులేదని ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చీ ప్రకటించారు. ఇరాన్‌తో సంభాషణలు జరపబోమని ఆ ఉద్దేశమే లేదని చెప్పారు. చర్చలసందర్భంగా ఇరాన్ ఇప్పటివరకూ అనేక చేదు అనుభవాలను చవిచూసిందని, అలాంటి పరిస్థితులను తాము ఎదుర్కోదలచుకోలేదంటూ చర్చలను తిరస్కరించారు. ఈ యుద్ధం జరగడానికి అమెరికా–ఇజ్రాయెల్ దేశాలే ప్రధాన కారకులని అన్నారు. అమెరికా–ఇజ్రాయెల్ చేసిన ఘాతుకాలకు మూల్యం చెల్లిస్తారని, ట్రంప్‌ను ఊరికే వదిలిపెట్టబోమని మరోసారి హెచ్చరించారు.

యుద్ధం పూర్తి చేయడానికి ట్రంప్ నాలుగైదు వారాలంటూ విధించిన గడువును ఆయన తిరస్కరించారు. అదేవిధంగా ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘేర్ ఖాలిబాఫ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ, తాము కాల్పుల విరమణ కోసం ఎదురుచూడటంలేదన్నారు. శత్రువుకు గట్టి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. "మా దేశాన్ని దురాక్రమణ చేయాలనుకునే శత్రువుకు మూతిపగలగొట్టేవిధంగా బుద్ధిచెబుతాం" అన్నారు. మా ప్రియమైన దేశంమీద దాడిచేసే ఆలోచనే అవకాశం లేకుండా దెబ్బతీస్తామన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లు దాడులు చేయడానికి అదనంగా ఇంధన మౌలిక సదుపాయాలను కూడా లక్ష్యంగా చేసుకున్నామన్నారు.

## రష్యా చమురు ఆంక్షలపై ట్రంప్–పుతిన్ చర్చించలేదు

**మాస్కో:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ ఫోన్‌లో గంటసేపు సుదీర్ఘ సంభాషణ చేశారు. హోర్ముజ్ జలసంధి వద్ద వందల నౌకలు స్తంభించిపోయి చమురు రవాణ ఆగిపోవడం, రష్యా చమురుపై ఆంక్షలు సడలిస్తామని ట్రంప్ ప్రకటన నేపథ్యంలో వారిద్దరు చమురు సమస్యతోపాటు ఇరాన్, ఉక్రేన్‌లో పరిణామాల గురించి కూడా చర్చించారని వార్తలు వెలువడ్డాయి. కానీ దీనిపై క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ మంగళవారం సాయంత్రం వివరణ ఇస్తూ, రష్యా చమురు ఎగుమతులకు సంబంధించి ఆంక్షలను తొలగించే విషయంపై సవివరంగా నాయకులు ఇద్దరూ చర్చించలేదని స్పష్టం చేశారు. హోర్ముజ్ జలసంధి వద్ద చమురు రవాణా నౌకలు స్తంభించిపోవడంవల్ల సంక్షోభం ఏర్పడటంవల్ల రష్యా చమురుపై ఆంక్షలను సడలిస్తారని అమెరికా నుండి వార్తలు వెలువడ్డాయి. ట్రంప్,పుతిన్ ఫోన్ సంభాషణ దాని గురించే అని చమురు మార్కెట్‌లో వార్తలు గుప్పుమన్నాయి. దీంతో పెస్కోవ్ పైవిధంగా వివరణ ఇచ్చారు. నాయకులు ఇద్దరు ప్రధానంగా ఇరాన్‌లో యుద్ధం, ఉక్రేన్‌లో యుద్ధం గురించే చర్చించారని చెప్పారు.


చమురు మార్కెట్‌ను స్థిరీకరించే విషయం వారికి తెలుసుననీ, ఆ ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. అమెరికా ఇతర దేశాల చమురు రంగాలపై ఆంక్షలను వైట్‌హౌస్ ఎత్తివేస్తుందని, తిరిగి ఆ ఆంక్షలను విధించే అవకాశం ఉండదని వార్తలు వచ్చాయి. కాగా పుతిన్ సలహాదారు యూరీ ఉషకోవ్ మాట్లాడుతూ, ఉక్రేన్ లో సెటిల్‌మెంట్స్‌పై సమస్య పరిష్కారానికి త్రైపాక్షిక చర్చల గురించి వారు మాట్లాడుకున్నారన్నారు. వారి మధ్య సంభాషణ నిర్మాణాత్మకంగా జరిగిందని, వైట్‌హౌస్ విజ్ఞప్తి మేరకే ఈ ఫోన్ సంభాషణ జరిగిందన్నారు.

## 13న చర్లపల్లి–కామాఖ్య మధ్య నూతన రైలు ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అస్సాం రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కామాఖ్య, చర్లపల్లి మధ్య స్లీపర్ జనరల్ సెకండ క్లాస్ కోచ్‌లతో కూడిన కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ నూతన రైలు శుక్రవారం ప్రారంభకానుంది. మారిచ 13న కామాఖ్య నుండి ప్రారంభిస్తారని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కొత్త రైలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను ఈశాన్య రాష్ట్రాలకు సింహద్వారంగా నిలుస్తున్న అస్సాం రాష్ట్రంతో అనుసంధానిస్తుంది. ఇది ముఖ్యంగా భారతదేశంలోని ఈశాన్య ప్రాంతాల వైపు ప్రయాణించే దూర ప్రయాణీకులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, తక్కువ ప్రయాణ ఖర్చుతో కూడిన ప్రయాణాన్నిఅందించడానికి దోహదపడుతుందని తెలిపారు. ఈ రైలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మార్గమధ్యంలోనున్న శ్రీకాకుళం రోడ్ విజయనగరం జంక్షన్ , పెందుర్తి, దువ్వాడ, సామర్లకోట జంక్షన్, రాజమండ్రి, తణుకు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ, గుంటూరు మరియు నల్గొండ స్టేషన్లలో ఇరు వైపు ప్రయాణ దిశలలో ఆగుతుందని తెలిపారు.

## అణచివేత నుండి బయట పడేందుకు సహకరిస్తాం

**ఇరాన్ ప్రజలకు నెతన్యాహూ ఆఫర్!**



**జెరూసలెం:** అణచివేత, బానిసత్వం నుండి బయట పడేందుకు ఇరాన్ ప్రజలకు తమ దేశం సహకరిస్తుందని, ఐతే వారు అందుకు అనుగుణంగా ప్రతిస్పందించాలని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమన్ నెతన్యాహూ అన్నారు. ఇరాన్‌లో కొత్త నాయకుడు అధికార బాధ్యతలు చేపట్టిన మర్నాడు, పశ్చిమాసియాలో యుద్ధం 11వ రోజుకు చేరుకున్న మంగళవారం నెతన్యాహూ పైవిధంగా స్పందించారు. దేశంలో ఎలాంటి రాజకీయ మార్పు రావాలన్నీగానీ అంతిమంగా ప్రజలవల్లే సాధ్యమని అన్నారు. జెరూసలెంలోని నేషనల్ హెల్త్ కమాండ్ సెంటర్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇజ్రాయెల్ చేసిన ప్రజానుకూల ప్రచారం ఇరాన్ నాయకత్వాన్ని బలహీన పరచిందని అన్నారు. ''ఇరాన్ దేశ ప్రజలు అణచివేత నుండి బయటపడాలన్నదే మా వాంఛ. అంతిమంగా ఈ నిర్ణయం ఆ దేశ ప్రజలదే. కానీ ఇప్పటివరకూ తీసుకున్న చర్యల ప్రకారం చూస్తే, మేం వారి కీళ్ళు విరిచేశాం, మేం ఇంకా చాలా క్రియాశీల చర్యల్లో ఉన్నాం'' అన్నారు. ఇరాన్ ప్రజలతో కలిసి ఇజ్రాయెల్ విజయం సాధించగలిగితే, అది శాశ్వత మార్పును తీసుకువస్తుందని అన్నారు. ''మనం ఇరాన్ దేశ ప్రజలతో కలిసి విజయం సాధించగలిగితే, ఈ బానిసత్వానికి ఒక శాశ్వత ముగింపు ఇవ్వగలుగుతాం, మార్పు తీసుకురాగలుగుతాం, మనం ఇప్పటికే ఇరాన్ పట్ల అంతర్జాతీయ వైఖరిలో ఒక మార్పును తీసుకురాగలిగాం' అన్నారు.

ఇజ్రాయెల్ హోంశాఖ డైరెక్టర్ జనరల్ మోషే బార్ సిమన్ టోవ్ ఈ సందర్భంగా నెతన్యాహూకు కమాండ్ సెంటర్ కార్యకలాపాలను వివరించారు.

## యుద్ధం మహోధృతం

**(మొదటి పేజీ తరువాయి)**

పాత్రికేయులకు ఈ వివరాలు చెప్పారు. ఒకవైపు యుద్ధం ముగుస్తుందని ట్రంప్ చెబుతుండగా, మరోవైపు ఇరాన్‌పై మరిన్ని తీవ్ర దాడులతో అణచివేస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ ప్రతిజ్ఞ చేశారు.

11వ రోజు యుద్ధంలో ఇరాన్‌లో కర్మాగారాలను అమెరికా యుద్ధ విమానాలు ధ్వంసం చేయగా, ఇరాక్ కుర్దిస్థాన్‌లోని అమెరికా కాన్సొలేట్‌పై ఇరాన్ డ్రోన్ దాడులతో ధ్వంసం చేసింది. తెల్లారేవరకూ టెహ్రాన్ నగరం గతంలో లేనంతగా ముమ్మరమైన బాంబుదాడులతో మోగిపోయింది. అమెరికా యుద్ధ విమానాలు ఇరాన్ లాంఛర్లు, చమురు డిపోలు, ఇతర ఇంధన వనరులపై దాడులు చేశాయి. పశ్చిమ ఆసియాలో బహ్రైన్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా సహా అమెరికా, ఇజ్రాయెల్ లకు ఉన్న స్థావరాలు, ఆస్తులు, మౌలిక సదుపాయాలపై ఇరాన్ ప్రతిఘటన దాడులు ముమ్మరం చేసింది. ప్రధానంగా ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌పై ఇరాన్ భారీ సంఖ్యలో క్షిపణులు,డ్రోన్లతో దాడులు చేసింది. ఇరాన్ సర్వాధినేతగా మోజ్తాబా ఖమేనీ అధికారం చేపట్టిన తర్వాత ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ ఆయన నాయకత్వంలో మంగళవారం 31వ విడత దాడులు కొనసాగించారు. ఈ తాజా దాడులను తమ కొత్త నాయకుడికి అంకితం చేస్తున్నట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది. దీంతో ఇజ్రాయెల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు రక్షణ చర్యలు ముమ్మరం చేశాయి. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను అడ్డుకోవడంపైనే ప్రధానంగా దృష్టిసారించాయి. దుబాయ్, ఖతార్‌లలో సైరన్ల మోత మోగింది. జెరూసలెంలో బాంబు పేలుళ్ళు సంభవించాయి. ఈ దాడుల సందర్భంగా మనామాలో ఒకరు, ఇజ్రాయెల్‌లో ఇద్దరు మరణించారు. లెబనాన్‌లో కూడా యుద్ధం ఉధృతరూపం దాల్చింది. ఒక లాంఛర్ వెహికిల్‌ను లెబనాన్‌లో ఇజ్రాయెల్ దళాలు ధ్వంసం చేశాయి. హెజ్బొల్లా దళాలు కాల్పులు, దాడులకు పాల్పడుతున్నాయని సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్–షారా విమర్శించారు. ఎర్బిల్‌లోని కాన్సొలేట్ సమీపంలో డ్రోన్ దాడులు చేయడంపట్ల యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఇరాన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రెండు డ్రోన్ల దాడులను సౌదీ అరేబియా అడ్డుకుని విఫలం చేసింది. యుద్ధంలో చేరవలసిందిగా సౌదీఅరేబియాకు అమెరికా, దాని మిత్ర దేశాలు విజ్ఞప్తి చేశాయి. కాగా పశ్చిమాసియా యుద్ధంలో ఇప్పటివరకూ ఏడుగురు అమెరికా సైనికులు మరణించారు. ఏడో సైనికుడి మృతదేహం అమెరికాకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆ సైనికుడికి అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్,రక్షణ మంత్రి హెగ్సెత్, ఇతర సైనికాధికారులు నివాళులు అర్పించారు. మరోవైపు ఇరాన్‌కు చెందిన ఐదుగురు మహిళా సోకర్ ప్లేయర్లకు మానవతా దృక్పథంతో ఆస్ట్రేలియా ఆశ్రయం కల్పించింది. ఇరాన్‌పై గగనతల దాడుల తీవ్రతను బాగా పెంచుతామని ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఫోర్స్ కమాండర్ మాజిద్ మౌసావి చెప్పారు. ఇజ్రాయెల్ ఆత్మరక్షణ చర్యలను ముమ్మరం చేసింది. ఇరాన్ క్షిపణులు ప్రవేశించడంతోనే దేశంలోని కీలక ప్రాంతాల్లో ఇంటర్‌సెప్టివ్ వ్యవస్థల ద్వారా సైరన్లు భారీగా మోగుతున్నాయి. సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాల్సిందిగా ప్రజలను ఐడిఎఫ్ అప్రమత్తం చేస్తోంది. కాగా ఇరాన్ ప్రభుత్వ అధికారులు మంగళవారం ప్రకటించిన సమాచారం ప్రకారం యుద్ధం వల్ల పది రోజుల్లో ఇరాన్‌లో 1,332 మంది మరణించారు. వీరిలో 206 మంది మహిళలు, పిల్లలు ఉన్నారు. కాగా జర్మనీ ప్రభుత్వం బాగ్దాన్ నుండి తన దేశ సిబ్బందిని మరోచోటుకు తరలించింది.

ఇరాన్‌పై గడచిన పది రోజులుగా చేపట్టిన ''ఆపరేషన్ రోరింగ్ లయన్'' యుద్ధంలో 1900 మంది ఇరాన్ సైనికులు, కమాండర్లు మరణించారని, ఇరాన్ చేసిన దాడుల్లో పదిరోజులుగా 12 మంది తమ పౌరులు కూడా మరణించారని ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి ఎఫీ డెఫ్రిన్ చెప్పారు. ఫిబ్రవరి 28 నుండి ఇప్పటివరకూ ఇరాన్‌లో ఉన్న ఆరు విమానాశ్రయాలపై బాంబుదాడులు చేశామన్నారు. ఇరాన్ కొత్త నాయకుడి వల్ల కూడా ఇజ్రాయెల్‌కు బెదిరింపులు పెరిగితే ఆయనను కూడా లక్ష్యంగా చేసుకుని దాడులు చేసే అవకాధశం లేకపలేదని అన్నారు. లెబనాన్‌లో ఇద్దరు ఇజ్రాయెల్ పౌరులు మరణించారన్నారు. అదేవిధంగా ఇజ్రాయెల్ ఆరోగ్యమంత్రిత్వశాఖ సమాచారం ప్రకారం 2,2340 మంది ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. టెహ్రాన్, ఇస్ఫహాన్, దక్షిణ ఇరాన్ ప్రాంతాలలో దాడులు కొనసాగుతున్నాయి. అతి తీవ్ర స్థాయిలో టెహ్రాన్‌పై గగనతల దాడులు సాగించామని పేర్కొంది.

## హోటళ్లు బంద్!

**(మొదటి పేజీ తరువాయి)**

ఉన్నత స్థాయిలో కమిటీ ఏర్పాటు చేశారు. అందుబాటులో ఉన్న గ్యాస్ ఏయే రంగాలకు సరఫరా చేయాలన్న దానిపై అధ్యయనం చేస్తున్నారు. కమిటీ సిఫారసుల మేరకు ఆయిల్ కంపెనీలు గ్యాస్ సరఫరాను కొనసాగించనున్నాయి. గృహ వినియోగదారులు గ్యాస్‌ను పొదుపుగా వాడుకోవాలని, అవకాశం ఉన్నంత వరకు ఇండక్షన్ స్టవ్ లాంటి వాటిని వాడుకోవాలని అధికారులు సూచించారు.

**హోటల్ పరిశ్రమకు గ్యాస్ ప్రాణవాయువు**

హైదరాబాద్‌లో తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ అత్యవసరంగా సమావేశమైంది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఎల్పీజీ గ్యాస్ దిగుమతులు తగ్గిపోవడం పట్ల హోటల్స్ యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. హోటళ్ల పరిశ్రమకు గ్యాస్ ప్రాణవాయువు లాంటిదని, గ్యాస్ నిల్వలు తగ్గిపోయి కొరత ఏర్పడడంతో హోటల్ వ్యాపారాలు పూర్తిగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కమర్షియల్ గ్యాస్ నిలిపివేయడంతో తమ వ్యాపారానికి పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లేని వాపోయారు. ఈ పరిస్థితులన్నింటి దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా హెటల్స్ బంద్ నిర్వహించే యోచనలో ఉన్నట్లు తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి తెలిపారు. హోటళ్లలో వంట చేయడానికి సరిపడా గ్యాస్ లేకపోవడంతో తీవ్ర సమస్య ఎదురవుతోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించి సాయం చేయాలని కోరారు. ప్రభుత్వాలు ప్రత్యామ్నాయాలను చూపించకుంటే హోటల్స్‌ని తప్పనిసరిగా మూసేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఇప్పటికే ముంబై, బెంగళూరు వంటి నగరాలలో హోటల్స్ బంద్ నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు.

## 22న నర్మెట్ట ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం

**ప్రారంభించనున్న సిఎంరేవంత్‌రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు అభివృద్ధి దిశగా మరో కీలక అడుగు పడుతోందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సిద్ధిపేట జిల్లాలోని నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో నిర్మించిన ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఈ నెల 22వ తేదీన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నరని మంత్రి వెల్లడించారు.ఏర్పాట్లపై అధికారులతో మంత్రి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో స్థాపించిన రెండు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ మిల్లులు నిర్వహణలో ఉన్నాయని తెలిపారు. ఈ మిల్లుల సమిష్టి సామర్థ్యం గంటకు 120 మెట్రిక్ టన్నులు ఉందన్నారు. ఈ ప్రాసెసింగ్ యూనిట్లు ఆయిల్ పామ్ రైతులు పండించే పండ్లను త్వరిత గతిన ప్రాసెస్ చేసి వారికి సరైన మార్కెట్ అవకాశాలు కల్పిస్తూ కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ సిద్ధిపేట జిల్లాలోని నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో సుమారు రూ.300కోట్ల అంచనా వ్యయంతో ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని నిర్మించిందని మంత్రి తెలిపారు. ప్రారంభ దశలో ఈ యూనిట్ గంటకు 30 టన్నుల (30 టిపిహెచ్) సామర్థ్యంతో పనిచేయనుండగా, భవిష్యత్తులో దీనిని గంటకు 120 టన్నుల (120 టిపిహెఫ్) వరకు విస్తరించే విధంగా రూపకల్పన చేసినట్లు చెప్పారు. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఆధునిక ప్రాసెసింగ్ యూనిట్ ఆయిల్ పామ్ రైతులకు ఎంతో మద్దతుగా నిలవనుందని మంత్రి పేర్కొన్నారు.ఈ యూనిట్ ప్రారంభంతో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు ప్రాసెసింగ్, నిల్వ, మార్కెటింగ్ సౌకర్యాలు మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయని మంత్రి తెలిపారు. రైతులు తమ పంటలను నేరుగా ఈ ప్రాసెసింగ్ యూనిట్‌కు తీసుకువచ్చి ప్రాసెస్ చేయించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆధునిక సాంకేతికతతో నూనె తయారీ జరగడం వల్ల నాణ్యత మెరుగుపడటంతో పాటు రైతులకు మెరుగైన ధరలు లభించే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు. ఈ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 22 వరకు మూడు రోజుల పాటు రైతు మేళా నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ మేళాలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన యంత్రాలు, ఆయిల్ పామ్ సాగు విధానాలు, ఉత్పత్తి పెంపు మార్గాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ శాఖల స్టాళ్లు ఏర్పాటు చేసి రైతులకు ప్రత్యక్షంగా సమాచారం అందించనున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు మంత్రి ఆదేశించారు.

## కూలదోసేందుకు యత్నిస్తున్నాం

**(మొదటి పేజీ తరువాయి)**

వాస్తవానికి వారు చెప్పినట్లుగా వారి పరిస్థితి దిగజారి ఉంది, వారు ఒక ఒప్పందం చేసుకోవాలి లేకపోతే ఒప్పందం చేసుకునేట్టుగా చేస్తాం, ఒప్పందాన్ని సులభతరం చేస్తాం' అని చెప్పారు. అమెరికా దళాలు వెనిజులా అధ్యక్ష భవనంపై దాడిచేసి నికొలస్ మదురో, ఆయన భార్యను అపహరించి తీసుకువెళ్ళిన తర్వాత వెనిజులాలో ట్రంప్ కనుసన్నల్లో ఉండే తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్నారు. అప్పటినుండీ క్యూబాకు చమురు సరఫరాలు నిలిచిపోయాయి. అప్పటినుండీ క్యూబా తీవ్ర సంక్షోభంలోకి జారిపోయింది. క్యూబాలో తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానని కొద్ది నెలలుగా ట్రంప్ ప్రకటనలు చేస్తున్నారు. ఆ దేశం లొంగిరాకపోవడంతో ట్రంప్ ఆంక్షలు మితిమీరాయి. దీంతో క్యూబాలో అన్ని కీలక వ్యవస్థలూ పనిచేయని దశలోకి చేరుతున్నాయి. అనివార్యంగా క్యూబా అమెరికాకు వెళ్ళి సహాయం అర్థించాలని ట్రంప్ కోరుకుంటున్నారు. కానీ రాయిటర్స్ వార్తాసంస్థ చెప్పిన సమాచారం ప్రకారం, క్యూబా–అమెరికా మధ్య ఉన్నతస్థాయా చర్చలు జరిగాయన్న వార్తలను క్యూబా పాలకులు ఖండించారు. కానీ క్యూబా మాజీ అధ్యక్షుడు రౌల్ కాస్ట్రో మనుమడు రౌల్ గిల్లెర్మో అమెరికా అధికారులతో అనధికారస్థాయిలో చర్చలు జరిపారని అమెరికా మీడియా వార్తలు ప్రచురించింది. ఫైడల్ కాస్ట్రో అధ్యక్షుడుగా ఉన్నప్పటినుండీ క్యూబాను తన స్వాధీనం చేసుకునేందుకు అమెరికా అనేక దశాబ్దాలుగా ప్రయత్నాలు కొనసాగిస్తూ ఎప్పటికప్పుడు విఫలమవుతూనే ఉంది. దశాబ్దాలుగా క్యూబా దేశం అభివృద్ధి చెందకుండా ఆ దేశ ఎదుగుదలను అమెరికా తన గూఢచారి కార్యకలాపాలు, నియంత్రణలు, ఆంక్షల ద్వారా నిరోధిస్తున్నప్పటి కూడా ప్రజలు, పాలకులు సమైక్యంగా ఈ కుట్రలను దశాబ్దాలుగా ఎదుర్కొంటూ వస్తున్నారు. పశ్చిమార్థగోళం, అక్కడి నీటి వనరులు, సముద్ర జలాలు, భూగర్భవనరులన్నీ అమెరికా నియంత్రణలో ఉండాలనే 19వ శతాబ్దంనాటి మన్రో సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు. మన్రో డాక్ట్రిన్‌కు మా ర్పులు చేసి తన పేరుతో 'డోన్రో డాక్ట్రిన్'ను ముందుకు తెచ్చారు. అనే నినాదంతో కరీబియన్ దేశాలు ముఖ్యం గా కమ్యూనిస్టు పాలనలో ఉన్న దేశాలను కూలగొట్టి కీలుబొమ్మ ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈ పూర్వరంగంలోనే వెనిజులాపై గూండాగిరీ చేసి క్యూబాను ఆర్థికంగా దెబ్బతీశారు. క్యూబాపై ఆర్థిక, చమురు ఆంక్షలను గడచిన నెలరోజులుగా చైనా కూడా తీవ్రంగా ఖండిస్తోంది. క్యూబా దిగ్బంధనాన్ని, ఆంక్షలను ఎత్తివేయాలని చైనా విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ డిమాండ్ చేశారు. మెక్సికో తదితర దేశాలు కూడా సంఘీభావం ప్రకటించాయి.

**(మొదటి పేజీ తరువాయి)**

హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో ప్రారంభమైంది. సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఎస్.బాల్‌రాజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకటరెడ్డి, కె.రామకృష్ణ, సిపిఐ సెంట్రల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కె.నారాయణ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ తన బలమేమిటో నిరూపించుకోవడంతో పాటు తమతో ఎన్నికల అవగాహన లేకపోతే ఏం జరుగుతుందో ఒక ఝలక్ ఇచ్చామన్నారు. సిపిఐ ఏ రాజకీయ పార్టీతో పొత్తు పెట్టుకున్నా, ఆ పార్టీతోనే పొత్తు ధర్మాన్ని తు.చ. తప్పకుండ పాటిస్తుందని, కాని ఇతర పార్టీలు మాత్రం పొత్తు ధర్మాన్ని పాటించడం లేదని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పొత్తు ధర్మానికి విఘాతం కల్గించిందన్నారు. రానున్న ఎన్నికల్లో పొత్తులకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఆయనతోనే స్వయంగా తేల్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. తమతో పొత్తు పెట్టుకున్న రాజకీయ పార్టీలే ప్రయోజనాలు పొందాయని, కానీ తమకు ఆ పొత్తు వల్ల ఒరిగిందేమీ లేదన్నారు. అధికార పార్టీ కాంగ్రెస్‌తో ఇక మీదట పొత్తు ఉన్నా, లేకపోయినా ప్రజా ఉద్యమాలను తీవ్రతరం చేయనున్నామని సాంబశివరావు స్పష్టం చేశారు.

**విదేశాలతో దౌత్య విధానంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి వైఫల్యం : రామకృష్ణ**

కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ దౌత్యవిధానంలో పూర్తిగా వైఫల్యం చెందిందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన

## లక్ష్యం అసాధ్యం

న మాట్లాడుతూ దేశ చరిత్రలో నరేంద్ర మోదీ ఒక అసమర్థ ప్రధాని అని అన్నారు. గత 12 ఏళ్ల పాలనలో మోదీ సాధించింది కేవలం ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండామాత్రమేనని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మౌలికమైన ఏ ఒక్క హామీని కూడా నేరవేర్చలేదని దుయ్యబట్టారు. అందిన కాడికి దండుకునేందుకు కార్పోరేట్ రంగాన్ని పెంచి పోషించడం, ఇందుకు అధికారాన్ని చేజిక్కించుకునేందుకు మతతత్వ రాజకీయాలకు ప్పాలడడమే వారి స్పష్టమైన ఏజెండా అన్ని విమర్శించారు. వీటిని ప్రతిఘుంటించడంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌తో సహా అన్ని రాజకీయ పార్టీలు వైఫల్యం చెందడంతోనే వారు ఆడింది ఆట, పాడింది పాటగా సాగుతోందని తెలిపారు. బిజెపిని నిలువరించేందుకు కమ్యూనిస్టుగా ప్రజా క్షేత్రంలో బలమైన పోరాటాలను నిర్వహించాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. తెలంగాణలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థ ఎన్నికల్లో సిపిఐ రాష్ట్ర సమితి సాధించిన విజయం తిరిగి దేశ కమ్యూనిస్టు శ్రేణులకు కొత్త ఉత్తేజాన్ని ఇచ్చిందని ఆయన తెలిపారు. ఇదే స్పూర్తితో త్వరలో జరగనున్న 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సమాయత్తం అవుతున్నామన్నారు.

**ఆధునిక యుగం నరరూప రక్షసుడు అమెరికా అధ్యక్షుడు**

సామ్రాజ్యవాద అమెరికా బరితెగించి మరీ ఇతర దేశాలపై యుద్ధానికి పాల్పడుతోందని రామకృష్ణ విమర్శించారు. నేటి ఆధునిక యుగం నరరూప రక్షసుడిగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికాను తిరిగి శక్తివంతమైన దేశంగా చేయాలన్న లక్ష్యంగా తలపెట్టిన యుద్ధ కాంక్షతో పరోక్షంగా 30 దేశాలకు పైగా ప్రభావితం అవుతున్నాయన్నారు. ఈ యుద్ధం కారణంగా 85 శాతం ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటున్న భారతదేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని అన్నారు. అయినప్పటికీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా, ఈ యుద్దానికి వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం ఈ దేశ ప్రజలకు అవమానకరమని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, చాడ వెంకట్‌రెడ్డి, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ,రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్ల పల్లి శ్రీనివాస రావు, ఈటి నరసింహా, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కళవేన శంకర్, బాల నరసింహా, ఎమ్మెల్సీ సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

**పలువురికి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సంతాపం**

ఇటీవల మరణించిన సిపిఐ నాయకులకు, ప్రముఖులకు సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సంతాపాన్ని తెలిపింది.సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ల పల్లి శ్రీనివాసరావు సంతాప తీర్మానాన్ని ప్రవేశ పెట్టగా కౌన్సిల్ రెండు నిమిషాలు పాటు మౌనం పాటించి, నివాళులు అర్పించింది. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు నల్లకన్ను, కీ.శే. నల్లమల గిరి ప్రసాద్ సతీమణి కమలాదేవి, కర్నాటకకు చెందిన ట్రేడ్ యూనియన్ నాయకులు ఎస్.వి.ఆనంద్ కుమార్, నేత్ర వైద్యురాలు డాక్టర్ సరస్వతి, విశాఖ పట్నంకు చెందిన అభ్యుదయ రచయిత, మార్కిస్టు నేత చందు సుబ్బారావు తదితరులకు రాష్ట్ర కౌన్సిల్ నివాళులు అర్పించింది.

# కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు ఆది పుష్కరాలు

2028 జూలై 13 నుంచి 24 వరకు అంత్య పుష్కరాలు

తెలంగాణ బ్రాండ్ ప్రతిబింబించేలా ప్రతిష్ఠాత్మక ఏర్పాట్లు

కేబినేట్ సబ్ కమిటీ తొలి సమావేశంలో మంత్రులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కుంభమేళా తరహాలోనే గోదావరి పుష్కరాలనూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని 'గోదావరి పుష్కరాలు 2027' క్యాబినేట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. 'తెలంగాణ బ్రాండ్ మార్మోగేలా... మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన కమిటీ తొలి సమావేశంలో... సభ్యులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. పుష్కర నిర్వహణ తేదీలు, సంబంధిత శాఖల సన్నద్ధత, భవిష్యత్తు కార్యాచరణను సమీక్షించి... అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.... సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సరస్వతీ పుష్కరాలు, సమ్మక్క సారక్క జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహించిందన్నారు.

**అదే స్ఫూర్తితో...** మరింత రెట్టించిన ఉత్సాహంతో రాబోయే గోదావరి పుష్కరాలనూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు ఆది పుష్కరాలు, 2028 జూలై 13 నుంచి 24 వరకు అంత్య పుష్కరాలను నిర్వహించాలని వేద పండితులు నిర్ణయించారన్నారు. సుమారు 8 కోట్ల మంది భక్తులు ఈ పుష్కరాలకు తరలి వచ్చే అవకాశముందని, అందుకు అనుగుణంగానే గోదావరి ప్రవహించే జిల్లాల్లో... ప్రముఖ దేవాలయాలను అనుసంధానిస్తూ... 96 ప్రాంతాలను పుష్కరాల కోసం ప్రత్యేకంగా ఎంపిక చేశామన్నారు. గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆయా చోట్ల క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఘాట్లు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర, జిల్లా ప్రణాళికలను ప్రత్యేకంగా రూపొందిస్తున్నామన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వీలైనంత వేగంగా పనుల్ని ప్రారంభించేలా ముమ్మర కసరత్తు చేస్తున్నామన్నారు. ఈ నెల చివరి నాటికి డీపీఆర్ లను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. తొలి దశలో భాగంగా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు రద్దీ అధికంగా ఉండే తొమ్మిది ప్రాంతాలను 'టైర్ – 1' కింద ఎంపిక చేశామన్నారు. సమన్వయలోపం తలెత్తకుండా గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్, శాఖల వారీగా నోడల్ అధికారులను నియమిస్తామన్నారు.

ప్రతి ఘాట్ దగ్గర ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఎమర్జెన్సీ రూట్, అత్యాధునిక వైద్య సౌకర్యాలు, పార్కింగ్ తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. పుష్కర ఏర్పాట్లలో రాజీపడే ప్రసక్తే లేదని, పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అత్యంత పకడ్బందీగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

# రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ ఇసుక తవ్వకాలపై విజిలెన్స్ దాడులు

భారీగా ఇసుక, యంత్రాలు స్వాధీనం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో అక్రమ ఇసుక తవ్వకాలపై విజిలెన్స్,ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు భారీ స్థాయిలో దాడులు నిర్వహించినట్లు విజిలెన్స్ డిజి శిఖాగోయాల్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 9, 10 తేదీలలో నారాయణపేట, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో భారీగా అక్రమంగా తవ్విన ఇసుకను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారులు అందిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా హైదరాబాద్ సిటీ–2 యూనిట్, వరంగల్ యూనిట్ బృందాలు సమన్వయంతో దాడులు నిర్వహించాయి. నారాయణపేట జిల్లా మరికల్ మండలం రాకొండ గ్రామం, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం గురుకొండ గ్రామం, ఖమ్మం జిల్లా ముదిగొండ మండల పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా కోయిల్‌సాగర్ ప్రాంతంలోని ఊకచెట్టు వాగు, మున్నేరు వాగు పరిసరాల్లో పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు సాగుతున్నట్లు తేలింది. దాడుల సందర్భంగా సుమారు 1,875 మెట్రిక్ టన్నుల అక్రమ ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. అలాగే అక్రమ తవ్వకాలకు వినియోగిస్తున్న 4 ఎక్స్కవేటర్లు, 2 టిప్పర్లు, 7 ట్రాక్టర్లును కూడా అధికారులు సీజ్ చేశారు. ఈ ఘటనలకు సంబంధించి నారాయణపేట జిల్లా మరికల్ పోలీస్ స్టేషన్, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర పోలీస్ స్టేషన్, ఖమ్మం జిల్లా ముదిగొండ పోలీస్ స్టేషన్‌లలో మూడు కేసులు నమోదు చేశారు. మొత్తం 13 మందిని నిందితులుగా గుర్తించగా, వారిలో 7 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), మైన్‌లు మరియు ఖనిజాల అభివృద్ధి నియంత్రణ చట్టం, అలాగే పబ్లిక్ ప్రాపర్టీ నష్టం నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ ఆస్తుల దోపిడీ, అక్రమ తవ్వకాలు, అనుమతులు లేకుండా ఖనిజాల రవాణా, నిల్వ వంటి ఆరోపణలు నమోదు అయ్యాయి. ఖమ్మం జిల్లాలో రాత్రి వేళల్లో మున్నేరు వాగు నుండి స్థానికులు ఇసుక తవ్వి ట్రాక్టర్ల ద్వారా ఖమ్మం పట్టణానికి తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎక్స్కవేటర్లు, సక్షన్ పంపులతో వాగుల్లో ఇసుక తవ్వి పెద్ద మొత్తంలో నిల్వ ఉంచినట్లు దర్యాప్తులో బయటపడింది. టిప్పర్లు వెళ్లేందుకు వాగుల వద్ద మట్టి రహదారులు కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తించారు.



విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ మాట్లాడుతూ అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టేందుకు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సహజ వనరులను రక్షించడం, ప్రభుత్వ ఆదాయ నష్టాన్ని నివారించడం కోసం ఇటువంటి దాడులు కొనసాగుతాయని పేర్కొన్నారు.

# కవిత దీక్ష భగ్నం

హైదరాబాద్ తరలింపు

జాగృతి కేంద్ర కార్యాలయం వద్ద దీక్ష



**ప్రజాపక్షం/ఖమ్మం/హైదరాబాద్ :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత దీక్షను మంగళవారం ఉదయం పోలీసులు భగ్నం చేశారు. వెలుగుమట్ల బాధితులకు మద్దతుగా సోమవారం ఆందోళన చేపట్టిన కవితను అరెస్టు చేసి ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి సాయంత్రం విడుదల చేశారు. అక్కడి నుంచి నేరుగా అంబేడ్కర్ భవన్‌కు చేరుకుని బాధితులతో కలిసి సోమవారం రాత్రి దీక్ష చేపట్టగా పెద్ద సంఖ్యలో పోలీసులు అంబేడ్కర్ భవనం వద్దకు చేరుకుని కవిత ఆమెతో పాటు దీక్ష చేస్తున్న విశారదన్‌ను అదుపులోకి తీసుకున్నారు. కవితను హైదరాబాద్ తీసుకెళ్లి జాగృతి కార్యాలయం వద్ద వదిలేశారు. జాగృతి కార్యాలయం వద్ద ఆమె తిరిగి నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని, భూదాన్ భూముల్లోనే వెలుగుమట్ల బాధితులకు పట్టాలు ఇచ్చి ఇండ్లు కట్టించి ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. భూదాన్ భూములను ఆక్రమించుకునే హక్కు ప్రభుత్వానికి లేదని ఆమె తెలిపారు. రాజ్యాంగం పట్టుకుని నిరంతరం మాట్లాడే రాహుల్ గాంధీకి వెలుగుమట్ల బాధితుల గోడు వినిపించడం లేదా అని ఆమె ప్రశ్నించారు. ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో మరో 30 ఎకరాలు ఆక్రమణలకు గురైందని దానిని వెలికితీసి పేదలకు పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. వెలుగుమట్ల బాధితులకు ఇండ్లు నిర్మించి ఇచ్చేంత వరకు తమ ఆందోళన కొనసాగుతుందని ఆమె తెలిపారు.

# ఎన్నికల హామీలపై ఎగిరెగిరి పడుతున్న కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇప్పటికీ రెండున్నరేళ్లు కూడా పూర్తి కాలేదని, అప్పుడే ఎన్నికల హామీలపైన కెటిఆర్ ఎగిరెగిరి పడుతున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీల అమలుపైన అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతామని చెబుతున్న కెటిఆర్, బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో వారు ఇచ్చిన హామీలలో కనీసం సగం కూడా అమలు చేయలేదని, అందుకే బిఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయిందని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్ మాటలు చూస్తేంటే అసెంబ్లీ సమావేశాలను ఎలా అడ్డుకోవాలనే అంశంపైన బిఆర్ఎస్ ఎంఎల్ఎలకు శిక్షణఇచ్చినట్టుగా ఉందన్నారు.అధికారం కోల్పోయిన తర్వాత కెటిఆర్‌కు మతి భ్రమించిందని, ఆయన దనమదంతో విచిత్ర విన్యాసాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే సాధ్యమైన హామీలన్నింటిని నేరవేర్చామన్నారు. కెటిఆర్ ముందుగా ప్రతిపక్ష నేత కెసిఆర్‌ను అసెంబ్లీకి తీసుకురావాలని, ప్రతి ప్రశ్నకు తమ ప్రభుత్వం, సిఎం సమాధానం చెబుతారని సూచించారు. ప్రతిపక్ష నాయకున్ని ఫామ్ హౌస్ లో కూర్చొబెట్టి, కెటిఆర్, హరీష్ రావు ఇద్దరూ అసెంబ్లీని కొనసాగకుండా చేస్తామంటే తాము వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు.

# అసెంబ్లీలో ప్రైవేటు బిల్లు ప్రవేశపెడతాం

'ఆరు గ్యారంటీ'ల చట్టబద్ధతపై కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ఆరు గ్యారంటీ'లకు చట్టబద్ధత కల్పించేందుకు శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో బిఆర్ఎస్ తరపున ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టనున్నట్టు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు తెలిపారు. అధికారంలోకి రాగానే తొలి క్యాబినెట్ సమావేశంలోనే 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని, ఆ మాటను మరిచిపోయిందని విమర్శించారు. బిఆర్ఎస్ ఎంఎల్ఎలు,ఎంఎల్‌సిలతో గోల్కొండ రిసార్ట్స్‌లో మంగళవారం ఓరియంటేషన్ సమావేశం నిర్వహించారు. సమావేశనంతరం కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వ కాలం సగం పూర్తయిందని,హామీల అమలులో ప్రజలు ఇచ్చిన వ్యవధి కూడా అయిపోయిందన్నారు. కాంగ్రెస్ హామీల అమలు వైఫల్యాన్ని, ప్రభుత్వ మోసాన్ని ఎండగట్టేందుకు ఈ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపైన సమావేశంలో చర్చించామన్నారు.

సిఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారో ఆయనకే తెలియదని, సిఎం తీసుకున్న నిర్ణయాలే సిఎంకు తెలియదని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ఎల్పి ఉప నాయకులు తన్నీరు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితాఇంద్రారెడ్డి శాసనమండలిలో ప్రతిపక్షనేత మదుసూదనాచారితో పాటు ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు పాల్గొన్నారు.

# ప్రారంభమైన సివిల్ డిఫెన్స్ వాలంటీర్ శిక్షణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ సివిల్ డిఫెన్స్ విభాగం ఆధ్వర్యంలో యువతకు అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించే విధంగా సివిల్ డిఫెన్స్ వాలంటీర్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమం మార్చి 10 నుంచి మార్చి 16 వరకు ఏడు రోజుల పాటు నిర్వహించనున్నారు. సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ సెంచెనరీ డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమాన్ని మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ అరుణ ఎం. బహుగుణ ప్రారంభించారు. అత్యవసర సేవలు చేరుకునేలోపు మొదటి స్పందనకర్తలుగా (ఫస్ట్ రెస్పాండర్స్) యువత పనిచేయగలిగేలా ఈ శిక్షణ ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఈ శిక్షణలో వాలంటీర్లకు రక్షణ చర్యలు, అగ్ని మాపక విధానాలు, ఫస్ట్ ఎయిడ్ చికిత్స, గుంపుల నియంత్రణ, సహాయ సామగ్రి పంపిణీ వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. అలాగే ఎయిర్ రైడ్స్, రసాయన దాడులు, అణు దాడులు, ఇతర విపత్తుల సమయంలో ప్రజలకు సహాయం చేసే విధానాలను కూడా నేర్పించనున్నారు. ఈ వాలంటీర్లు పోలీస్, ఫైర్ సర్వీసెస్, ఎస్డీఆర్ఎఫ్ తదితర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయనున్నారు. ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ, సివిల్ డిఫెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. వాలంటీర్ల సమాజ నిర్మాణం అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఫ్ఓ బి. సుధాకర్ రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ మారియ ప్పన్, డీన్ డాక్టర్ కళ్యాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ మొహమ్మద్ అబ్దుల్ రహీమ్, డిఎఫ్ఓ దాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.




# భగత్ సింగ్ జీవిత చరిత్రను యువత అధ్యయనం చేయాలి : ఎఐవైఎఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ స్వాతంత్రోద్యమంలో తృణ ః ప్రాయంగా ప్రాణాలను అర్పించిన భగత్ సింగ్ జీవిత చరిత్ర ను నేటి విద్యార్థులు, యువత అధ్యయనం చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్రలు పిలుపునిచ్చారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతి సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ లోని సత్య నారాయణ రెడ్డి భవన్ వద్ద హోర్డింగ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. వాస్తవ చరిత్రను పఠనం చేయకపోతే, గోబెల్స్ ప్రచారం చేసే వారు చెప్పే చరిత్రే వాస్తవం అని నమ్మే నీచ పరిస్థితులు నేడు సమాజంలో చూస్తున్నామన్నారు. అందుకే దేశం కోసం నిస్వార్థంగా పోరాడిన భగత్ సింగ్ అడుగుజాడల్లో నడవాలని వారు ఉద్ఘాటించారు.మార్చ్ 23న భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతి సందర్భంగా హిమాయత్ నగర్ లోని ఎఐటియూసి కార్యాలయం నుండి రామ్ కోఠి లోని భగత్ సింగ్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమానికి పలువురు సినీ ప్రముఖులు, సామాజిక నేతలు, తెలంగాణ రాష్ట్ర ప్రజా నాట్యమండలి కార్యదర్శి పల్లె నర్సింహా కళాకారుల బృందం హాజరుకానున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ , రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ శంకర్, టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, నేతలు కళ్యాణ్, అనీల్ కుమార్, భాను, సిద్ధార్థ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను నెలకొల్పాలి

ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ.స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను సందర్శించిన ఎఐఎస్ఎఫ్ బృందం



మంచాల/ఆరుట్ల: రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో మోడల్ గా నిర్మిస్తూ అభివృద్ధి చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ మోడల్ ను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయాలని, అందుకు గాను ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. మంగళవారం నాడు రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో మోడల్ గా నిర్మిస్తూ అభివృద్ధి చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ మోడల్ ను ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర బృందం సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ ఐఎఎస్(రిటైర్డ్ గారితో, విద్యార్థులతో, ఉపాధ్యాయులతో, పేరెంట్స్ కమిటీ సభ్యులతో ఎఐఎస్ఎఫ్ బృందం పలు అంశాలపై మాట్లాడడం జరిగింది. అనంతరం ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ లు మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ స్కూల్ లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించి ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను మోడల్ గా మొట్ట మొదటిసారి ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ స్కూల్ సుమారు 6 ఎకరాల్లో ప్రీ ప్రైమరీ స్కూల్ నుండి ఇంటర్మీడియట్ వరకు అన్ని సౌకర్యాలతో టీచింగ్, నాన్ టీచింగ్ మరియు సెక్యూరిటీ సిబ్బందిని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడం, బస్ రవాణా సౌకర్యం ఏర్పాటు చేయడం, ఏ స్కూల్ ఆ స్కూల్ కు ప్లే స్కూల్, ఆట స్థలం, ఆట సామాగ్రి, గ్రంథాలయాలు, వారికి తగిన నాణ్యమైన భోజన సౌకర్యం ఏర్పాటు చేయడం మరియు నాణ్యమైన విద్యా బోధన అందించడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భన కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ రెహమాన్, గ్యార క్రాంతి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్, జిల్లా కార్యదర్శి వంశీవర్ధన్ రెడ్డి, రాష్ట్ర అన్వర్, ఆకాష్, హరీష్ పాల్గొన్నారు.

GHMC

## గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: డివిజన్-31, జిహెచ్ఎంసి.

NIT No. 08 karwan : NIT No.08/E.E.30/GHMC/2025-26 — తేదీ: 09.03.2026

పని పేరు: జిహెచ్ఎంసి, కెజెడ్, డివిజన్-31 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు, అంచనా విలువ: రూ.71.50 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 10.03.2026న ఉ.11.00గం.ల నుండి మరియు బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 13.03.2026న ఉ.11.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-31, జిహెచ్ఎంసి 5వ అంతస్తు అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-31, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 16715-PP/CL/ADVT/1/2025-26, Date: 10-03-2026

## మక్తల్ మునిసిపాలిటీ, నారాయణపేట జిల్లా.

Lr.No. 32/E1/MCM/MKL/2026 — కొటేషన్ ఆహ్వాన నోటీసు — తేదీ: 10.03.2026

పనుల పేరు: మక్తల్ మునిసిపాలిటీలో నగర అభివృద్ధి గ్రాంట్ల క్రింద శానిటేషన్ కొరకు ట్రాక్టర్ (1 నెం.లు) సేకరణ.

| క్ర.సం. | ఐటమ్‌ల వివరణ | పరిమాణం | యూనిట్ ధర (రూ.) | మొత్తం ధర |
|---|---|---|---|---|
| 01 | స్పెసిఫికేషన్:<br>ట్రైలర్‌తో కూడిన ట్రాక్టర్ ఇంజిన్, వాటర్ ట్యాంకర్‌తో సహా:<br>పవర్: 42HP<br>సామర్థ్యం: 5-టన్నులు, 8.25x20 (టిప్పింగ్ / హైడ్రాలిక్) కలిగిన 2-చక్రాల ట్రైలర్<br>ప్లాట్‌ఫారమ్ పరిమాణం: 10'.6''x6'.0'' x3')<br>తయారీదారు: మహీంద్రా<br>TR, బీమా, GST సహా.<br>కొటేషన్ సమర్పణ తేదీ: 11.03.2026 @ 11.00AM.<br>కొటేషన్ సమర్పణకు చివరి తేదీ: 13.03.2026 @ 4.00PM<br>కొటేషన్ తెరవడం: 13.03.2026 సాయంత్రం 4.30 గంటలకు.<br>మరిన్ని వివరాలకు సంప్రదించండి: 7702370936,9618402714 | 01 | - | - |

సం/- కమిషనర్, మక్తల్ మునిసిపాలిటీ.

DIPR R.O. No. : 16732-PP/CL/ADVT/1/2025-26, Date: 10-03-2026

# స్త్రీ విద్య, సమానత్వం కోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి ఫూలే

భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత దేశంలో స్త్రీ విద్య, సమానత్వం కోసం జీవితాంతం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి కొనియాడారు.భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, మహిళా, నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన సావిత్రి బాయి పూలే 129వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంమఖ్దూమ్ భవన్‌లో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర నేతలు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నేదునూరి జ్యోతి మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే ఆధునిక మహిళా విద్య విప్లవానికి మార్గదర్శిగా నిలిచారని, కుల వివక్షకు వ్యతిరేకంగా, వితంతు పునర్ వివాహాలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేశారన్నారు.రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన మాట్లాడుతూ ఎన్నో అవరోధాలను ఎదుర్కొంటూ సమాజంలో సమానత్వం కోసం పాటుపడిన సావిత్రిబాయి పూలే జీవితం ఎందరికో స్పూర్తిదాయకమని అలాంటి మహనీయురాలు బాటలో సమాజ సేవలో నేటి తరం ముందుకు సాగాలని సూచించారు.

కార్యనిర్వహక అధ్యక్షురాలు మండ సదాలక్ష్మి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే దేశంలోని తొలి మహిళా ఉపాధ్యాయులలో ఒకరని, బ్రాహ్మణీయ అగ్రవర్ణాల నుండి తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొంటూ, విద్య ద్వారా మహిళలను సాధికారపరచడానికి తన జీవితాన్ని గడిపారని గుర్తు చేశారు.

సార్వత్రిక హక్కులు , సమానత్వం కోసం సావిత్రిబాయి పూలే బోధనలు మనందరికీ ఆదర్శం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్. ఛాయాదేవి, ముడుపు నళినీ, సహాయ కార్యదర్శి లతాదేవి, కార్యవర్గ సభ్యులు సుగుణమ్మ, విజయలక్ష్మి పండిట్, మహాలక్ష్మి , మాదవి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానము

మన్యముకొండ, మహబూబ్‌నగర్ మండలము మరియు జిల్లా, తెలంగాణ రాష్ట్రము.

ఆర్.సి.నెం.28/SLVDM/202-5 — నోటిఫికేషన్ — తేదీ: 10-03-2026

శ్రీయుత కమీషనర్, దేవాదాయ ధర్మాదాయశాఖ, తెలంగాణ హైద్రాబాద్ వారి ఉత్తర్వులు మెమో ఇన్ ఆర్.సి.నం. సి1/7/2025, తేది 04-11-2025 & ఆర్.సి. సి1813/2026 తేది 18-02-2026 ననుసరించి శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానము మన్యంకొండ నందు క్యాడరు స్ట్రెంతు ప్రకారము ఖాళీగాగల మతపర పోస్టులను టైం స్కేలుపై భర్తీ చేయుటకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడమైనది.

| క్రమ సంఖ్య | మత సిబ్బంది పోస్టుల వివరాలు | ఖాళీగా గల పోస్టుల సంఖ్య | ఆగమము/సాంప్రదాయము | అర్హతలు |
|---|---|---|---|---|
| 1 | అరక | 2 | శ్రీచాత్తాద శ్రీ వైష్ణవ ఆగమము | ప్రవేశ |
| 2 | పరిచారిక | 1 | శ్రీచాత్తాద శ్రీ వైష్ణవ ఆగమము | - |
| 3 | పాచక | 1 | శ్రీచాత్తాద శ్రీ వైష్ణవ ఆగమము | - |

పై ప్రకారముగా ఖాళీగాగల పోస్టులను టైం స్కేలుపై భర్తీ చేయుటకు ప్రభుత్వ ఉత్తర్వులు జి.ఓ.ఎమ్. యస్.నెం.261, రెవెన్యూ (ఎండోమెంట్స్-1) డిపార్టుమెంట్ తేది 20-05-2002 మరియు ప్రభుత్వఉత్తర్వులు జి.ఓ. ఎమ్. యస్. నం. 888 రెవెన్యూ (ఎండోమెంట్స్-1) డిపార్టుమెంటు తేది 08-12-2000 ఉత్తర్వుల ప్రకారము అర్హత కలిగిన ఉన్న 18-46 సంవత్సరముల మధ్య వయస్సు గలవారై, హిందూ మతస్థులైన సాంప్రదాయానుసారులైన, సత్ ప్రవర్తన, దేవస్థాన ఆగమ విధానలపై పరిజ్ఞానంతో పాటు సనాతన సాంప్రదాయం, ఆగమ వ్యవహారములపై అవగాహన కలిగియున్న పురుష అభ్యర్థుల నుండి ధరఖాస్తులు కోరడమైనది.

పై పోస్టులకు దేవాదాయ ధర్మాదాయశాఖవారిచే నియామకము కాబడిన సెలక్షన్ కమిటీ సభ్యులచే వ్రాత మౌఖిక పరీక్షలు నిర్వహించి అట్టి పలితముల ఆధారముగా శ్రీయుత కమీషనరు, దేవాదాయ ధర్మాదాయ శాఖవారి అనుమతి ఉత్తర్వులకు లోబడి మాత్రమే తుది ఎంపిక చేయబడును. పై పోస్టులకు ధరఖాస్తుచేసుకొను అభ్యర్థులు తేది 01-11-2025 నాటికి కనిష్టముగా 18 సంవత్సరముల వయస్సు నిండియుండి గరిష్టముగా 46 సంవత్సరముల వయస్సు మించకుండా దేవాదాయ ధర్మాదాయశాఖ చట్టం 30/87 నందిలి సెక్షన్ 36 నిబంధనలకు క్రమబద్దులై అట్టి అర్హతగల తెలంగాణ రాష్ట్రమునకు చెందిన అభ్యర్థులు మాత్రమే కార్యాలయము నందు లభ్యమగు ధరఖాస్తు ఫారములు పూర్తి వివరములతో పూరించి, విద్య అర్హత ప్రతులతో జనన, స్థానిక, కులధృవీకరణ ప్రతులను జతపరచి తేది 25-03-2026 సాయంత్రం 5-00 గంటల లోపు కార్యనిర్వహణాధి కారిశ్రీ మన్యంకొండ దేవస్థానము నందు సమర్పించవలెను, ఇతరవివరములకై ఈ దేవస్థాన కార్యాలయ పనివేళ్లలో సంప్రదించగలరు సెల్ నం. 9989784032, 9492000909.

వ్యవస్థాపక ధర్మకర్త — సహాయ కమీషనర్ / కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 16735-PP/CL/ADVT/1/2025-26, Date: 10-03-2026

# ప్రజాప్రతినిధులకు శిక్షణతోనే..

# సంక్షేమ పథకాల విజయవంతం

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 12వ తేదీన నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

99 రోజుల ప్రణాళికలో భాగంగా ఇప్పటివరకు ఫైళ్ల క్లియరెన్స్, పారిశుధ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించినందుకు కలెక్టర్‌లను రామకృష్ణా రావు అభినందించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, చైర్మన్లు, మేయర్లకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన శిక్షణా కార్యక్రమ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా రామకృష్ణా రావు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన ఫలితాలు అందుతాయని ముఖ్యమంత్రి ఆకాంక్షను గుర్తుచేశారు.

రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల అమలులో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంపై స్పష్టతనివ్వాలన్నారు. సెర్ప్ సి.ఇ.ఓ దివ్య ఇప్పటికే దీనికి సంబంధించిన ట్రైనింగ్ మాడ్యూల్స్ కలెక్టర్లకు పంపినట్లు తెలిపారు.



## ప్రజల ముంగిటకు ప్రణాళికతో ప్రజాపాలన

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్:** ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు అర్హులైన ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలను నేరుగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనప్రగతి ప్రణాళిక పేరుతో 99 రోజుల కార్యాచరణను అమలు చేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. మంగళవారం నకిరేకల్ పట్టణంలోని నారాయణరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. 99 రోజుల ప్రత్యేకార్యాచరణలో ప్రతి శాఖ తమ పరిధిలోని సమస్యలను గుర్తించి పరిష్కరించాలనిఅధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉగాది సందర్భంగా సామూహిక గృహప్రవేశాల కోసం చివరి దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి, ఐడీఓ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి,హౌసింగ్ పీడీ రాజకుమార్, డిహెచ్ శ్రీనివాస్,అక్బర్ అలీ,నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత శ్రీనివాస్,చిట్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీత రమేష్ పాల్గొన్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు...

జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** అర్హత కలిగిన వారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం జరుగుతుందని, అర్హత లేనివారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం కుదరదని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. ఇల్లులేని నిరుపేదలకు ఇల్లు అందించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని, ఇందిరమ్మ ఇండ్ల బ్లాకులు, అంతర్గత రోడ్లు, సభాస్థలాన్ని మంగళవారం పరిశీలించి పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈనెల 24 వారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ మోడల్ హౌసింగ్ కాలనీని ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హత లేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని స్పష్టం చేశారు. అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ పిడి సిద్ధార్థ, పిడి హార్టికల్చర్ నాగయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, ఈఈ మిషన్ భగీరథ కుమారరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ కవిత, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాలు రోల్ మోడల్‌గా నిలవాలి

దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ :** గ్రామాలు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో గ్రామాలు రోల్ మోడల్‌గా నిలవాలని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం కట్టకొమ్ముతండా పరిధిలోని జల్లాండాలో అధికారులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కట్టకొమ్ముతండా రోల్ మోడల్‌గా నిలవాలని సూచించారు. తండా పరిసరాల పరిశుభ్రతతో పాటు తండా సమస్యల పరిష్కారానికి అధికారులు, గ్రామస్తులంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో నేనావత్ జ్యోతి ప్రసన్న,సర్పంచ్ నేనావత్ జ్యోతి పాండునాయక్, మాజీ జెడ్పీటీసీ అరుణ సురేష్‌గౌడ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కొర్ర రాంసింగ్ పాల్గొన్నారు.

## త్వరితగతిన 'డబుల్' పెండింగ్ పనులు

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**ప్రజాపక్షం/భువనగిరి :** డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం భువనగిరి మండలంలోని సింగన్నగూడెంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద ఇంకా ఏవి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రస్తుతం జరుగుతున్న పనులు ఏవి అవి ఏవి దశలో ఉన్నాయని, మిగిలిన పనులు ఎప్పటి వరకు పూర్తి చేస్తారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా మిగిలిన పనులు ప్రారంభించకపోవడానికి గల కారణాలు ఏమిటి అని అడిగి తెలుసుకున్నారు. త్వరగా అన్ని పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి రాములు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నేత కార్మికుడి మృతి

**ప్రజాపక్షం/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల పరిధిలోని ఎల్లంకి గ్రామానికి చెందిన మిర్యాల బాలరాజు నేత కార్మికుడిగా జీవిస్తున్నాడు. గత ఐదు సంవత్సరాల క్రితం భువనగిరిలోని 5 స్టార్ ఫైనాన్స్ కంపెనీలో రూ.3 లక్షల 50 వేలు అప్పుగా తీసుకున్నాడు. ఈఎంఐలు కడుతూ గత రెండు నెలల నుండి నేతపని నడవకపోవడంతో ఈఎంఐలు కట్టలేకపోయాడు. దాంతో మనస్తాపానికి గురై మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు త్రాగి చనిపోయాడు. మృతుని భార్య మిర్యాల అండాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నాగరాజు తెలిపారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

99రోజుల ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/కోదాడ:** ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో బాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమాన్ని అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం కోదాడ మున్సిపాలిటి పరిధిలోని 21వ వార్డులో పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి ఇంటి నుండి తడిచెత్త,పోడి చెత్తను వేరుచేసి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని ప్రజలకు సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. వార్డుల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రపరిచే పనులు, రోడ్డు పరిశుభ్రత వంటి కార్యక్రమాలను ప్రజా ప్రతినిధులు, అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, అందంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసి పని చేయాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్ కట్టలోనిశ్రీ సాయి భవాని మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడ కిచెన్ షెడ్, టాయిలెట్స్, వంటశాల, కంప్యూటర్ గదులను, తదితర సదుపాయాలను పరిశీలించారు. పాఠశాలకు సంబంధించిన బిల్లులు ఆన్‌లైన్‌లో ఎలా చేస్తారో అడిగి తెలుసుకున్నారు. 10 వ తరగతి విద్యార్థినులతో మాట్లాడుతూ మంచి మార్కులు సాధించాలని, ప్రతి సబ్జెక్టులో కనీసం 70 శాతం మార్కులు పొందాలని కోరారు. అనంతరం విద్యార్థినులకు ఎగ్జామ్స్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం కోదాడ రెవిన్యూ డివిజన్ అధికారి, తహసిల్దార్ కార్యాలయాలను తనిఖీ చేసి, పెండింగ్ ఫైల్స్‌ను త్వరగా క్లియర్ చేయాలని సూచించారు. తాగునీరు, విద్య, వైద్యం సంబంధిత దరఖాస్తులను 10 రోజుల్లో పరిష్కరించాలని అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నంబాబు, కోదాడ ఆర్డీవో సూర్యానారాయణ, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లీశ్వరీ, కౌన్సిలర్ జ్యోతి, కోదాడ తహసిల్దార్ వాజీద్‌అలీ, మండల విద్యాధికారి సలీంషరిఫ్,ప్రధానోపాధ్యాయురాలు సుశీలబాయ్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వైన్‌షాప్ దొంగతనం కేసులో అంతరాష్ట్ర దొంగ అరెస్ట్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మిర్యాలగూడ రోడ్‌లో ఉన్న మహాలక్ష్మి వైన్ షాప్‌లో జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించి, అంతరాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లు నల్లగొండ డీఎస్‌పి కె.శివరాం రెడ్డి తెలిపారు. మంగళవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 7న తేదీన రాత్రి పట్టణంలోని మిర్యాలగూడ రోడ్‌లో గల మహాలక్ష్మి వైన్ షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తి సుమారు రూ.5 లక్షలకు పైగా నగదు దోచుకెళ్లినట్లు షాప్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని తెలిపారు. వైన్‌షాప్ దొంగతనం కేసులో సీసీటీవీ కెమెరాల సహాయంతో వన్ టౌన్ పోలీసులు కేసు ఛేదించినిందితుడి వద్ద నుండి రూ.1.77లక్షల నగదు ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. జిల్లాను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఆధ్వర్యంలో నేను సైతం కార్యక్రమం ద్వారా వ్యాపార సంస్థలు,షాపులు వార్డులలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారస్తులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా పలుమార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కేసును ఛేదించడంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ ఇన్స్పెక్టర్ ఏ.రాజశేఖర్ రెడ్డి, ఎస్‌ఐలు సతీష్,లచ్చిరెడ్డి, వెంకటనారాయణ , సిబ్బంది అంజయ్య, రబ్బానీ శ్రీనులను డీఎస్పీ అభినందించారు.

# రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం!



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరి నరసింహుడికి భక్తులు తమ భక్తిని రికార్డు స్థాయిలో చాటుకున్నారు. క్షేత్రంలో ఇటీవల ముగిసిన బ్రహ్మోత్సవాల నేపథ్యంలో స్వామివారికి హుండీ ద్వారా భారీగా ఆదాయం సమకూరింది. గత 28 రోజులకు సంబంధించిన కానుకలను మంగళవారం ఆలయ అధికారులు కట్టుదిట్టమైన భద్రత నడుమ లెక్కించారు.

**రూ. 1.86 కోట్ల నగదు సేకరణ :** ఈ లెక్కింపులో స్వామివారికి నగదు రూపంలో భారీ మొత్తం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఈవో భవాని శంకర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. రూ.1,86,44,511 (కోటి ఎనభై ఆరు లక్షల నలభై నాలుగు వేల ఐదు వందల పదకొండు రూపాయలు). బంగారం: 57.500 గ్రాముల మిశ్రమ బంగారం. వెండి: 2 కిలోల 750 గ్రాముల మిశ్రమ వెండి. బ్రహ్మోత్సవాల కారణంగా భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడమే ఈ భారీ ఆదాయానికి ప్రధాన కారణమని అధికారులు భావిస్తున్నారు. కొండపై ఉన్న హుండీ లెక్కింపు హాల్లో బ్యాంకు ప్రతినిధులు, ఆలయ సిబ్బంది సమక్షంలో ఈ ప్రక్రియను నిర్వహించారు.

**హుండీలో విదేశీ కరెన్సీ సందడి :** యాదగిరి లక్ష్మి నరసింహ స్వామి కీర్తి ఖండాంతరాలు దాటిందనడానికి హుండీలో లభించిన విదేశీ కరెన్సీ సాక్ష్యంగా నిలుస్తోంది. పలు దేశాలకు చెందిన భక్తులు స్వామివారికి తమ కానుకలను సమర్పించారు.

**విదేశీ కరెన్సీ వివరాలు:** అమెరికా 329 డాలర్లు, వియత్నాం 3,01,000 డోక్స్, హాంకాంగ్ 510 డాలర్లు, కెనడా 160 డాలర్లు, ఇంగ్లాండ్ 40 పౌండ్లు, వీటితో పాటు ఇండోనేషియా, సౌత్ ఆఫ్రికా, ఆస్ట్రేలియా, యూరోప్, మలేషియా వంటి దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు కూడా లభించినట్లు అధికారులు తెలిపారు.

## వరిపొలాల పరిశీలన

**ప్రజాపక్షం/మునగాల:** వరిపొలాల్లో వరికి తెగులు, మెడవిరుపు, కంకితెగులు వల్ల కాటుక తెగుళ్లు సోకినట్లు గుర్తించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి బుంగరాజు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ముకుందాపురంలో రైతు బోళ్ల గోపిరెడ్డి డిఆర్‌ఆర్15 వరి పొలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పొలానికి అగ్గి తెగులు సోకినట్లయితే అజాక్సిస్ట్రోబిన్, ట్రైసైక్లోజోల్ , మాంకోజబ్, పికోక్సిస్ట్రోబిన్ మందులను కలిపి పిచికారి చేయాలన్నారు. మెడ విరుపుకు పైన తెలిపిన మందులతో పాటు పెనోక్సానిల్, ఐసోప్రోథయోలిన్ కలిపి పిచికారి చేయాలన్నారు. కంకినల్లి వ్యాధి సోకితే ప్రొపెనోపాస్, కాటుక తెగులు కూడా మందులు పిచికారి చేసి వరి పొలాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ విస్తరణ అధికారి మహిత, రైతులు బోళ్ల గోపిరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.



# శిథిలావస్థలో నాగార్జునసాగర్ గ్రేడ్-2 గ్రంథాలయం

50 ఏళ్ల చరిత్ర కలిగిన విజ్ఞాన మందిరం నిర్లక్ష్యానికి బలి

పైకప్పు పెంకులు కూలిపడే ప్రమాదం...

పాఠకుల భద్రతపై ఆందోళన

**ప్రజాపక్షం/నందికొండ:** విజ్ఞానాన్ని పంచే ఆలయంగా,విజ్ఞాన దర్శిని"గా పేరుగాంచిన నాగార్జునసాగర్‌లోని గ్రేడ్2 గ్రంథాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. దాదాపు ఐదు దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ గ్రంథాలయం గత 50 సంవత్సరాలుగా విద్యార్థులు,నిరుద్యోగులు, ఉద్యోగస్తులు, పుస్తకాభిమానులకు జ్ఞానదీపికగా నిలుస్తూ వచ్చింది. అయితే ప్రస్తుతం ఈగ్రంథాలయ భవనం తీవ్ర నిర్లక్ష్యానికి గురై ప్రమాదకర స్థితిలో ఉంది.గ్రంథాలయం పైకప్పుకు అమర్చిన మట్టి పెంకులు,రాళ్లు కూలిపడే పరిస్థితి ఏర్పడింది. మరికొన్ని చోట్ల పైకప్పుల్లో పెద్ద పెద్ద బొక్కలు ఏర్పడ్డాయి.దీంతో వర్షాకాలంలో వర్షపు నీరు లోపలికి చేరే పరిస్థితి ఉందని పాఠకులు చెబుతున్నారు.వర్షం పడినప్పుడు గ్రంథాలయంలో ఉన్న విలువైన పుస్తకాలు తడిచిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పాఠకులు చదువుతున్న సమయంలోనే పైకప్పు నుంచి పెంకులు, రాళ్లు కిందపడే ప్రమాదం ఉండటంతో వారి భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. నిత్యం ఎంతోమంది విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు, పుస్తకప్రియులు, స్థానిక ఉద్యోగస్తులు ఈ గ్రంథాలయాన్ని వినియోగించుకుంటూ తమ విజ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నారు. అలాంటి ప్రాధాన్యం కలిగిన గ్రంథాలయం ఈ స్థితికి చేరుకోవడం పట్ల పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానిక ప్రజలు,పాఠకులు భవనాన్ని వెంటనే మరమ్మతులు చేయాలని,అవసరమైతే కొత్త భవనం నిర్మించి పాఠకులకు సురక్షిత వాతావరణంలో సేవలు అందించాలని అధికారులను, స్థానిక ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. విజ్ఞానాన్ని పంచే ఈగ్రంథాలయాన్ని పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



# మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వేణారెడ్డి సేవలు అభినందనీయం

ఎఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్‌గా కొప్పుల వేణారెడ్డి రైతులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. మార్కెట్ కమిటి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి సంవత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం మార్కెట్ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్షాదిలతో కలిసి వేణారెడ్డితోపాటు డైరెక్టర్లను పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట నియోజక వర్గంతో పాటు తుంగతుర్తి, కోదాడ నియోజక వర్గాల నుండి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాలకవర్గం ఉత్తమమైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజాప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదని, వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా పదవీ చేపట్టిన వెంటనే ఐదు రూపాయలకు అన్నపూర్ణ భోజనంతోపాటు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో మార్కెట్‌కు ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఉచితంగా ప్రతిరోజు అల్పాహారం కూడా పంపిణీ చేయడం గర్వకారణమన్నారు. రానున్న రోజుల్లో ఎన్నో ఉన్నతమైన పదువులు అలంకరించి ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి ముక్రం, డైరెక్టర్ ధరావత్ వీరన్న నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, మున్సిపల్ కౌన్సిలర్లు, మార్కెట్ కమిటి డైరెక్టర్లు, మార్కెట్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అసెంబ్లీని అడ్డుకుంటే ఉపేక్షించేది లేదు!

కెటిఆర్‌కు దమ్ముంటే కెసిఆర్‌ను సభకు తీసుకురావాలి

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య హెచ్చరిక

**ప్రజాపక్షం/యాదాద్రి :** అసెంబ్లీ సమావేశాలను ఎలా అడ్డుకోవాలన్న అంశంపైనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కేటీఆర్ శిక్షణ ఇచ్చారని, సభా కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హెచ్చరించారు. మంగళవారం యాదగిరిగుట్టలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ శిక్షణ తర్వాత కూడా కేటీఆర్ తీరులో ఏమాత్రం మార్పు రాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు కూడా గడవకముందే, ఆరు గ్యారెంటీల అమలుపై ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతామనడం కేటీఆర్ అజ్ఞానానికి నిదర్శనమని మండిపడ్డారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో ధైర్యంతో పాలన సాగిస్తూ ఇప్పటికే మెజారిటీ హామీలను నెరవేర్చారని అయిలయ్య స్పష్టం చేశారు. తాము చెప్పని పథకాలను కూడా ప్రజల కోసం అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి కనీసం సగం హామీలు కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన చరిత్ర బీఆర్ఎస్‌దని ధ్వజమెత్తారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తామని చెప్పి దగా చేశారని, దళితబంధు, గిరిజనులకు మూడెకరాల భూమి, బీసీ బంధు పేరుతో అన్ని వర్గాలను ఘోరంగా వంచించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఉచిత ఎరువులు, నిరుద్యోగ భృతి వంటి హామీలను గాలికొదిలేసి నిరుద్యోగులకు అన్యాయం చేశారని విమర్శించారు.

## ఉచితంగా విద్యార్థులు, మహిళలకు బ్యాగులు, బుక్స్ ట్రైనింగ్ లెర్నర్ కిట్ పంపిణీ



**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరి పట్టణంలో ఉదిత వోకేషనల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్, బిఓఎస్‌సిహెచ్ స్కిల్ ఇండియా ఫౌండేషన్ బ్రిడ్జి సెంటర్, బెంగళూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన స్పెషల్ కలెక్టర్ పాశం విఠల్, భువనగిరి 18వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ పాశం అమరనాథ్, ఉదిత స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షురాలు పాశం అలివేలు జనార్ధన్ అధ్యక్షతన నైపుణ్య శిక్షణ ప్రాముఖ్యతపై నిర్వహించిన వర్క్ షాప్‌ను ప్రారంభించారు. ఉదిత వోకేషనల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ సెంటర్‌లో కంప్యూటర్స్, ఫ్యాషన్ డిజైనింగ్ టైలరింగ్, ఆటోమోటివ్, రిటైల్, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, జాబ్ స్కిల్స్ పలు రకాల కోర్సులలో శిక్షణ పొందుతున్న విద్యార్థినిలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాశం ఉద్వాన్ ఫౌండేషన్ కునూర్ గౌరవ అధ్యక్షులు పాశం రామచంద్రయ్య, సంస్థ సభ్యురాలు చేగూరి జయమ్మ, ట్రైనింగ్ టీచర్స్ పబ్బల విజయ, బుడిద సౌజన్య, బొజ్జ రేష్మ విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

## శాస్త్రవేత్తలు నూతన సాంకేతిక విధానాలపై రైతులను ప్రోత్సహించాలి


**ప్రజాపక్షం/గరిడేపల్లి:** శాస్త్రవేత్తలు నూతన సాంకేతిక విధానాలపై రైతులను ప్రోత్సహించాలని తెలంగాణ మండల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పాలెం, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసర్చ్ (ఎడిఆర్) డాక్టర్ ఎల్.కృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గడ్డిపల్లి కెవికెలో ఏర్పాటు చేసిన శాస్త్రీయ సలహా సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శాస్త్రవేత్తలు రైతల ఆదాయం రెట్టింపు కోసం కృషి చేయాలని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నూతన సాంకేతికతను ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలపై ప్రోత్సాహం, సమగ్ర వ్యవసాయ విధానాలు, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈకార్యక్రమంలో కెవికె సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ ఇన్‌ఛార్జి డి.నరేష్ 202526 సంవత్సరంలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించారు. శాస్త్రవేత్తలు నరేష్, ఎ.కిరణ్, ఆదర్శ్, సుగంధి, అక్షిత్ సాయి వారు చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డిడిఎం డి.రవీందర్‌నాయక్, డాక్టర్ ఎన్ ప్రవీణ్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి, కంపసాగర్ కెవికె హెడ్ డాక్టర్ పి, చంద్రశేఖర్, ప్రీతంకుమార్, ఎం.మహేష్, ఉద్యానఅధికారి గౌస్‌మియా, వివేకానంద ఎన్జీవో ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ శాస్త్రీయ సలహ సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మండలం బిఎన్ తిమ్మాపురం గ్రామస్తులు నిన్న సాయంత్రం వడపర్తి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, ఇద్దరు కుమారులు మృతి చెందారు. దింతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామ సర్పంచ్ ఎడ్ల వెంకటరెడ్డి నేతృతంలో మృతి చెందిన మృతదేహాలకు పోస్టుమార్టం చేయించి దహన సంస్కారాల కొరకు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు భువనగిరి శాసనసభ్యులు కుంభ అనిల్ కుమార్ రెడ్డి మృతదేహాలను సందర్శించి నివాళులు అర్పించారు. ఒకే కుటుంబంలో ముగ్గురు చనిపోవడంతో చిన్న కుమారుడిని, వారి తండ్రిని ఓదార్చి ధైర్యంగా ఉండాలని అన్ని విధాలుగా మేము సర్పంచ్ అండగా ఉంటామని తెలిపారు. రూ.లక్ష వెంటనే ఆర్థిక సహాయం అందజేశారు.



# సిఇసి తీరుపై లోక్‌సభలో ప్రతిపక్షాల నినాదాలు



**న్యూఢిల్లీ:** లోక్‌సభ మంగళవారం కూడా ప్రతిపక్ష సభ్యుల నినాదాలతో హోరెత్తింది. ఉదయం సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, 'ఓట్ చోరీ'ని నిరసిస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. ప్రశ్నోత్తరాల సమయంలో, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) సభ్యులు ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. కాంగ్రెస్ సభ్యులు వారితో కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు, అనేక మంది ఇతర ప్రతిపక్ష సభ్యులు సంఘీభావంగా తమతమ స్థానాల వద్ద నిలబడ్డారు. సభ కార్యకలాపాలకు అధ్యక్షత వహించిన ఎంపి సంధ్యా రాయ్ వ్యవసాయ మంత్రిత్వ శాఖకు సంబంధించిన ప్రశ్నోత్తరాల సమయాన్ని కొనసాగించారు. ప్రతిపక్షాలు 'ఓట్ చోరీ బంద్ కరో', 'జ్ఞానేష్ కుమార్ రాజీనామా' అంటూ నినదించారు. ఈ క్రమంలోనే ఒక అనుబంధ ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమాధానమిస్తూ పశ్చిమ బెంగాల్‌లోని టిఎంసి ప్రభుత్వం రైతు సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదని ఆరోపించారు. టిఎంసి సభ్యులు సభలో నినాదాలు చేస్తుండగానే పశ్చిమ బెంగాల్‌లోని వారి ప్రభుత్వం పథకాలను అమలు చేయడం లేదని, అక్కడి రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తోందని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో మంత్రికి వ్యతిరేకంగా టిఎంసి సభ్యులు తనకు కేటాయించిన సీటు దగ్గర నినాదాలు చేశారు. దీంతో ప్రశ్నోత్తరాల సమయంలో చౌహాన్ తన సీటును మార్చుకోవాల్సి వచ్చింది. విపక్షాల నిరసనలు కొనసాగడంతో సభను మధ్యాహ్నం 12 గంటల వరకు దాదాపు 25 నిమిషాలు వాయిదా వేశారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న వివాదంపై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు సోమవారం కూడా లోక్‌సభ కార్యకలాపాలకు అంతరాయం కలిగించారు.

## లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

# పక్షపాతంతో సభను నడిపారు : గగోయ్

### రాజ్యాంగాన్ని రక్షించేందుకే ఆయనపై అభిశంసన తీర్మానం

**న్యూఢిల్లీ :** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ మంగళవారం వాడివేడీగా మొదలైంది. కాంగ్రెస్ ఎంపి మహమ్మద్ జావెద్ ఈ తీర్మానాన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం స్పీకర్ స్థానంలో ఉండి సభను నడిపిస్తున్న బిజెపి ఎంపి జగదాంబికా పాల్, ఈ తీర్మానంపై చర్చకు 10 గంటల సమయాన్ని కేటాయించారు. ఎంపిలందరూ కేవలం తీర్మానంలో పేర్కొన్న అంశాలకే పరిమితమై మాట్లాడాలని, ఇతర విషయాలను చర్చలోకి తీసుకురావద్దని ఆయన కోరారు. సుమారు 118 మంది ప్రతిపక్ష ఎంపిలు సంతకం చేసిన ఈ తీర్మానంలో స్పీకర్‌పై ప్రధానంగా పలు ఆరోపణలు ఉన్నాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు తమ నేతలకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. కాగా, చర్చను ప్రారంభిస్తూ కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గగోయ్ బిర్లాపై తీవ్ర విమర్శలు చేశారు. పక్షపాత ప్రవర్తనకు పాల్పడ్డారని, ప్రతిపక్ష మహిళా ఎంపిలపై నిరాధారమైన ఆరోపణలు చేశారని, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని క్లిష్టమైన అంశాలను సభ ముందుంచడానికి అనుమతించలేదని ఆరోపించారు. రాజ్యాంగాన్ని, సభ గౌరవాన్ని కాపాడటానికి లోక్‌సభ స్పీకర్ పదవి నుండి బిర్లాను తొలగించాలని ప్రతిపక్షం తీర్మానం తీసుకురావాల్సి వచ్చిందని



గొగోయ్ పేర్కొన్నారు. ఇప్పుడు వాక్ స్వాతంత్ర్యం ఎక్కడి ఉందని ప్రశ్నిస్తూ బిర్లా పక్షపాతంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఫిబ్రవరి 2న రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాహుల్‌గాంధీ మాట్లాడాల్సి వచ్చినప్పుడు స్పీకర్ సభకు అధ్యక్షత వహించిన తీరుపై ఆయన ప్రశ్నలు సంధించారు. ప్రతిపక్ష నేతను మాట్లాడనీయకుండా అనేకసార్లు అంతరాయం కలిగించారని, ఎల్ఓపి లేచి నిలబడి ఉండగానే మరొక సభ్యుడికి (మాట్లాడటానికి) అవకాశం ఇచ్చారని గొగోయ్ అన్నారు. మనం చూపించాలనుకుంటున్న పార్లమెంటరీ సంప్రదాయం ఇదేనా? ఎంపిలను నిశ్శబ్దం చేయడానికి మైక్రోఫోన్‌లను ఉపయోగిస్తున్నారు. ఇది ఈ సభ ఆచారాలకు ప్రత్యక్ష విరుద్ధమని మండిపడ్డారు. ఎంపి శశి థరూర్‌కు కూడా ఇదే జరిగిందని, ఫిబ్రవరి 9న ఆయన ప్రసంగిస్తున్నప్పుడు ప్రసంగం మధ్యలోనే ఆయన మైక్‌ను ఆపివేశారని, ప్రతిపక్షం తమ అభిప్రాయాన్ని చెప్పాలి అని అంటారు... కానీ మీరు మైక్‌ను ఆపివేస్తే ఎలా చెప్పగలం అని నిలదీశారు. స్పీకర్ సభ గౌరవాన్ని సూచిస్తారని, దేశ స్వేచ్ఛ, స్వేచ్ఛకు చిహ్నంగా మారుతారని మొదటి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ చేసిన వ్యాఖ్యలను కూడా గొగోయ్ ఉదహరించారు. ఇప్పుడు వాక్ స్వాతంత్ర్యం ఎక్కడ ఉంది? అని ప్రశ్నించారు. మహిళా ఎంపిల లక్ష్యాలను ప్రశ్నిస్తున్నారని అసోం జోర్హాట్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపి అన్నారు. 'రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ప్రధానమంత్రి మాట్లాడాల్సి వచ్చినప్పుడు, స్పీకర్ ప్రధాని మోడీని సభకు రావద్దని సూచించారు. కొంతమంది మహిళా ఎంపిలు ప్రధానమంత్రి కుర్చీని చుట్టుముట్టి ఊహించని పరిస్థితిని సృష్టిస్తారని విశ్వసనీయ సమాచారం ఉందని పేర్కొన్నారు. సిగ్గు, సిగ్గు, సిగ్గు, సిగ్గు, సిగ్గు, సిగ్గు... 2026 ఘటన చట్టబద్ధంగా విభిన్నమైనది. ఎందుకంటే స్పీకర్ ముందస్తుగా ప్రధానికి హాజరు కావద్దని సలహా ఇచ్చారు. అది పూర్తిగా తటస్థతను ఉల్లంఘించడం' అని కాంగ్రెస్ ఎంపి పేర్కొన్నారు. మహిళా ఎంపిలపై ఆరోపణలు నిరాధారమైనవని ఆయన అన్నారు. వారి పట్ల సభలో 'పితృస్వామ్య' స్వరం అవలంబిస్తుందని కూడా గొగోయ్ ఆరోపించారు. ఎల్ఓపి వ్యాఖ్యలు తరచుగా తొలగించబడతాయని, కానీ ట్రెజరీ బెంచ్ సభ్యులు మాజీ ప్రధానులపై నిరాధార ఆరోపణలు చేసినప్పుడు దానిని అనుమతిస్తారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అసోం జోర్హాట్ ఎంపి మాట్లాడుతూ 'ఎప్పుడు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ఎల్ఓపి మాట్లాడాలనుకున్నప్పుడు, స్పీకర్, చైర్‌పర్సన్స్ ప్యానెల్ సభ్యులు, ట్రెజరీ బెంచ్‌ల సీనియర్ సభ్యులు ఆయనకు 20 సార్లు అంతరాయం కలిగించారు. ముందస్తు ప్రణాళికతో ఆయనకు అంతరాయం కలిగింది. స్పీకర్ ఎల్ఓపిని మాట్లాడటానికి అనుమతించలేదు. సభకు, దేశ ప్రజలకు తెలియాల్సిన కొన్ని కీలక అంశాలను తప్పనిసరిగా ఉంచే ప్రయత్నంలో ఎల్ఓపికి పదే పదే అంతరాయం కలిగింది' అని అన్నారు. ఈ సమయంలో, అధ్యక్షత వహించిన జగదాంబికా పాల్, బిర్లాకు వ్యతిరేకంగా తీర్మానాన్ని తీసుకురావడానికి గల కారణాలకు కట్టుబడి ఉండాలని గొగోయ్‌ను కోరారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు జోక్యం చేసుకుని, ఇది స్పీకర్‌పై చర్చ అని, ప్రతిపక్షం ఇతర సమస్యల గురించి మాట్లాడుతుంటే, 'మేము సమాధానం చెప్పినప్పుడు' వారు అంతరాయం కలిగించకూడదని అన్నారు. పలు అంతరాయాల తర్వాత గొగోయ్ తన ప్రసంగాన్ని తిరిగి ప్రారంభించి, అమెరికాలో ఒక వ్యాపారవేత్తపై జరుగుతున్న దర్యాప్తు అంశాన్ని లేవనెత్తాలని గాంధీ కోరుకుంటున్నారని, అందులో ఒక మంత్రి కూడా ఉన్నారని, కానీ అనుమతి లేదని అన్నారు. భారతదేశంతో ఇయు, యుఎస్ మధ్య వాణిజ్య ఒప్పందాల గురించి కూడా గాంధీ మాట్లాడాలనుకున్నారు. భారత దేశం (యుఎస్‌తో) ఒక ఒప్పందం కుదుర్చుకోవడానికి, మన రైతులకు హాని కలిగించే యుఎస్‌కు రాయితీలు ఇవ్వడానికి కారణం ఏమిటి అని రాహుల్‌గాంధీ అడిగారు''అని గొగోయ్ అన్నారు.

# జ్యూడీషియల్ అధికారులనే ప్రశ్నిస్తారా?

- సిజెఐ సూర్యకాంత్ కన్నెర్ర
- బెంగాల్ 'సర్' మినహాయింపులకు వ్యతిరేకంగా అప్పీళ్ల విచారణకు స్వతంత్ర అప్పిలేట్ ట్రిబ్యునళ్లు ఏర్పాటు
- సుప్రీంకోర్టు సరికొత్త మార్గదర్శకాలు జారీ

**న్యూఢిల్లీ :** పశ్చిమబెంగాల్‌లో ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సమయంలో ఓటర్ల జాబితాల నుంచి మినహాయింపులకు వ్యతిరేకంగా అప్పీళ్లను విచారించడానికి మాజీహైకోర్టు న్యాయమూర్తుల నేతృత్వంలో స్వతంత్ర అప్పిలేట్ ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయాలని మంగళవారం సుప్రీంకోర్టు తాజా మార్గదర్శకాలను జారీ చేసింది. 'సర్' జాబితాల ప్రక్రియలో ఓటర్ల జాబితాల నుంచి తొలగింపును ఎదుర్కొంటున్న వారి వాదనలు, అభ్యంతరాలను పరిష్కరించడానికి నియమించబడిన న్యాయ అధికారుల సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నాలకు వ్యతిరేకంగా అత్యున్నత న్యాయస్థానం కూడా తీవ్ర హెచ్చరిక జారీచేసింది. ఇలాంటి చర్యలను న్యాయవ్యవస్థకు అవమానం అని వ్యాఖ్యానించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం దీనిపై మాట్లాడుతూ 'ఇలాంటి దరఖాస్తులు దాఖలు చేయడానికి మీకు ఎలా ధైర్యం వచ్చింది? అది మీకు నమ్మకం లేదన్న విషయాన్ని ప్రస్ఫుటం చేస్తోంది. న్యాయ అధికారులను ప్రశ్నించేందుకు ఏ ఒక్కరూ సాహసించరు. భారత ప్రధాన న్యాయమూర్తి(సిజెఐ)గా నేను దీనిని అసలే సహించను'. అని మండిపడ్డారు. ఓటరు జాబితాల నుంచి తొలగింపును ఎదుర్కొంటున్న వారి వాదనలు, అభ్యంతరాలను న్యాయ అధికారులు పరిష్కరించడానికి అనుమతించకూడదని ఒక పిటిషన్‌లో చేసిన వాదనలపై జస్టిస్ ఆర్.మహదేవన్, జోయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. దీనికి ముందు కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పశ్చిమ బెంగాల్ జిల్లా జడ్జిలు, సివిల్ జడ్జిలను మోహరించడానికి అత్యున్నత న్యాయస్థానం అనుమతించింది. రాష్ట్రంలో ఓటర్ల జాబితాల నుంచి తొలగింపును ఎదుర్కొంటున్న 80లక్షల మంది వాదనలు, అభ్యంతరాలను నిర్వహించడానికి జార్ఖండ్, ఒడిశా నుంచి న్యాయ అధికారులను నియమించాలని కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా కోరింది. మంగళవారం కలకత్తా హైకోర్టు తాజా నివేదికను పరిశీలించిన ధర్మాసనం పశ్చిమబెంగాల్ ప్రభుత్వం, ఎన్నికల సంఘాన్ని కూడా ప్రశ్నించింది. దీనికి సంబంధించి కొత్త మార్గదర్శకాలను జారీచేసింది. కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో న్యాయఅధికారులకు ఎన్నికల సంఘం అన్ని రకాలుగా లాజిస్టికల్ మద్దతును అందిస్తుంది. న్యాయ అధికారులు మార్చి 9 సాయంత్రం నాటికి ఓటర్ల జాబితా నుంచి తొలగింపు ఎదుర్కొంటున్న వారినుండి 10.16 లక్షల వాదనలు, అభ్యంతరాలను ఇప్పటివరకు పరిష్కరించారు. కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆమోదాన్ని పొందకపోతే ప్రక్రియకు అంతరాయం కలిగించే ఎటువంటి తప్పనిసరి నిబంధన అయినప్పటికీ భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ప్రవేశ పెట్టకూడదని అది ఆదేశించింది. ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రభావితం చేసే సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలియజేసింది. కొంతమంది మాజీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను, ఇద్దరు లేదా ముగ్గురు మాజీ హైకోర్టు న్యాయమూర్తులను ముఖ్యంగా కలకత్తా హైకోర్టు లేదా పొరుగు రాష్ట్రాల నుంచి అప్పిలేట్ ట్రిబ్యునళ్లలో పనిచేయమని కోరవచ్చని పేర్కొంది. సిఫారసు చేసిన తర్వాత ఎన్నికల సంఘం అటువంటి అప్పీళ్లను విచారించడానికి వాఇని అప్పిలేట్ ట్రిబ్యునల్స్‌గా ప్రకటించాల్సి ఉంటుంది. ప్రతీ ధర్మాసనంలోని సభ్యుల సంఖ్య కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి విచక్షణకు వదిలివేయబడింది. ఫిబ్రవరి 24న ఇచ్చిన ఉత్తర్వులను ప్రస్తావిస్తూ న్యాయ అధికారులు జారీ చేసిన ఆదేశాలను ఏ కార్యనిర్వాహక లేదా పరిపాలనా అధికారుల ముందు అప్పీల్ చేయడానికి వీల్లేదని ధర్మాసనం పునరుద్ఘాటించింది.అయితే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రిటైర్డ్ న్యాయమూర్తులతో కూడిన స్వతంత్ర అప్పిలేట్ ఫోరమ్‌ను సృష్టిస్తారని సిజెఐ అన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి తగిన సిఫారసు చేసిన తర్వాత, ఎన్నికల సంఘం అవసరమైన నోటిఫికేషన్ జారీ చేస్తుందని కూడా ధర్మాసనం పేర్కొంది. హైకోర్టు ప్రధానన్యాయమూర్తి నివేదిక ప్రకారం పశ్చిమబెంగాల్ నుంచి 500మంది జ్యుడీషియల్ అధికారులు, ఒడిశా, జార్ఖండ్ నుంచి 200మంది న్యాయ అధికారులను ఈ కసరత్తు కోసం నియమించింది. వారు 24గంటలూ ఈ పనికోసం పని చేస్తున్నారు. 2026 మార్చి 8నాటికి దాదాపు 700 లాగిన్ ఐడిలు సృష్టించబడ్డాయి. కాగా న్యాయ అధికారులు లాజిస్టిక్, సాంకేతిక సమస్యలను ఎదుర్కొంటున్నట్లు సమాచారం అందింది. అయితే అవి ఎన్నికల సంఘం (ఇసి) స్థాయిలో తలెత్తినట్లు కోర్టు గమనించింది. సీనియర్ అడ్వకేట్ దామా శేషాద్రి నాయుడు సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ధర్మాసనానికి హామీ ఇచ్చారు. తుది ఓటర్ల జాబితా నుంచి తమ పేర్లను చట్టవిరుద్ధంగా తొలగించారని పేర్కొంటూ వ్యక్తులు దాఖలు చేసిన రెండు కొత్త పిటిషన్లను కూడా ధర్మాసనం తిరస్కరించింది. పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం మధ్య అక్రమాలు, 'విశ్వాస లోటు' ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో బెంగాల్‌లో 'సర్' ప్రక్రియ కోర్టు పర్యవేక్షణలో జరుగుతోంది.




# మట్టిదిబ్బ కూలి ఏడుగురు కార్మికులు మృతి

### ఢిల్లీ గురుగ్రామ్‌లో విషాద ఘటన



**న్యూఢిల్లీ :** ఢిల్లీ గురుగ్రామ్‌లో విషాదం చోటు చేసుకుంది. నిర్మాణ స్థలంలో మట్టి దిబ్బ కూలిపోవడంతో ఏడుగురు కార్మికులు మృతి చెందారు. నేపాల్‌కు చెందిన ముగ్గురు సహా నలుగురు గాయపడ్డారు. గురుగ్రామ్ సిధ్రావాలి ప్రాంతంలోని సిగ్నేచర్ గ్లోబల్ సొసైటీలో సోమవారం సాయంత్రం ఈ ఘటన జరిగినట్లు అధికారులు చెప్పారు. రాజస్థాన్‌లోని భివాడి డిఎస్‌పియోగేష్ భివాడిలో విలేకరులతో మాట్లాడుతూ, మురుగునీటి శుద్ధి కర్మాగారం (ఎస్‌టిపి) నిర్మాణ పనులు జరుగుతుండగా అకస్మాత్తుగా మట్టి దిబ్బ కూలిపోయిందని, కొంతమంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నారని చెప్పారు. శిథిలాల కింద దాదాపు 12 నుండి 15 మంది కార్మికులు చిక్కుకున్నారన్నారు. సమాచారం అందిన వెంటనే, గురుగ్రామ్‌లోని బిలాస్‌పూర్ పోలీస్ స్టేషన్ నుండి వచ్చిన పోలీసు బృందం, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్), జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్) సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని కార్మికులను రక్షించారు. రాజస్థాన్‌లోని భివాడి వద్ద ఉన్న సమీపంలోని ఆసుపత్రికి వారిని తరలించారు. చికిత్స పొందుతూ ఏడుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు.మట్టి దిబ్బలు మీద పడడంతో ఊపిరాడకే వారు మరణించినట్లు అధికారులు తెలిపారు. మృతుల్లో ఒకరి బంధువు మాట్లాడుతూ కార్మికులు అనేక అడుగుల దిగువన పనిచేస్తుండగా మట్టి దిబ్బ కూలిపోయిందని చెప్పారు. మృ తుల బంధువు పరిహారంగా ఒక్కొక్కరికి రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికుడు మాట్లాడుతూ, అకస్మాత్తుగా మట్టి దిబ్బ తమపై కూలిపోగా శిథిలాల కింద చిక్కుకుపోయామన్నారు. మృతులను శివశంకర్, పరమేశ్వర్ మహతో, మంగళ్ మహతో, భగీరథ్ గోప్, సతీష్, సంజీవ్ గోప్, ధనంజయ్ మహతోగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను నేపాల్ నివాసితులు ఇంద్రజిత్, చోటేలాల్, శివకం చౌదరి, దీన్‌దయాళ్ శర్మగా గుర్తించారు. పోలీసు బృందం బాధితుల కుటుంబాలను సంప్రదించి సంఘటన గురించి వారికి తెలియజేసింది. ప్రస్తుతం అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

# మేఘాలయలో కర్ఫ్యూ

### పోలీసుల కాల్పుల్లో ఇద్దరు మృతి

**షిల్లాంగ్ :** మేఘాలయలో హింస చెలరేగింది. జిహెచ్ఎడిసి ఎన్నికల నామినేషన్ ప్రక్రియ సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున మేఘాలయలోని వెస్ట్ గారో హిల్స్ జిల్లాలో హింసాత్మక చెలరేగింది. ఆందోళనగారులను చెదరగొట్టడానికి భద్రతా దళాలు కాల్పులు జరపగా ఇద్దరు మరణించారని అధికారులు తెలిపారు. చిబినాంగ్ ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని, గిరిజన, గిరిజనేతర సమూహాల మధ్య ఘర్షణ జరిగిందని వెస్ట్ గారో హిల్స్ పోలీసు సూపరింటెండెంట్ అబ్రహం టి సంగ్మా తెలిపారు. మరణించిన ఇద్దరు వ్యక్తులు చిబినాంగ్ నివాసితులన్నారు. జిహెచ్ఎడిసి ఎన్నికలకు సంబంధించి గిరిజనులు, గిరిజనేతరుల మధ్య ఘర్షణ జరిగిందని, తాము చట్టవిరుద్ధమైన సమావేశాన్ని చెదరగొట్టే సమయంలో కాల్పులు జరిగిటన్లు సంగ్మా చెప్పారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో పరిస్థితి అదుపులో ఉందని ఆయన అన్నారు. ఉద్రిక్తత మరింత పెరగకుండా నిరోధించడానికి వెస్ట్ గారో హిల్స్ అంతటా మంగళవారం జిల్లా యంత్రాంగం



రోజంతా కర్ఫ్యూ విధించింది. తాము అదనపు బలగాలను మోహరించాలని కోరినట్లు ఎస్‌పి చెప్పారు. నామినేషన్ ప్రక్రియ సందర్భంగా శాంతి భద్రతలకు ముప్పు కలిగించే సోషల్ మీడియాలో జనసమీకరణ, దాడులు, తప్పుడు సమాచారం వ్యాప్తి చెందుతుందనే నివేదికల నేపథ్యంలో మేఘాలయ ప్రభుత్వం మార్చి 10 నుండి జిల్లాలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను 48 గంటల పాటు నిలిపివేయాలని ఆదేశించిన కొన్ని గంటల తర్వాత ఈ సంఘటన జరిగింది. గారో హిల్స్ అటానమస్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్ (జిహెచ్ఎడిసి) ఎన్నికల్లో గిరిజనేతరులు పాల్గొనడంపై అశాంతి నెలకొని ఉన్న నేపథ్యంలో, పశ్చిమ గారో హిల్స్ జిల్లాలోని అధికారులు సున్నితమైన ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ కోసం ఆర్మీ సహాయం కోరినట్లు అధికారులు తెలిపారు. 'ఇటీవల, రెండు వర్గాల మధ్య మతపరమైన ఉద్రిక్తతలు, ప్రజా అశాంతి నెలకొన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి సంసిద్ధత, నిబద్ధతకు సైన్యం చేసే జెండా మార్చ్ దృశ్యమాన ప్రదర్శనగా ఉపయోగపడుతుంది' అని డిప్యూటీ కమిషనర్ అన్నారు. ఏప్రిల్ 10న జరగనున్న జిహెచ్ఎడిసి ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేయడానికి సోమవారం తురాలోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి వచ్చిన ఫుల్బారి మాజీ శాసనసభ్యుడు ఎస్తమూర్ మోమిన్‌పై నిరసనకారులు దాడి చేసినట్లు ఆరోపణలు రావడంతో అశాంతి మొదలైంది. గిరిజనులు కాని వారు జిహెచ్ఎడిసి ఎన్నికలలో పోటీ చేయడం లేదా పాల్గొనడం మానుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.

# దేశీయ ఉత్పత్తిలో ఎల్‌పిజికే తొలి ప్రాధాన్యత

### ఆటోమొబైల్స్‌కు సిఎన్‌జి కూడా నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్రం

**న్యూఢిల్లీ :** వంట గ్యాస్, రవాణా రంగాలలకు సంబంధించి పూర్తి అవసరాలకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ తరువాతే ఇతర రంగాలకు సరఫరాలు చేయనుంది. ఈ మేరకు దేశీయంగా ఉత్పత్తి అయ్యే సహజ వాయువు కేటాయింపు ప్రాధాన్యతను కేంద్రం సవరించింది. పశ్చిమాసియా వివాదం ఇంధన సరఫరాలకు అంతరాయం కలుగుతుండటంతో వంట గ్యాస్ ఎల్‌పిజిని ఉత్పత్తి చేయడానికి అవసరమైన ఇంధనం, ఎల్‌పిజి, ఆటోమొబైల్స్ కోసం సిఎన్‌జి, గృహాలకు పైప్డ్ వంట గ్యాస్ 100 శాతం అవసరాన్ని తీర్చేందుకు వీలుగా పెట్రోకెమికల్స్ వంటి రంగాలకు గ్యాస్ కేటాయింపును ప్రభుత్వం తగ్గించింది. ఎల్‌పిజి ప్రధానంగా ముడి చమురు నుండి తీయబడుతుంది. కానీ సహజ వాయువు నుండి కూడా వేరు చేయవచ్చు.పశ్చిమాసియా వివాదం కారణంగా భారతదేశ 21 మిలియన్ టన్నుల ఎల్‌పిజి దిగుమతులలో 80 శాతం అంతరాయం కలిగింది. దీంతో వంట ఇంధనం కోసం ఎల్‌పిజి సరఫరాలను పెంచేందుకు వీలుగా పెట్రోకెమికల్ ప్రవాహాలను మళ్ళించాలని, సహజ వాయువును ఉపయోగించడం ద్వారా దేశీయ ఉత్పత్తిని పెంచాలని రిఫైనరీలను ప్రభుత్వం కోరింది. ఈ సంక్షోభం ఇప్పటికే ప్రపంచ ఇంధన ధరలలో పెరుగుదలకు దారితీసింది. ఇది వారాంతంలో 14.2 కిలోల ఎల్‌పిజి సిలిండర్ ధర పెరుగుదలలో ప్రతిబింబిస్తుంది. సిఎన్‌జి, గృహ వంటశాలలకు పైపుల ద్వారా గ్యాస్ సరఫరా అయ్యే పైప్డ్ నేచురల్ గ్యాస్ గతంలో కోతలు లేని కేటగిరీలో ఉండేవి. అంటే సరఫరా తగ్గితే గ్యాస్ కేటాయింపులో కోత విధించే



వారు కాదు. కానీ, తాజాగా ఎల్‌పిజిని ఆ కేటగిరీలో చేర్చారు. సవరించిన కేటాయింపు ప్రకారం ఇతర రంగాలకు గ్యాస్ సరఫరా చేసే ముందు ఈ రంగాల అవసరాలు పూర్తిగా తీర్చే విధంగా నోటిఫికేషన్ జారీ అయింది. ఎరువుల రంగం రెండవ స్థానంలో ఉండగా, గడిచిన ఆరు నెలల డిమాండ్‌లో కనీసం 70 శాతం తీర్చారు. మూడవ స్థానంలో తేయాకు పరిశ్రమలు, తయారీ, ఇతర పారిశ్రామిక వినియోగదారులకు గ్యాస్ సరఫరా ఉండగా, గత ఆరు నెలల సగటు గ్యాస్ వినియోగంలో 80 శాతం వద్ద అందుబాటులో ఉంచనున్నారు. అన్ని నగర గ్యాస్ పంపిణీ (సిజిడి) సంస్థలు పారిశ్రామిక ,వాణిజ్య వినియోగదారులకు గ్యాస్ సరఫరా చేయాలి. ఇది ప్రాధాన్యత జాబితాలో 4వ స్థానంలో ఉంది. దేశంలో రోజుకు 191 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల వినియోగంలో సగానికి పైగా ఉన్న దేశీయ గ్యాస్ ఉత్పత్తిని, పెట్రోకెమికల్ ప్లాంట్లు, విద్యుత్ యూనిట్లు , అధిక ధరల గ్యాస్ వినియోగదారులకు సరఫరాలను తగ్గించడం ద్వారా ప్రాధాన్యతా రంగాలకు మళ్లిస్తున్నారు.

# అర్హత కలిగిన ఓ ఒక్క ఓటరునూ తొలగించబోం

- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా నుండి అర్హులైన ఏ ఒక్కరి పేరును తొలగించబోమని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ స్పష్టం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సన్నాహాలు ముమ్మరం చేస్తున్నందున రాష్ట్రంలో స్వేచ్ఛగా, న్యాయంగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూసుకోవడమే ఇసి ప్రాధాన్యత అని అన్నారు. మంగళవారం ఆయన రాజకీయ పార్టీలు, సీనియర్ అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ప్రజలు ఎల్లప్పుడూ శాంతియుతమైన, భాగస్వామ్య ప్రజాస్వామ్యాన్ని విశ్వసిస్తారన్నారు. బెంగాల్‌లో స్వేచ్ఛగా, న్యాయంగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడడమే తమ లక్ష్యమన్నారు. అర్హత ఉన్న ప్రతి ఓటరుకు ఓటు వేసే అవకాశం ఉంటుందని చెప్పారు. అర్హత ఉన్న ఏ ఓటరు పేరును తొలగించబోమని సిఇసి జ్ఞానేశ్ కుమార్ ఉద్ఘాటించారు. ఎస్ఐఆర్ గురించి మాట్లాడుతూ రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియ జరుగుతోందని కుమార్ అన్నారు. భారతదేశం అంతటా రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నారన్నారు. సిఇసి ప్రకారం, ఓటర్ల జాబితా స్వచ్ఛంగా ఉండేలా చూసుకోవడమే సవరణ లక్ష్యమన్నారు. బెంగాల్‌కు మాత్రమే తార్కిక వ్యత్యాసాలు తీసుకురాబడ్డాయనే వాదనలను సిఇసి తోసిపుచ్చుతూ పశ్చిమ బెంగాల్‌లో జరిగిన విధంగానే 12 రాష్ట్రాలలోనూ ఇవి జరిగాయన్నారు. ఫిబ్రవరి 28న సర్ తర్వాత ఓటర్ల జాబితాలను ప్రచురించిన తర్వాత, ఎన్నికల సంఘం సకాలంలో తన వెబ్‌సైట్‌లో అనుబంధ ఓటర్ల జాబితాలను కూడా అప్‌లోడ్ చేస్తుందని ఆయన అన్నారు. సర్‌ను అనుసరించి పోల్ ప్యానెల్ దాదాపు 64 లక్షల మంది ఓటర్లను ఓటర్ల జాబితాల నుండి తొలగించిందని, దాదాపు 60 లక్షల మందిని పరిశీలనలో ఉంచిందని అధికార టిఎంసి చేసిన ఆరోపణల మధ్య ప్రధాన ఎన్నికల కమిషనర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ఎన్ని దశలు అనేది రాష్ట్ర యంత్రాంగ శాంతిభద్రతల సంసిద్ధత అంచనాపై ఆధారపడి ఉంటుందని కుమార్ అన్నారు. రాజకీయ నాయకులు ఓటర్లను లేదా ఎన్నికల సిబ్బందిని బెదిరించడానికి చేసే ఏ ప్రయత్నాన్ని సహించబోమన్నారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం కచ్చితంగా పనిచేస్తారని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియను పేర్కొంటూ పశ్చిమ బెంగాల్‌లో దాదాపు 80,000 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వాటిలో దాదాపు 61,000 గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయని సిఇసి చెప్పారు. ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలింగ్ బూత్‌లలో 100 శాతం వెబ్‌కాస్టింగ్ ఉంటుందని కూడా ఆయన ప్రకటించారు.

### జ్ఞానేష్‌కు నిరసన సెగ

మంగళవారం ఉదయం దక్షిణేశ్వర్ కాళీ ఆలయాన్ని సందర్శించిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు అక్కడ నిరసన సెగ తగిలింది. నిరసనకారులు 'గో బ్యాక్' అంటూ నినాదాలు చేసి, నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఆదివారం రాత్రి జ్ఞానేష్ కోల్‌కతా చేరుకున్నప్పుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం వెలుపల కూడా ఇలాంటి నిరసన జరిగింది. నగరం దక్షిణ భాగంలోని కాళీఘాట్ ఆలయాన్ని సందర్శించినప్పుడు సోమవారం ఉదయం ఆయనకు 'గో బ్యాక్' నినాదం ఎదురైంది. నిరసనలు ఉన్నప్పటికీ, కుమార్ రాష్ట్రంలో తన షెడ్యూల్ ప్రకారం తన కార్యక్రమాలను కొనసాగించారు. ఇసి మంగళవారం హౌరా జిల్లాలోని బేలూర్ మఠాన్ని కూడా సందర్శించింది. పశ్చిమ బెంగాల్‌లో హింస రహిత ఎన్నికలకు పోల్ ప్యానెల్ కట్టుబడి ఉందని జ్ఞానేష్ చెప్పారు.

# ప్రభుత్వ ప్రత్యక్ష నియామకాల్లో ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్లు

**న్యూఢిల్లీ :** కేంద్రం పరిధిలోని సివిల్ పోస్టులు, సేవలకు ప్రత్యక్ష నియామకాలలో ఇతర వెనుకబడిన తరగతుల (ఒబిసి)కు ప్రభుత్వం 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుందని మంగళవారం లోక్‌సభకు సమాచారం అందింది. రిజర్వేషన్ విధానాన్ని అమలు చేయడం సిబ్బంది, శిక్షణ శాఖ చేస్తోందని సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి బి.ఎల్. వర్మ ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. 'ప్రభుత్వం సిబ్బంది, శిక్షణ శాఖ 8.9.1993 నాటి ఒఎం (ఆఫీస్ మెమోరాండం) ద్వారా ఎప్పటికప్పుడు జారీ చేయబడిన ఇతర సూచనల ద్వారా రిజర్వేషన్ విధానాన్ని కలిగి ఉంది, దీని ప్రకారం ప్రభుత్వం పరిధిలోని సివిల్ పోస్టులు, సేవలకు ప్రత్యక్ష నియామకాలలో 27 శాతం ఖాళీలు ఒబిసిలకు (సామాజికంగా మరియు విద్యాపరంగా వెనుకబడిన తరగతులు) రిజర్వ్ చేయబడ్డాయి' అని మంత్రి లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, పాఠశాలలు, కళాశాలలలో ఉన్నత స్థాయి విద్య, ఒబిసి బాలురు, బాలికలకు హాస్టళ్ల నిర్మాణం వంటి పిఎం యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డు పథకం కింద ఒబిసిల సంక్షేమం కోసం మంత్రిత్వ శాఖ చర్యలు తీసుకుంటోందని ఆయన అన్నారు.

# వంటగ్యాస్‌కు కటకట హోటళ్ల బంద్

అమెరికా–ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం ప్రభావం మన దేశ ఆర్థిక వ్యవస్థపై కనిపించటం మొదలైంది. ముఖ్యంగా వంటగ్యాస్ కొరత వంటగదులకు ఇంకనూ చేరకపోయినా, వాణిజ్య సిలెండర్ల అలభ్యతతో దేశమంతటా అనేక రాష్ట్రాల్లో ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడుతున్నాయి. చిరువ్యాపారులూ చిరుతిండి బండ్లు బంద్ పెడుతున్నారు. 10 రోజులుగా గల్ఫ్‌లో యుద్ధం జరుగుతున్నప్పటికీ – వంటగ్యాస్, పెట్రోలియం ఉత్పత్తులకు ఆందోళన అవసరం లేదు, తగినన్ని నిల్వలున్నాయని భరోసా యిస్తూ వచ్చిన కేంద్ర ప్రభుత్వంలో రెండ్రోజులుగా గుబులు కనిపిస్తోంది. కొద్ది రోజుల క్రితమే గృహవినియోగ ఎల్‌పిజి సిలెండర్ ధర రూ.60 పెరిగింది. ఆ నిర్ణయం ఇంతకు ముందు జరిగిందేగాని గ్యాస్ కొరతతో దానికి సంబంధం లేదని పెట్రోలియం మంత్రిత్వశాఖ బుకాయిస్తోంది. ఆయిలు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోలు, డీజిలు ధరలు పెంచకుండా పెరిగిన క్రూడ్ ధరను అంతర్గత వనరులనుంచి అవే భరించాలని చెబుతోంది. ఈ వారారంభంలో బ్రెంట్ క్రూడ్ ధర కొద్దిసేపు బ్యారల్ దాదాపు 115డాలర్లకు చేరగానే మార్కెట్లు గడగడలాడిపోయాయి. గల్ఫ్ యుద్ధం వల్ల ఇంకెంత పెరుగుతుందో అనే భయాందోళన వ్యక్తమైంది. అయితే కొద్దిగంటల్లోనే బ్యారల్ 90–95 డాలర్ల శ్రేణికి తగ్గటంతో ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఆహారోత్పత్తులు, ఉద్యానవన పంటలు, రొయ్యలు, గ్రుడ్లు, చేపలు తదితరాల ఎగుమతులు నిలిచిపోయి రైతులు కుదేలవుతున్నా ప్రభుత్వంలో చలనం లేదు. ఎప్పుడైతే ఎల్‌పిజి కొరత సంక్షోభంగా మారే లక్షణాలు కనపడగానే గత్తర పడుతోంది. గ్యాస్ ఇంధనంగా ఎన్నో పరిశ్రమలు పనిచేస్తున్నాయి. రవాణా వాహనాలు నడుస్తున్నాయి. యూరియాకు గ్యాస్ మూలం. ఇవి సంక్షోభం తీవ్రతను తెలియజేస్తున్నాయి.

ఎల్‌పిజి, పెట్రోలియం పాలక పార్టీకి ముఖ్యంగా కొద్దిమాసాల్లో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత రాష్ట్రంలో ఎన్నికలు జరగనుండగా చాలా సున్నితమైన అంశం. ఉల్లిపాయల ధరల పెరుగుదలే ప్రభుత్వాలను మార్చిన చరిత్ర ఉన్న మన దేశంలో గ్యాస్, పెట్రోలియం ఇవాళ ఇంటింటి ప్రాథమిక అవసరం. ఒక్కరోజు గ్యాస్ స్టౌ మండకపోయినా ప్రభుత్వానికి మూడుతుంది. అందునా గ్యాస్, పెట్రోలియం కేంద్రప్రభుత్వం అధీనంలోని వ్యవహారం. 10 కోట్ల వంటగ్యాస్ కనెక్షన్‌లు ఉచితంగా ఇచ్చామని ప్రచారం చేసుకుంటూ మహిళల ఓట్లు కొల్లగొడుతున్న మోదీ ప్రభుత్వానికి ఇదీ మరీ సంకటస్థితి.

అతిథి దేవోభవ అంటూ ఆతిథ్యరంగం గూర్చి గొప్పగా చెప్పుకుంటాం. ఇవాళ ఆ ఆతిథ్యమిచ్చే హోటళ్లు, రెస్టారెంట్లు ముఖ్యంగా నగరాలలో వంట గ్యాస్ లేక మూతపడుతున్న దుస్థితిలో ఉన్నాయి.

బెంగళూరులో మార్చి 9 నుంచి వంటగ్యాస్ వాణిజ్య సిలెండర్ల సరఫరా నిలిచిపోయింది. మంగళవారం నుంచి హోటళ్లు, ఆహారశాలలు మూతపడుతున్నట్లు బెంగళూరు హోటల్స్ అసోసియేషన్ ప్రకటించటంతో అనేక రాష్ట్రాల్లో దాదాపుగా అదే పరిస్థితి ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లోని అనేక నగరాల్లో హోటళ్లు గ్యాస్ కొరతతో పాక్షికంగా పనిచేస్తున్నాయి. అనేకం మూతపడ్డాయి. గృహావసరాలకు ఇబ్బందిలేకుండా గ్యాస్ సరఫరాకు ప్రాధాన్యత ఇస్తున్నామని, హోటళ్లు, రెస్టారెంట్లకు ఎల్‌పిజి సరఫరాను రెగ్యులేట్ చేసేందుకు ఆయిలు మార్కెటింగ్ కంపెనీలకు చెందిన ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు మంత్రిత్వశాఖ ప్రకటించింది. గ్యాస్ కొరత వల్ల హోటళ్లు, రెస్టారెంట్లే కాదు పూణేలో 27లో 18 గ్యాస్ ఆధారిత శ్మశాన వాటికలు కూడా తాత్కాలికంగా మూతపడ్డాయి.

హోర్ముజ్ జలసంధిని మూసివేయటం భారత్‌లో గ్యాస్, పెట్రోలియం ఉత్పత్తుల కొరతకు ప్రధాన కారణమైంది. ప్రపంచంలోని అత్యంత సున్నితమైన ఈ నడవ ద్వారా భారత్ క్రూడ్ దిగుమతుల్లో దాదాపు సగభాగం, ఎల్‌పిజి దిగుమతుల్లో 85శాతం నౌకారవాణా జరుగుతుంది. గత సంవత్సరం రష్యా నుంచి భారీగా దిగుమతి చేసుకున్న క్రూడ్ ఆయిలు నిల్వలవల్ల ప్రస్తుతానికి ఇంధన సంక్షోభం తలెత్తలేదు. నెలరోజులపాటు దిగుమతులకు అధ్యక్షుడు ట్రంప్ సుంకం మినహాయింపు ఇచ్చినందున మరికొంత దిగుమతికి అవకాశమేర్పడింది. సాధారణంగా ఈ యుద్ధ సమయంలో పెట్రోలు, డీజిలు ధరలు పెరగాలి. అయితే కొన్నేళ్లుగా ప్రభుత్వం అనుసరిస్తున్న విండ్‌పాల్ విధానం వల్ల ఆయిలు కంపెనీలు భారీగా లాభాలు చేసుకున్నాయి. క్రూడ్ ధర తగ్గినపుడు ప్రభుత్వం పన్నులు పెంచటం, ధర పెరిగినపుడు పన్నులు కొంత తగ్గించే ఈ విధానం వల్ల మార్కెట్ ధరలను స్థిరంగా ఉంచుతున్నది. వినియోగదారులను దోపిడీ చేయటం కొనసాగిస్తూనే ఉంది. అయితే యుద్ధం ఎక్కువరోజులు కొనసాగితే ఈ సర్దుబాటు సాధ్యం కాకపోవచ్చు.


వంటగ్యాస్ సంక్షోభాన్ని గమనించిన ప్రభుత్వం, ఎల్‌పిజి ఉత్పత్తి పెంచాలని, పెరిగిన ఉత్పత్తిని గృహావసరాలకు సరఫరా చేయాలని కంపెనీలను ఆదేశించింది. ఎల్‌పిజి రీఫిల్ బుకింగ్ మధ్య విరామాన్ని 21 నుంచి 25 రోజులకు పెంచింది. దేశ క్రూడ్ అవసరాల్లో 80 శాతం దిగుమతులపై ఆధారపడిన దేశానికి – నియంత్రణ, రెగ్యులరైజేషన్ విధానం కొరవడినప్పుడు అంతర్జాతీయ ఒడిదొడుకులు ఇబ్బందులు కలిగించక మానవు. వంటగ్యాస్ కనెక్షన్‌లు, ఆటోమొబైల్స్ విక్రయాల పెరుగుదలను తమ ఘనతగా చెప్పుకునే ప్రభుత్వానికి ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో ప్రాధాన్యతల్లో సమతౌల్యం ఉండాలి.



## యావత్ ప్రపంచాన్ని మింగేస్తోంది

**ఇరాన్ సర్వోన్నత నాయకుడు అలీ ఖమేనీ మరణం కలచివేసింది. ఆయన కోసం నేను ప్రార్థనలు చేశాను. ఈ విధమైన కష్టాలన్నీ కేవలం పశ్చిమాసియాకు మాత్రమే పరిమితం కాలేదు, ఈ అవాంఛిత సంక్షోభం యావత్ ప్రపంచాన్నీ చుట్టుముట్టి మింగేస్తోంది, ఇరాన్ దేశ ప్రజలకు నా సంఘీభావం ఎల్లప్పుడూ ఉంటుంది. త్వరలోనే యుద్ధం ముగిసిపోతుందని ఆశాభావంతో ఉన్నాను. ప్రజలు కష్టాల నుండి బయటపడి ఉపశమనం పొందుతారని ఆశిస్తున్నాను, ఖమేనీ మరణం పట్ల నా ప్రగాఢ సంతాపం. ఇరాన్ ప్రజలకు నా సంఘీభావాన్ని, సానుభూతిని తెలియజేస్తున్నాను.**

– జమ్మూ–కశ్మీరు మాజీ ముఖ్యమంత్రి
ఫారూఖ్ అబ్దుల్లా



## వైద్యశాస్త్ర పురోగతిలో విప్లవాత్మక మలుపు పెన్సిలిన్

మానవుడు భూమిమీద అవతరించినప్పటినుండి వివిధ రకాల రోగాలతో పోరాటం చేస్తూనే ఉన్నాడు.కాలంతో జరిగే మార్పులతోపాటు ప్రపంచం ఎంతో అభివృద్ధి దిశవైపు పయనిస్తోంది.రోగాల బాధలు నివారించుటకు మానవుడు వివిధ కొత్తమందులు కనిపెడుతున్నాడు. అలాంటి వాటిలో విశిష్టమైనది పెన్సిలిన్. అలెగ్జాండర్ ఫ్లెమింగ్ అనే ప్రఖ్యాత వైద్యశాస్త్రవేత్త దీనిని కనుగొన్నాడు.

ఎవరికైనా చేస్తున్న పనిలో పొరపాటు జరగడం సహజమే. కానీ ఆ పొరపాటు ద్వారానే అద్భుతమైన ఆవిష్కరణ చేసి మానవజాతికి మహోపకారం చేశాడు అలెగ్జాండర్ ఫ్లెమింగ్. తొలి యాంటీ బయోటిక్ 'పెన్సిలిన్' రూపంలో 1928లో ఆవిష్కరించాడు. ఆధునిక వైద్య శాస్త్ర పురోగతిలో ఒక విప్లవాత్మకమైన మలుపు తీసుకొచ్చాడు. అంతేకాదూ... క్షయ, న్యుమోనియా, టైఫాయిడ్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి మానవాళికి రక్షణ కల్పించాడు. ఆ శాస్త్రవేత్త ఎవరో కాదు... బ్రిటిష్ జీవ శాస్త్రజ్ఞుడు అలెగ్జాండర్ ఫ్లెమింగ్. ఈ ఆవిష్కరణకుగానూ ఆయనకు 1945లో వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి లభించడం విశేషం.అలెగ్జాండర్ ఫ్లెమింగ్ 1881న ఆగస్టు 6న స్కాట్లాండ లో జన్మించాడు. తండ్రి కొండ ప్రాంతాన వ్యవసాయం చేసేవాడు. ఫ్లెమింగ్ కు బాల్యంలోనే నిశితమైన పరిశీలనాశక్తి ఉండేది. ఏ విషయాన్నైనా సులభంగా అట్టే గ్రహించే చురుకుదనం ఉండేది. సొంత ఊళ్ళో కొంతవరకు విద్యాభ్యాసం చేసి, ఆ తర్వాత పొరుగు ఊరిలోని పాఠశాలలో కాలినడకన వెళ్లి చదివేవాడు. ఒక షిప్పింగ్ కంపెనీలో చిన్న ఉద్యోగంలో చేరి పాలిటెక్నిక్ చదవసాగాడు. కొంత డబ్బు సమకూరాక వైద్యవిద్య ప్రవేశపరీక్ష రాసి ప్రథముడిగా నిలిచాడు.చదువుతోపాటు ఆటలు, నాటకాలలో కూడా ఉత్సాహంగా పాల్గొనేవాడు.

ఐదు సంవత్సరాల వైద్యవిద్యలో పన్నెండు వైద్య కళాశాల లన్నింటిలోకి ప్రథముడిగా ఉత్తీర్ణుడైనాడు. తాను అభ్యసించిన లండన్ లోని సెయింట్ మేరీస్ కళాశాలలోనే ఆస్పత్రి టీకాల విభాగంలో పరిశోధన చేస్తున్న ఆల్బర్ట్ రైట్ కు సహాయకునిగా ఉద్యోగంలో చేరాడు. ఆయన కనిపెట్టిన వాక్సిన్ థెరపీ అనే వైద్య ప్రక్రియ ప్రయోగాలను పరిశీలిస్తూ, వాటిపై పరిశోధన చేసేవాడు. తాను చేసిన పరిశోధనా ఫలితాలను విలువైన వ్యాసాల ద్వారా ప్రకటించేవాడు. 1914లో బ్రిటన్ యుద్ధ సైనికులకు ఏర్పడిన గాయాలను మానకుండా చేసే క్రిములపై పరిశోధనకు రైట్ తో పాటు ఫ్లెమింగ్ ను ఆహ్వానించింది. ఎంతో తీవ్రంగా జరిపిన పరిశోధన ద్వారా గాయాలను కుళ్ళింపజేసే సూక్ష్మ జీవులను గురించి తెలుసుకోవడానికి వీలైనది. కానీ క్రిములను నశింపచేయ డం తెలియలేదు.

యుద్ధం పూర్తి అయిన తర్వాత మేరీ ఆస్పత్రిలోని పరిశోధనా విభాగంలో సూక్ష్మాంగ క్రిమిశాస్త్రంలో అధ్యాపకుడిగా నియమింపబడ్డాడు. 1922 సంవత్సరంలో శరీరంలోని గోళ్ళు, కన్నీరు, ముక్కు చీమిడి మొదలైన వాటిలో క్రిమినిరోధక పదార్థం ఉన్నదని కనుగొన్నాడు. దీనికి లైసోజోమ్ అని పేరుపెట్టాడు. ఇది తెల్లరక్తకణాలవలే శక్తివంతమైన క్రిమిసంహారిణి. 1928 సంవత్సరంలో ఫ్లెమింగ్ ఇనాక్యులేషన్ విభాగంలో అసిస్టెంటు డైరెక్టరయ్యాడు. ఒకసారి తన ప్రయోగశాలలో పళ్ళెంలో ఉంచిన ఓ పదార్థం చుట్టూ బూజుపట్టి ఉండడం గమనించాడు.

పదార్థమంతా కుళ్ళి పసుపురంగులోకి మారి, దానినిండా సూక్ష్మ క్రిములుండడం కానీ ఆ సూక్ష్మ క్రిములు బూజు దగ్గరకు వెళ్ళకపోవడంతో అలెగ్జాండర్ కళ్ళు మిలమిలా మెరిశాయి. అంటే బూజులో సూక్ష సూక్ష్మ క్రిములను అరికట్టే పదార్థమేదో ఉన్నదని ఆనందంతో ఉప్పొంగాడు. అలా అనాలోచితంగా జరిగిన సంఘటనే పెన్సిలిన్ కనిపెట్టడానికి దారితీసింది. దీనిని పలుచనచేసే కొద్దీ దీని క్రిమిసంహారక ధర్మం ఎక్కువైంది. కార్బాలిక్ ఆమ్లం కంటే దీనికి 300 రెట్లు ఎక్కువగా క్రిములను చంపేశక్తి ఉన్నది. ఇది రొట్టెల మీద పట్టే బూజు జాతికి చెందినది. పెన్సిలియం అనే పరాన్నభుక్కు జాతి వృక్షం నుండి వచ్చినది కాబట్టి ఫ్లెమింగ్ దీనికి పెన్సిలిన్ అనే పేరు పెట్టాడు. 1942 యుద్ధ సమయంలో పెన్సిలిన్ ఇవ్వడం ద్వారా అద్భుత ఫలితాలు రావడంతో దాని ప్రాముఖ్యత మరింత పెరిగింది. అధికమొత్తం పరిశ్రమలనుండి పెన్సిలిన్ ఉత్పత్తి మొదలై ఫ్లెమింగ్ కీర్తి పతాకం ఉవ్వెత్తున ఎగరవేయబడింది. సెయింట్ మేరీ కళాశాల 18వ శతాబ్దపు 'సిల్వర్ సాల్వర్' ని బహూకరించారు. తన జీవితంలో ఎన్నో అవార్డులు, సభ్యత్వాలు, గౌరవ డాక్టరేట్లు పొం దాడు. 1945లో నోబెల్ వరించింది. 1955, మార్చి 11న కీర్తిశేషుడయ్యాడు.

*(మార్చి 11 అలెగ్జాండర్ ఫ్లెమింగ్ వర్థంతి)*

సుధాకర్, ఏ వి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
9000674747

# ఒకే దేశం, ఒకే ఎన్నిక - వ్యాధి కంటే ఘోరమైన చికిత్స



ఎం.కె.స్టాలిన్
తమిళనాడు ముఖ్యమంత్రి

ఇండోనేషియా దేశం 2019లో అధ్యక్ష పదవి, జాతీయ, ప్రాంతీ య శాసనసభలు, స్థానిక మండళ్లకు ఒకే రోజు చారిత్రాత్మకమైన ఎన్నికను నిర్వహించింది. ఖర్చులను తగ్గించడం, పరిపాలన ను సరళీకృతం చేయడం లక్ష్యంగా జరిపిన ఈ ఎన్నిక విషాదకరమైన మానవ నష్టాన్ని కలిగించింది. సుమారు 900 మంది పోలింగ్ సిబ్బంది మరణించగా, 5 వేల మందికి పైగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. 2024లో మరోసారి జరిగిన ఒకేరోజు ఎన్నికలో మళ్ళీ భారీ నష్టం జరిగింది. ఆ సందర్భంగా 100 కంటే ఎక్కువ మరణా లు, దాదాపు 15 వేల మందికి అనారోగ్యాలు సంభవించాయి. ఈ ప్రక్రియ ఓటర్లు, నిర్వాహకులపై భారం, ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజలు భాగస్వాములు కావటంపై ప్రభావాన్ని చూపిందని పేర్కొం టూ, 2025 జూన్‌లో ఆ దేశ రాజ్యాంగ న్యాయస్థానం 2029 నుండి జాతీయ, స్థానిక ఎన్నికలను రెండు నుండి రెండున్నర సంవత్సరాల వ్యవధిలో విడివిడిగా నిర్వహించాలని తీర్పు ఇచ్చింది.

భారతదేశంలో 'ఒకే దేశం, ఒక ఎన్నిక (ఒఎన్‌ఒఇ)' ప్రతిపాదనకు మద్దతుదారులు లోక్‌సభ (సాధారణ ఎన్నికలు), రాష్ట్ర శాసనసభ ఎన్నికలను కలిపి నిర్వహించటం ద్వారా ఖర్చు తగ్గుతుందని, భద్రతాదళాల దీర్ఘకాల మోహరింపులను పరిమితం చేయవచ్చని, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ప్రవర్తనా నియమావళి – ఎంసిసి) కారణంగా కలిగే అంతరాయాలను తగ్గించవచ్చని, రాజకీయ పార్టీలు నిరంతరం ప్రచార రీతిలో ఉండకుండా నిరోధించవచ్చని వాదిస్తున్నారు. అయితే, ఇండోనేషియా అనుభవం ఒక హెచ్చరిక పాఠాన్ని అందిస్తుంది. రాజ్యాంగ ఆచరణల మధ్య పోలికలు బలవంతపు జమిలి ఎన్నికలు నిర్వహణ విషయంలో కొంత వరకే మద్దతును అందిస్తాయి. కెనడాలో ఫెడరల్, ప్రావిన్షియల్ (రాష్ట్రాల) ఎన్నికలు స్వతంత్రంగా జరుగుతాయి. ఆస్ట్రేలియాలో జమిలి ఎన్నికలు అసాధ్యం. ఎందుకంటే, అక్కడ రాష్ట్ర శాసనసభల కాలపరిమితి నాలుగు సంవత్సరాలు, ఫెడరల్ హౌస్ (ప్రతినిధుల సభ) గరిష్టంగా మూడు సంవత్సరాల పదవీకాలం కలిగి ఉంటుంది.

జర్మనీ విషయంలో తరచుగా తప్పుగా ప్రచారం చేయబడుతుంది. దాని స్థిరత్వం జమిలి ఎన్నికల నుండి వచ్చింది కాదు. లాండర్(రాష్ట్రాల) ఎన్నికలు ఉద్దేశపూర్వకంగా అస్థిరంగా ఉంటాయి. కానీ నిర్మాణాత్మక అవిశ్వాస తీర్మానం విధానం ఉంటుంది. దీని ప్రకారం బుండెస్టాగ్(జర్మనీ పార్లమెంట్ ఎగువ సభ) ఛాన్సలర్ (దేశాధ్యక్షుడు)ని తొలగించే ముందు వారసుడిని ఎన్నుకోవాలి.

దక్షిణాఫ్రికా, ఇండోనేషియాలలో దామాషా ప్రాతినిధ్యం అమలులో ఉంది. ఇది రాజకీయ శక్తిని తగ్గిస్తుంది, మైనారిటీ గొంతులను రక్షిస్తుంది. భారతదేశంలోని ఫస్ట్–పాస్ట్–ది–పోస్ట్ (అధిక ఓట్లు పొందిన వారే విజేత) విధానంలో అలాంటి రక్షణలు లేవు. ఇది జాతీయ స్థాయిలో వీచే రాజకీయ గాలి రాష్ట్ర ఎన్నికలను తుడిచిపెట్టడానికి వీలు కల్పిస్తుంది. అమెరికా మరింత బలహీనమైన సారూప్యత ను అందిస్తుంది. అధ్యక్ష వ్యవస్థలో చట్టసభ విశ్వాసం నుండి కార్యనిర్వాహకవర్గం పదవీకాలం వేరుచేయబడినందున అక్కడ నిర్ణీతకాల ఎన్నికల చక్రాలు పనిచేస్తాయి.

### రాజ్యాంగ సవరణ ప్రతిపాదన

మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీ (2023–24) అత్యంత సమగ్రమైన బ్లూప్రింట్‌ను రూపొందించింది. అది ఇప్పుడు రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు, 2024 లో శాసన రూపం తీసుకుంటోంది. ప్రతిపాదిత ఆర్టికల్ 82–ఏ అన్ని రాష్ట్ర శాసనసభల పదవీకాలాన్ని లోక్‌సభతో సమాంతరం చేస్తూ 'అపాయింటెడ్ డేట్–నియమిత తేదీ)'ని ప్రకటించేందుకు రాష్ట్రపతికి అధికారం కల్పిస్తుంది. ఆ తేదీ తర్వాత ఏర్పడిన శాసనసభల పదవీకాలం ఐదేళ్ళు ముగియనప్పటికీ, వాటి పదవీకాలం కుదించబడుతుంది. ఈ బిల్లు 'అన్‌ఎక్స్‌పైర్డ్ టర్మ్ ఎలక్షన్ – కాలపరిమితిలో మిగిలిన కాలానికి ఎన్నికలను' కూడా ప్రవేశపెడుతుంది. అంటే ఒక శాసనసభ ముందస్తుగా రద్దు అయితే, కొత్త శాసనసభ పాతసభ మిగిలిన కాలానికి మాత్రమే పాలనాధికారం కలిగి ఉంటుంది తప్ప కొత్త ప్రజాతీర్పు ప్రకారం కాదు. అదనంగా, జమిలి ఎన్నికలు నిర్వహించడం అసాధ్యమని నిరూపించగలిగితే రాష్ట్ర ఎన్నికలను వాయిదా వేయాలని సిఫార్సు చేసే అధికారాన్ని ఇది భారత ఎన్నికల సంఘానికి కట్టబెడుతుంది. ఆర్టికల్ 83, 172, 327 లకు సవరణలు ప్రతిపాదించబడ్డాయి. ఈ మార్పులు తీవ్రమైన రాజ్యాంగపరమైన ఆందోళనలను లేవనెత్తుతాయి.

భారతదేశం ఉద్దేశపూర్వకంగా పార్లమెంటరీ వ్యవస్థను స్వీకరించింది. ఈ వ్యవస్థలో ప్రభుత్వాలు చట్టసభల విశ్వాసాన్ని నిలుపుకున్నంత కాలం మాత్రమే మనుగడ సాగిస్తాయి. రాజ్యాంగ సభలో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ప్రజాస్వామ్యం ఒకేసారి స్థిరత్వం, బాధ్యత ను పెంచేలా చేయలేదని వివరించారు. భారతదేశం హామీ ఇవ్వబడిన పదవీకాలం కంటే, నిరంతర కార్యనిర్వాహక జవాబుదారీతనాన్ని అందించే బాధ్యతను ఎంచుకుంది.

ఆర్టికల్ 75, 164 శాసనసభకు కార్యనిర్వాహక వర్గం సమిష్టి బాధ్యతను కల్పిస్తుంది. ఆర్టికల్ 83,172 శాసనసభలకు గరిష్టంగా ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని మాత్రమే నిర్దేశించాయి. అది కూడా హామీ ఇవ్వబడిన పదవీకాలం కాదు. కాబట్టి ముందస్తు రద్దు అనేది ఒక లోపం కాదు, ప్రజాస్వామ్య రక్షణ. ఇది విశ్వాసం కోల్పోయినప్పుడు ఓటర్లు మరోసారి తీర్పు ఇచ్చేందుకు అనుమతిస్తుంది. వన్ నేషన్ వన్ ఎలక్షన్ ఈ తర్కాన్ని వెనక్కినెట్టేస్తుంది. రద్దును పరిపాలనా అసౌకర్యంగా పరిగణిస్తుంది. పైకి కనిపించకుండా భారతదేశాన్ని చట్టసభ జవాబుదారీతనాన్ని బలహీనపరుస్తూ పాక్షిక అధ్యక్ష నమూనా వైపు మారుస్తుంది.

ఎస్.ఆర్.బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1994) కేసులో భారత సుప్రీంకోర్టు సమాఖ్యవాదం రాజ్యాంగం మౌలిక నిర్మాణ స్వరూపంలో భాగమని ధృవీకరించింది. రాష్ట్రాలు కేవలం పరిపాలనా విభాగాలు మాత్రమే కాదు, స్వతంత్ర రాజ్యాంగ గుర్తింపును కలిగి ఉంటాయి. వాటి ప్రజాస్వామ్య ధ్వనులు చట్టబద్ధంగా భిన్నంగా ఉండవచ్చు.

వన్ నేషన్ వన్ ఎలక్షన్ ఈ సూత్రాన్ని అస్థిరపరుస్తుంది. ఇది శాసనసభ విశ్వాసం కోల్పోయినందుకు కాకుండా, జాతీయ ఎన్నికల క్యాలెండర్ కు అనుగుణంగా రాష్ట్రాల ప్రజాతీర్పులను కుదించడానికి అనుమతిస్తుంది. 2029లో ప్రవేశపెట్టినట్లయితే, 2033లో శాసనసభలు ఎన్నుకునే రాష్ట్రం ప్రజాతీర్పు కేవలం ఒక సంవత్సరంలోనే ముగుస్తుంది.




ఇందుకు విరుద్ధంగా, పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలు, స్థానిక సంస్థలకు విడివిడిగా జరిగే ఎన్నికలు నిరంతరం ప్రజాభిప్రాయాన్ని అందించే విధానాన్ని కల్పిస్తాయి. ప్రజల మనోభావాలను ప్రభుత్వాలు జాగ్రత్తగా గమనించుకుంటాయి. రీకాల్ హక్కు లేని వ్యవస్థలో, అవి జవాబుదారీతనానికి మరో ఉత్తమ సాధనంగా పనిచేస్తాయి. జేమ్స్ మాడిసన్ 'ఫెడరలిస్ట్ నం.52'లో రాసినట్లుగా, తరచుగా జరిగే ఎన్నికలు ప్రభుత్వాలు 'ప్రజలపై తక్షణం ఆధారపడాల్సి రావటం, సానుభూతిని' కొనసాగించేలా చేస్తాయి.

**'గడువు ముగియని కాలం(అన్–ఎక్స్‌పైర్డ్ టర్మ్)' ఎన్నికల సమస్య**

అత్యంత ఇబ్బందికరమైన అంశం గడువు ముగియని శాసనసభ కాలానికి మధ్యంతర ఎన్నికలు. రాజ్యాంగం పరిశేష ప్రజాతీర్పు అనే భావనను గుర్తించదు. ప్రతిపాదిత ఆర్టికల్స్ 83(6), 172(5) కొత్తగా ఎన్నికైన సభ మునుపటి దానికి కొనసాగింపు కాదని పేర్కొన్నప్పటికీ, జమిలి ఎన్నికల కాలపరిమితం పాటించే నిమిత్తం అవి మునుపటి ఎన్నికల చక్రాలను సమర్థవంతంగా సంరక్షిస్తాయి. ఇది అనేక వక్రీకరణలకు దారి తీస్తుంది.

**మొదట,** ఇది ఓటు విలువను తగ్గిస్తుంది. మధ్యంతర ఎన్నికలు కుదించబడిన కాలానికి ప్రజాతీర్పుతో ప్రభుత్వాలను ఏర్పరుస్తాయి. ఎన్నికలను తాత్కాలిక కసరత్తులకు కుదిస్తాయి. ఓటర్లలో తీవ్ర ఉదాసీనతకు దారితీసే ప్రమాదం ఉంది.

**రెండవది,** ఇది పాలన, జవాబుదారీతనాన్ని దెబ్బతీస్తుంది. ఎందుకంటే పరిశేషకాల ప్రభుత్వాలకు నిర్మాణాత్మక సంస్కరణలకు ప్రోత్సాహకాలు లేవు. అవి ప్రజాకర్షక, విధాన గాలివాటాన్ని ప్రోత్సహిస్తాయి. ప్రవర్తనా నియమావళి విధించే తాత్కాలిక ఇబ్బందుల మాదిరిగా కాకుండా, కుదించబడిన కాలానికి ప్రజాతీర్పు వారాల పాటు కాకుండా సంవత్సరాల పాటు పాలనను బలహీనపరుస్తుంది.

**మూడవది,** ఇది 'గవర్నెన్స్ డెడ్ జోన్'ను సృష్టించే ప్రమాదం ఉంది. మధ్యంతర ఎన్నికలను తెచ్చిపెట్టే 'గడువు ముగియని పదవీకాలం' కనీస వ్యవధిని సవరణ బిల్లు పేర్కొనలేదు.

రాష్ట్ర స్థాయిలో, ఎన్నికలను వాయిదా వేయడం రాష్ట్రపతి పాలనను పొడిగిస్తుంది. దీనిని ఏడాదికే పరిమితం చేసిన ఆర్టికల్ 356(5) కి ఇది విరుద్ధమవుతుంది. జాతీయ అత్యవసర పరిస్థితి సమయంలో మాత్రమే భారత ఎన్నికల కమిషన్ సర్టిఫికేషన్‌తో మూడు సంవత్సరాల వరకు పొడిగించవచ్చు. కేంద్ర స్థాయిలో ఒక ఆపద్ధర్మ ప్రభుత్వం జమిలి ఎన్నికల కోసం వేచి చూస్తూ అధికారంలో అధికారంలో ఉండవచ్చు. ఇది, ప్రతి ఆరు మాసాలకు ఒకసారి పార్లమెంటు సమావేశం అవ్వాలనే ఆర్టికల్ 85 నిబంధనను ఉల్లంఘించే అవకాశం ఉంది. అలాంటి ప్రభుత్వం ఆర్టికల్ 112–117 కింద పూర్తి బడ్జెట్‌ను సమర్పించలేదు. ఓట్ ఆన్ అకౌంట్ (ఆర్టికల్ 116)కి మాత్రమే పరిమితం అవుతుంది. ఇది ఆర్థిక పాలనకు ఆటంకం కలిగిస్తుంది. కాబట్టి 'గడువు ముగియని కాలం' అనే విధానం కేంద్ర స్థాయి లో చట్టబద్ధంగా ఆరు నెలలకు మించి పనిచేయదు. అలా కాకుండా చేయాలంటే రాజ్యాంగానికి లోతైన మార్పులు చేయాల్సి ఉంటుంది. అవి రాజ్యాంగం అస్థిత్వాన్ని వక్రీకరించే, దాని ప్రాథమిక నిర్మాణ స్వరూప సిద్ధాంతాన్ని ఉల్లంఘించే ప్రమాదం ఉంటుంది.

లోక్‌సభతో పాటు రాష్ట్ర ఎన్నికలు ఏకకాలంలో నిర్వహించలేకపోతే, స్పష్టమైన ప్రమాణాలు, సమయ పరిమితులు లేదా పార్లమెంటరీ పర్యవేక్షణ లేకుండా రాష్ట్ర ఎన్నికలను వాయిదా వేయాలని సిఫార్సు చేయడానికి ప్రతిపాదిత ఆర్టికల్ 82ఎ(5) ఎన్నికల సంఘానికి అధికారం కల్పిస్తుంది. ఆర్టికల్ 356 కూడా పార్లమెంటరీ ఆమోదం, తాత్కాలిక పరిమితుల రక్షణలను కలిగి ఉంది. దీనికి విరుద్ధంగా, ఆర్టికల్ 82ఎ(5) మార్గనిర్దేశం చేయని విచక్షణ పరిధిని సృష్టిస్తుంది.

ఒక రాష్ట్ర ప్రభుత్వం మధ్యలో పడిపోతే, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి పాలన విధించి ఎన్నికలను వాయిదా వేయవచ్చు. ఆచరణలో గవర్నర్ ద్వారా రాష్ట్రాన్ని కేంద్రమే పరిపాలిస్తుంది. అయితే ఎన్నికల తర్వాత వచ్చే ప్రభుత్వానికి కుదించబడిన పదవీకాలం మాత్రమే వారసత్వంగా రావచ్చు.

సమస్య అటువంటి దుర్వినియోగం జరిగే అవకాశం ఉందా లేదా అనేది కాదు. కానీ సవరణ దానిని రాజ్యాంగబద్ధంగా సాధ్యం చేస్తుందనేది అసలు సమస్య. అలెగ్జాండర్ హామిల్టన్ ఫెడరలిస్ట్ నం. 59(1788)లో హెచ్చరించినట్లుగా, దుర్వినియోగానికి రాజ్యాంగబద్ధ అవకాశం కల్పించటం స్వయంగా 'బదులివ్వలేని అభ్యంతరం.' ఎన్‌జెఎసి కేసు (2015)లో రాజ్యాంగ చెల్లుబాటు సంస్థాగత రూపకల్పనపై ఆధారపడి ఉంటుందే తప్ప, సానుభూతి విన్యాసాలతో కూడిన హామీలపై కాదని కోర్టు పేర్కొంది. ఆచరణలో అధికారాన్ని ఎలా ఉపయోగించినప్పటికీ, మౌలిక స్వభావాన్ని నిర్మాణాత్మకంగా ప్రమాదంలో పడేసే సవరణ రాజ్యాంగ విరుద్ధం. జమిలి ఎన్నికల పేరుతో సుదీర్ఘకాలం ప్రజలచే ఎన్నుకోబడని ప్రభుత్వ పాలనకు అవకాశం కల్పించటం ద్వారా 'ఒకే దేశం, ఒక ఎన్నిక' సమాఖ్యతత్వాన్ని (ఫెడరలిజం) ఉల్లంఘించే ప్రమాదం ఉంది.

### ఖర్చు వాదన

ఎన్నికల ఆర్థిక భారం స్థూలంగా చాలా తక్కువ. ఈ గణాంకాలు అంత పెద్ద రాజ్యాంగ సవరణను సమర్థించబోవు. పార్లమెంటు స్థాయీ సంఘం అంచనాల ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఖర్చులు కలిపి దాదాపు రూ.4,500 కోట్లు (2015–16). ఇది కేంద్ర బడ్జెట్‌లో దాదాపు 0.25 శాతం, జిడిపిలో 0.03 శాతం. పిఆర్‌ఎస్ డేటా ప్రకారం లోక్‌సభ ఎన్నికల ఖర్చులు చారిత్రకంగా జిడిపిలో 0.02శాతం నుంచి 0.05 శాతం (1957–2014) వరకు ఉన్నాయి. ఎన్నికలు దశలవారీగా జరుగుతాయి (2024లో 82 రోజులు). ఇసిఐ, ఇవిఎంలు, వివిప్యాట్‌లు, భద్రతా దళాలను మార్చడానికి వీలు కల్పిస్తాయి. ఏకకాల ఎన్నికలు ఈ అనుకూలతను తొలగిస్తాయి. ఖరీదైన కొత్త వనరులను డిమాండ్ చేస్తాయి. ఇది పరిపాలనా ప్రయోజనాలను బలహీనపరుస్తుంది.

జిడిపిలో ఒక్క శాతంలో కొద్ది భాగాన్ని ఆదా చేయడానికి రాజ్యాంగాన్ని సవరించి సమాఖ్య తత్వాన్ని బలహీనపరచడం తెలివైన పనేనా? ఎన్నికలు తగ్గించుకోవలసిన భారం కాదు, స్వయం పాలన పునరావృత మూల్యం, అధికారం ప్రజలకు జవాబుదారీగా ఉండేలా చూసుకోవడం.

యూనియన్ – స్టేట్ రిలేషన్స్ (కేంద్రం – రాష్ట్ర సంబంధాలు)పై తమిళనాడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ కురియన్ జోసెఫ్ కమిటీ తన నివేదికలోని (ఫిబ్రవరి 2026) భాగం – 1లో బిల్లును ఉపసంహరించుకోవాలని సిఫార్సు చేసింది. తమిళనాడు ప్రభుత్వం కూడా ఈ వైఖరిని ఆమోదించింది. 'ఒక దేశం, ఒక ఎన్నిక' ప్రతిపాదన వాగ్దానం చేసిన ప్రయోజనాలు అతిశయోక్తిగా చెప్పబడ్డాయి. అయితే దాని వ్యవస్థాగత హాని చాలా లోతైనది. ఇది రాజ్యాంగ గుర్తింపును వక్రీకరిస్తుంది, మూల స్వభావాన్ని ఉల్లంఘిస్తుంది. ఇండోనేషియా చేసిన తప్పును భారతదేశం పునరావృతం చేయకుండా ఉండాలి.

*('ది హిందూ' సౌజన్యంతో)*

## ప్లంబింగ్ వ్యవస్థ సంరక్షణతో ఆరోగ్యకర సమాజం

ప్రతి సంవత్సరం మార్చి 11న ప్రపంచవ్యాప్తంగా వరల్డ్ ప్లంబింగ్ డే ను జరుపుకుంటారు. ఈ దినోత్సవాన్ని వరల్డ్ ప్లంబింగ్ కౌన్సిల్ ప్రారంభించింది. ప్రపంచ ప్రజలకు శుభ్రమైన నీటి సరఫరా, పరిశుభ్రత, పారిశుధ్య వ్యవస్థల ప్రాముఖ్యతను తెలియజేయడం ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం. నీరు మన జీవనానికి అత్యంత అవసరమైన సహజ వనరు. నీరు లేకుండా జీవించడం అసాధ్యం. కాబట్టి నీటిని సురక్షితంగా సరఫరా చేయడం, మురుగు నీటిని సక్రమంగా బయటకు పంపించడం చాలా ముఖ్యమైన పని. ఈ బాధ్యతను ప్రధానంగా ప్లంబింగ్ వ్యవస్థలు నిర్వర్తిస్తాయి. ప్లంబింగ్ అనేది నీటి సరఫరా, మురుగు నీటి పారుదల వ్యవస్థలకు సంబంధించిన ఒక ముఖ్యమైన సాంకేతిక రంగం. ఇళ్లల్లో, పాఠశాలల్లో, ఆసుపత్రుల్లో, కార్యాలయాల్లో, పరిశ్రమల్లో నీటి పైపులు అమర్చడం, ట్యాంకులు ఏర్పాటు చేయడం, వాల్వులు, డ్రైనేజ్ వ్యవస్థలను నిర్వహించ డం వంటి పనులు ప్లంబింగ్‌లో భాగం. ప్లంబింగ్ వ్యవస్థల ద్వారా మనకు తాగు నీరు అందుతుంది. మురుగు నీరు సురక్షితంగా బయటకు వెళ్తుతుంది. ఈ విధంగా ప్లంబింగ్ మన రోజువారీ జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మారింది.

ప్లంబింగ్ వ్యవస్థలు చాలా పురాతన కాలం నుంచే ఉన్నాయి. పురాతన నాగరికతలైన రోమన్లు, ఈజిప్టియన్లు నీటి సరఫరా కోసం పైపులు, కాలువలను నిర్మించారు. రోమన్లు తమ నగరాల్లో నీటిని సరఫరా చేయడానికి అద్భుతమైన కాలువలు నిర్మించారు. గోల్కొండ కోటలో కూడ నీటి సరఫరా మట్టి పైప్‌లైన్ ఇప్పటికి కనబడుతుంది. కాకతీయ రాజులు పాకాల లక్నవరం చెరువులు త్రవ్వించి త్రాగునీరు, సాగు నీరు సరఫరా చేసినట్లుగా ఇప్పటికి మన కళ్ళముందు కనబడుతూ ప్లంబింగ్ వ్యవస్థకు ప్రాధాన్యత ఇచ్చినట్లుగా చరిత్ర చెబుతోంది. కాలక్రమేణా సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో ప్లంబింగ్ వ్యవస్థలు కూడా మరింత మెరుగుపడ్డాయి. ప్రపంచ ప్లంబింగ్ దినోత్సవం మన కు నీటి విలువను పరిశుభ్రత ప్రాముఖ్యత ను గుర్తు చేస్తుంది. శుభ్రమైన నీరు ప్రతి మనిషి హక్కు. కాబట్టి నీటిని వృథా చేయకుండా సంరక్షించడం మంచి ప్లంబింగ్ వ్యవస్థలను నిర్వహించడం మనందరి బాధ్యత. ప్లంబర్ల సేవలను గౌరవించి సమాజ ఆరోగ్యాన్ని కాపాడేందుకు మనం అందరం కలిసి పనిచేయాలి.

ఆళవందార్ వేణు మాధవ్
8686051752,



## ప్రముఖ రచయిత, అభ్యుదయ వాది రోశయ్యకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/మధిర :** ప్రముఖ అభ్యుదయవాది, రచయిత మధిర పట్టణానికి చెందిన రామిశెట్టి రోశయ్యను సిపిఐ, వికాస వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంత ఉత్సవాలను పురస్కరించుకుని నూరేళ్ల అరుణ కేతనం అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఈ సందర్బంగా అభ్యుదయ, ప్రజా రచయితల నుండి రచనలను ఆహ్వానించగా రామిశెట్టి రోశయ్య కూడా నూరేళ్ల అరుణ కేతనం పుస్తకానికి ఒక కవితను పంపించారు. ఈ పుస్తక ఆవిష్కరణ ప్రముఖ సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ పుస్తకానికి రచనలను పంపిన ప్రతి ఒక్కరిని ఆరోజు సన్మానించారు. ఆరోగ్య రీత్యా రామిశెట్టి రోశయ్య నూరేళ్ల అరుణ కేతనం ఆవిష్కరణ సభకు హాజరు కాలేకపోయారు. మంగళవారం సిపిఐ, వికాస సాహిత్య వేదిక బాధ్యులు రోశయ్య ఇంటి వద్ద సన్మానించి నూరేళ్ల అరుణ కేతనం పుస్తకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వికాస వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్, అరసం బాధ్యులు ఎన్.కాంతేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, సిహెచ్ సీతామహలక్ష్మి, బెజవాడ రవిబాబు, సిపిఐ నాయకులు ప్రకాశరావు, చెరుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంతాలే టార్గెట్...

### అన్నపురెడ్డిపల్లిలో నకిలీ మినరల్ వాటర్ బాటిళ్ల దందా




**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** ఏజెన్సీ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని నకిలీ మినరల్ వాటర్ బాటిళ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు సమాచారం వెలుగులోకి వస్తోంది. ప్రముఖ కంపెనీల పేర్లతో ఉన్న బాటిళ్లలో శుద్ధి చేయని నీటిని నింపి ఏజెన్సీ గ్రామాల్లో విక్రయిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సమాచారం ప్రకారం కొందరు వ్యాపారులు బ్రాండెడ్ కంపెనీల బాటిళ్లు, లోగోలను సేకరించి వాటిలో సాధారణ బోర్ నీరు లేదా ట్యాంక్ నీటిని నింపి నకిలీ సీల్‌లతో మార్కెట్‌లోకి పంపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నకిలీ బాటిళ్లను టీ దుకాణాలు, చిన్న హోటళ్లు, బస్సు స్టాండ్లు, గ్రామీణ కిరాణా దుకాణాల్లో తక్కువ ధరలకు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి ఘటనలు గతంలో ఇతర ప్రాంతాల్లో కూడా వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. కొన్ని చోట్ల అధికారులు దాడులు నిర్వహించి నకిలీ వాటర్ బాటిల్ తయారీ కేంద్రాలను గుర్తించి వేల సంఖ్యలో బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వైద్యుల హెచ్చరికల ప్రకారం పరిశుభ్రత లేని నీటిని బాటిళ్లలో నింపి అమ్మడం వల్ల జీర్ణకోశ సమస్యలు, ఇన్‌ఫెక్షన్లు వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ప్రజలు మినరల్ వాటర్ బాటిల్ కొనుగోలు చేసే సమయంలో సీల్ సరిగా ఉందా, కంపెనీ పేరు, తయారీ తేదీ, అలాగే ఎఫ్ఎస్ఎస్ఏఐ లేదా బిఐఎస్ గుర్తింపు ఉందా అనే విషయాలను తప్పని సరిగా పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నకిలీ వాటర్ బాటిళ్ల దందాపై పూర్తి స్థాయి విచారణ జరిపి ఇటువంటి సరఫరాలను అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.



## శ్రీరామ నవమికి ముస్తాబు

### అందంగా మారుతున్న రామాయణ బొమ్మలు
### శరవేగంగా ఏర్పాట్లు
### 27న రామవనవి, 28న పట్టాభిషేకం

**ప్రజాపక్షం/భద్రాచలం :** దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆలయంలో శ్రీరామ నవమి ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఇందు కోసం రామాలయ పరిసర ప్రాంతాలతో పాటు, గాలిగోపురం, చుట్టు ప్రకారాలు, గోదావరి కరకట్ట ప్రాంతాలు ముస్తాబవుతున్నాయి. ఈ సందర్భంగా మిథిలా స్టేడయంలో పనులు ఊపందుకున్నాయి. గోదావరి కరకట్టపై ఏర్పాటు చేసిన రామాయణ ఇతి వృత్తాల (రామాయణ కథలోని ప్రధాన ఘట్టాలు) బొమ్మలను అందంగా తీర్చి దిద్దుతున్నారు. వాటికి చక్కటి రంగులు అద్ది, ఆ బొమ్మ దేనికి సంబంధించిన సందేశాన్ని తెలుపుతుందో అక్కడ రాసి ఉంచారు. ఇది రామభక్తులతో పాటు చూపరులను మరింతగా ఆకట్టుకుంటోంది.

**ఏర్పాట్లు శరవేగం :** రాముల వారి పెళ్లికి సంబంధించిన పనులు చకచకా సాగుతున్నాయి. చలువ పందిళ్లు ఏర్పాట్లు మొదలయ్యాయి. గోదావరి తీరంలో భక్తులు సేదతీరేందుకు ఏర్పాట్లు చేసే చర్యలు చేపట్టారు. వివిఐపి, విఐపితో పాటు భక్తులకు సెక్టార్ల పనులు దాదాపుగా మార్కింగ్ అయ్యాయి. ఇందులో భాగంగా పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని ఇప్పటికే మంత్రి పొంగులేటి, కలెక్టర్ అంకిత్‌లు ఆదేశించంగా అధికారులు ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. మరో ప్రక్క స్వాగత ద్వారాలకు సంబంధించిన పనులు మొదలు పెట్టారు. తెలుగు రాష్ట్రాల నుండే కాక పలు ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అధికారులు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేస్తున్నారు.

**19 నుండి :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 19 నుండి వసంతపక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామ నవమి తిరుకళ్యాణ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆ నాటి నుండి ఆలయంలో నిత్యకళ్యాణాలను రద్దు చేస్తారు. ఇదిలా ఉండగా 27న రామవవమి, 28న పట్టాభిషేక మహోత్సవాలు జరగనున్నాయి. తలంబ్రాల తయారీ కొనసాగుతోంది. మొత్తంగా 400 క్వింటాళ్ల తలంబ్రాలు అవసరం కానున్నాయనే అంచనాలతో సిద్ధం చేస్తున్నారు.

## కలుషిత ఆహార ఘటనలు
# పునరావృతం కావొద్దు


### విద్యార్థుల ఆరోగ్యాల పట్ల శ్రద్ధ తీసుకోవాలి
### అధికారులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదు
### ఐటిడిఏ పిఒతో కలిసి కలెక్టర్ అంకింత్



**ప్రజాపక్షం/భద్రాచలం:** విద్యాసంస్థలు, వసతి గృహాల్లో ఆహార కలుషిత ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థుల ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకింత్ అన్నారు. భద్రాచలం ఐటిడిఏ పిఒ రాహుల్‌తో కలిసి ఆయన మంగళవారం జిల్లాలోని అధికారులతో టెలికాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార పూర్తి బాధ్యత ఆర్‌సిఓలు, మండల ప్రత్యేకాధికారులదే అన్నారు. కలుషిత ఆహార ఘటనలపై కేవలం వంటవారు వార్డెన్లపై చర్యలు తీసుకోవడం సరిపోదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల మణుగూరు మహాత్మాగాంధీ జ్యోతిపూలే గురుకుల బాలికల పాఠశాలలో జరిగన కలుషిత ఆహారఘటన దురదృష్ట కరమని జిల్లా కలెక్టర్ అన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం కొందరు విద్యార్థినీల తల్లిదండ్రులు ఇంటి నుండి తీసుకొచ్చిన బిర్యాని, మాంసాహారాలు భుజిచడం వల్ల అస్వస్థతకు గురైనట్లు వెల్లడైందని, ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఆహార భద్రతా కమిటీ సభ్యులు ముందుగా వండిన ఆహారాన్ని స్వయంగా రుచి చూసి తర్వాత మాత్రమే విద్యార్థులకు వడ్డించాలన్నారు. జిల్లా, మండల ప్రత్యేకాధికారులు తమ పరిధిలోని విద్యా సంస్థలు, వసతి గృహాలను తరుచూ సందర్శిస్తూ ఆహార నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ అంశాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించేదిలేదని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు.

## సిపిఐ నూతన ప్రజాప్రతినిధులకు రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు

### ప్రారంభించనున్న కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తరుపున నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లైన ప్రజా ప్రతినిధులకు జిల్లాలోని పాల్వంచలో రెండురోజుల పాటు వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుగున ఫంక్షన్ హాల్లో 13,14 తేదీల్లో జరిగే ఈ కార్యక్రమాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు తొలి రోజు ఉ.10గం.లకు ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిలుగా సిపిఐ జాతీయ కంట్రోల్ కమీషన్ చైర్మన్ డా.కే నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, సిపిఐ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషాతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొంటారన్నారు. ఈ వర్క్‌షాపులో ప్రజాప్రతినిధులకు పలు అంశాలపై అవగాహన కల్పించేందుకు మాడభూషి శ్రీధర్, ప్రొఫెసర్ కోదండ రామ్, ప్రొఫెసర్ హరగోపాల్, పరకాల ప్రభాకర్, ప్రొఫెసర్ ఖాసీం, ప్రొఫెసర్ నాగేశ్వరరావు వంటి వ్యక్తులు వస్తున్నారన్నారు. ఈ రెండు రోజుల పాటు జరిగే వర్క్‌షాపుకు ప్రజాప్రతినిధులతో పాటు నియోజకవర్గ పుర ప్రముఖులు, వార్డు సభ్యులు వాల్గొని జయప్రథం చేయాలని పాషా కోరారు.

## ఎంజెపిటిసి బిసి హాస్టల్ విద్యార్థులకు అస్వస్థత

### ఫుడ్ పాయిజనింగ్ ఘటనపై డిఎం అండ్ హెచ్‌ఓ సమీక్ష



**ప్రజాపక్షం/మణుగూరు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డిఎం అండ్ హెచ్‌ఓ) మంగళవారం మణుగూరు ఏరియా ఆసుపత్రిని సందర్శించి, మణుగూరు ఎంజెపిటిసి బిసి హాస్టల్‌లో జరిగిన ఫుడ్ పాయిజనింగ్ ఘటనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 17 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు సమాచారం అందింది. వారిలో 16 మంది విద్యార్థులను మణుగూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. ఒక విద్యార్థికి ప్రాథమిక చికిత్స అందించి తిరిగి హాస్టల్‌కు పంపించారు. మిగతా విద్యార్థులు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ స్థిరంగా ఉన్నారు. వారిని ఏరియా ఆసుపత్రి బాల వైద్య నిపుణుడు పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. సందర్శన సందర్భంగా డిఎం అండ్ హెచ్‌ఓ విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారు తీసుకున్న ఆహారం గురించి వివరాలు తెలుసుకున్నారు. అలాగే వారికి ఎదురైన లక్షణాల గురించి ఆరా తీశారు. ఎక్కువగా విద్యార్థులు వాంతులు, కడుపు నొప్పి సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిపారు. తదుపరి డిఎం అండ్ హెచ్‌ఓ మణుగూరులోని ఎంజెపిటిసి బిసి హాస్టల్‌ను సందర్శించి, అక్కడ ఆర్‌బిఎస్‌కె బృందాలు, పిహెచ్‌సి మణుగూరు వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించి అవసరమైన వైద్య సేవలు అందించేందుకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా హాస్టల్ స్టాఫ్ నర్స్‌కు విద్యార్థులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన వెంటనే సమీపంలోని వైద్య అధికారులకు సమాచారం అందించాలని, అవసరమైనపుడు తక్షణ ప్రథమ చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉండగా, వైద్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షణలో ఉంచి అవసరమైన చికిత్స అందిస్తున్నారు.

## సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఐ డిమాండ్



మణుగూరు మండలంలోని ఎంబిసి బాలిక గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న 12 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ అస్వస్థతకు కారణమై విద్యార్థులు ఆసుపత్రిలో వైద్యం తీసుకుంటున్న దానిపైజిల్లా కలెక్టర్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు చేపట్టాలని, సిపిఐ మణుగూరు మండల, పట్టణ కార్యదర్శిలు జక్కుల రాజబాబు, దుర్గ్యాల సుధాకర్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం మణుగూరులోని వంద పడకల ఆసుపత్రిలో విద్యార్థులను కలిసి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్ జరిగిందా, వంటలో కల్తీ ఇంకేమైనా జరిగిందా, అనే దానిమీద విచారణ చేసి బాధ్యులైన వారిపై చర్యలు చేపట్టాలని, జిల్లాలో ఉన్నటువంటి అన్ని వసతి గృహాలను సంబంధిత అధికారులు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించాలని, హాస్టల్లో విద్యార్థులు ఏ విధంగా జీవిస్తున్నారు, ఏ విధంగా భోజన వసతి ఎలాఉంది, తెలుసుకోవాలని, అధికారులే కాకుండా ఎమ్మెల్యే, ఎంపీలు కూడా హాస్టల్లో నిద్రించాలని అప్పుడే విద్యార్థుల సమస్యలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలుస్తాయని వారన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాలు కోట్ల రూపాయలు వెచ్చించి వారికి అన్ని సదుపాయాలు అందించాలని లక్ష్యంతో చేస్తుంటే, ఇలా జరగడం దురదృష్టకరమని ఇలాంటి భవిష్యత్తులో జరగకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సందర్శించిన వారిలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు సోందే కుటుంబరావు, ఎఐటియుసి మణుగూరు మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్ వజ్రా వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, కార్యవర్గ సభ్యులు ఆధర్ల రాములు, కన్నెబోయిన ప్రసాద్, గారబోయిన నరేష్, గుంటక రంజిత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆవుల సర్వేశ్వరరావులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి

### స్వయంగా డ్రైన్ పూడిక తీసిన మేయర్



**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు స్పందించి పరిష్కరించాలని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 35,40,44,47 డివిజన్లలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేటర్లు వీశంశెట్టి విశ్వేశ్వరరావు, అడుసుమిల్లి సాయిబాబా, నామా కీర్తి, గుర్రం వెంకటేశ్వర్లు తదితరులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. 44వ డివిజన్లోని శ్రీనగర్ కాలనీ, గాంధీనగర్ ప్రాంతాలతో పాటు 35వ డివిజన్లోని ఇందిరా ప్రియదర్శిని కాలనీ, జ్యోతినగర్ ప్రాంతాల్లో ఆయన ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైన్ వ్యవస్థను పరిశీలించడంతో పాటు స్వయంగా డ్రైన్ పూడికను తీశారు. అదే విధంగా మేడికుంట చెరువును కూడా పరిశీలించారు. 44,39 డివిజన్ల మధ్యలో ఉన్న పెద్ద డ్రైనేజీ పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన ప్రజలు కాలువలు దాటుతూ నడవాల్సిన పరిస్థితి ఉందని గమనించారు. వర్షాలు, వరదల సమయంలో నీరు నిలిచి ఇళ్లలోకి చేరుతుందని స్థానికులు తెలపడంతో సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా సంబంధిత శాఖాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలో ఆయనకు షాలువాలు కప్పి పూల దండలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నరాటి ప్రసాద్, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, అన్నవరపు వెంకటేశ్వర్లు, వీశంశెట్టి పద్మజ, గొర్ల నరేష్, కొమ్మవరపు ఆదామ్, నవీన్, నామా పండు, యాకయ్య, గౌతమి కృష్ణ, కిన్నెర శ్రీను, ఆగరెడ్డి వెంకట్రెడ్డి, గూడపాటి నర్సింహారావు, నారపోగు రామయ్య, వెంకన్న, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## ఇంకా అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు

### మంత్రి ఇలాకాలో జీవో అమలుపై సందేహాలు

**ప్రజాపక్షం/కూసుమంచి:** ప్రభుత్వ కార్యాలయాలను ప్రైవేట్ అద్దె భవనాల నుండి ప్రభుత్వ భవనాలకు మార్చాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ, పాలేరు నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఇప్పటికీ అద్దె భవనాల్లోనే కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఇది మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇలాకాలోనే ఉండటం చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ ప్రభుత్వం ఫైనాన్స్(డబ్ల్యూపి)విభాగం సర్కులర్ మెమో నంబర్ 3469202 ఏ/310/ఎక్స్‌డబ్ల్యుపి/ఏ1/2025 ద్వారా డిసెంబర్ 31, 2025 నాటికి ప్రైవేట్ భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను ప్రభుత్వ భవనాలకు మార్చాలని ఆదేశించింది. అలాగే 2026 జనవరి 1 నుండి ప్రభుత్వ కార్యాలయాలు స్వంత భవనాల్లోనే పని చేయాలని స్పష్టం చేసింది. ఫిబ్రవరి 1 నుండి ప్రైవేట్ భవనాలకు అద్దె చెల్లింపులు నిలిపివేయాలని కూడా ట్రెజరీ అధికారులకు సూచనలు ఇచ్చింది. అయితే పాలేరు నియోజకవర్గంలో అనేక కార్యాలయాలు ఇంకా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఐసిడిఎస్ తిరుమలాయపాలెం ప్రాజెక్ట్ పరిధిలోని నేలకొండపల్లి మండలంలో 2, కూసుమంచి మండలంలో 13, తిరుమలాయపాలెం మండలంలో 22 అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మొత్తం 37 కేంద్రాలు అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు.

**కూసుమంచి మండలంలో...** కూసుమంచి మండలంలో పలు గ్రామ పంచాయితీ కార్యాలయాలు, సహకార సంఘాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు కూడా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. దీంతో ప్రతి నెలా ప్రభుత్వానికి భారీగా అద్దె భారం పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటంతో పిల్లలకు సరైన సౌకర్యాలు లేవని మహిళలు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోను పూర్తిగా అమలు చేసి, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాలకు స్వంత భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

## పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పేద మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచే విధంగా పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కర్నాటి నగర్ లో మంగళవారం ఖాళీ గ్యాస్ సిలిండర్ లతో నిరసన కార్యక్రమాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపే విధంగా గ్యాస్ సిలిండర్ ధరలను పెంచిందన్నారు. వాణిజ్య వినియోగ గ్యాస్ సిలిండర్ ధరను రూ.115 పెంచడం వల్ల హోటల్ రెస్టారెంట్లో ఆహార పదార్థాలు ధరలు పెరిగి ప్రజలపై అదనపు భారం పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అలాగే గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరను రూ.60 పెంచడం వల్ల పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది అన్నారు. ఈ విధంగా ధరలు పెరగడం వల్ల అన్ని వస్తువుల ధరలపై ప్రభావం పడుతుందని, ప్రజలు కొనలేని పరిస్థితి దేశాన్ని నెట్టివేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యం వాదానికి లొంగి దేశ స్వతంత్ర విధానాలను భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తుందిన్నారు. భారతదేశ ఫెడరల్ వ్యవస్థను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రపంచ శాంతిని కాపాడే విధంగా అలీన విధానాన్ని అమలు చేసి యుద్ధాలు ఆపేందుకు కృషి చేయాలని కోరారు ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ మహిళా సంఘం నాయకురాలు మారిశెట్టి విజయ దుర్గ, బడుగు రాజేశ్వరి,కట్టేకొల ఉషా, బడుగు మాధవరావు,గుడిమెట్ల శ్రీనివాస్ రావు, ఎచ్చెర్ల గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## ఊరు అభివృద్ధే లక్ష్యం

### ప్రజాపక్షం ప్రత్యేక ఇంటర్వ్యూలో సిపిఐ సర్పంచ్ పుచ్చకాయల కమలాకర్ శ్రీదేవి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** మా ఊరిని పూర్తిగా అభివృద్ధి చేసి ప్రతి వ్యక్తికి సౌకర్యాలు అందించడమే లక్ష్యం అని గూడూరుపాడు సర్పంచ్ పుచ్చకాయల కమలాకర్ శ్రీదేవి అన్నారు. మౌలిక వసతులు, విద్య ఆరోగ్యం, తాగునీరు వంటి రంగాల్లో ప్రత్యేక దృష్టి పెట్టే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో పేదలకు ఇందిరమ్మ ఇండ్లను ఇప్పించే బాధ్యత తనదేనన్నారు. ఈ మేరకు 'ప్రజాపక్షం' ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను పంచుకున్నారు.

**ప్రశ్న:** మీగ్రామ అభివృద్ధికి ముఖ్య ప్రాధాన్యం ఏమిటి?

**సమాధానం:** గ్రామంలో ఇప్పటికే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కృషితో గూడూరుపాడు గ్రామానికి ప్రధానమైనటువంటి బైపాస్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. 80శాతం మేరకు సీసీరోడ్లు పూర్తయ్యాయి. మిగిలిన వాటిని పరిష్కారం చేస్తాను.

**ప్రశ్న:** మీగ్రామ అభివృద్ధికి ముఖ్య ప్రాధాన్యం ఏమిటి?

**సమాధానం:** రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రం, యువకులకు క్రీడా మైదానం ఏర్పాటుతో పాటు బిసి కాలనీలో తాగునీటి కోసం 60 లీటర్ల వాటర్‌ట్యాంక్ నిర్మాణం. నూతన గ్రామపంచాయతీ కార్యాలయం భవన నిర్మాణానికి ప్ర భుత్వం నుండి నిధులు మంజూరు చేయించుటకు కృషి చేస్తాను.

**ప్రశ్న:** ప్రస్తుతం గ్రామంలో ఉన్న ప్రధాన సమస్యలు ఏమిటి?

**సమాధానం:** యుపిహెచ్ ప్రభుత్వ పాఠశాలలో 50 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు కొరత ఉన్నది. అంగన్వాడీ బిల్డింగ్ పాతబడి ప్రమాదకరగా ఉంది. ఆరోగ్యం విషయంలో వైద్య సదుపాయాలు అంతంత మాత్రమే అందుతున్నాయి. ఇక్కడ రెండు వేల మందికి పైగా జనాభా కలిగి హెల్త్ సెంటర్ ఉన్నప్పటికీ, ఏఎన్ఎం, ఆరోగ్య కార్యకర్త తప్ప డాక్టర్ లేక హెల్త్ సర్వీస్ అందడం లేదు. అంతేకాకుండా 10పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. కోతుల బెడద కూడా విపరీతంగా ఉంది. దీనిపై తొలి సమావేశంలోనే తీర్మానం చేసి కలెక్టర్‌గారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా తమ పుచ్చకాయల వెంకటేశ్వర్లుశ్రీనివాస్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాలంటరీ టీచర్‌ను పెట్టి గౌరవ వేతనం ఇస్తున్నాము

**ప్రశ్న :** తాగునీరు. రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఏ చర్యలు తీసుకుంటున్నారు?

**సమాధానం:** పాడైన పాత బోర్లను రిపేర్ చేయించి, వాటి ద్వారా నీటి సమస్యను పరిష్కారంచే దిశగా ప్రణాళిక చేస్తున్నాం. అంతేకాకుండా చెరువు దగ్గర కట్ట కింద బావి పైపులు మరమ్మత్తులు చేపిస్తున్నాము. గొర్రెలు, మేకలు, గేదెలు, ఆవులు, మూగజీవాల తాగునీటి కొరకు నీటి స్టోరేజ్ పాయింట్ ఏర్పాటుకు కృషి చేస్తాను. రోడ్లు డ్రైనేజీలపై ప్రత్యేక దృష్టి పెట్టాము

**ప్రశ్న :** యువత, మహిళలు అభివృద్ధికి ఏ కార్యక్రమాలు చేస్తున్నారు

**సమాధానం :** యువత, మహిళల అభివృద్ధి కోసం గ్రామంలో ప్రత్యేక ప్రణాళికను రూపొందించాలనుకుంటున్నాను

**ప్రశ్న :** చెరువులు పర్యావరణ కోసం ఏం చర్యలు తీసుకుంటున్నారు?

**సమాధానం :** ఇక్కడి గూడూరు కుంట, అన్నం కుంట చెరువు ప్రైవేట్ వ్యక్తి పేరు మీద ఉంది. అధికారులు దృష్టికి తీసుకువెళ్లి అతని పేరు పైనుంచి తొలగింపు చేపిస్తాను. అలాగే పిట్టలవారిగూడెం దామచెరువు ఆక్రమణకు గురవుతున్నది. దానిని కాపాడే ప్రయత్నం చేసి. చెరువులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాను. పర్యావరణంపరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం.

**ప్రశ్న :** ప్రజల సహకారం ఎలా ఉంది?

**సమాధానం :** ప్రజల నుంచి చాల మంచి సహకారం ఉంది. మా కుటుంబంపై వారికి ఉన్న నమ్మకాన్ని నిలబెడతానన్న సంపూర్ణ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రజలందరినీ మరింత సంఘటితం చేస్తూ ఊరు రూపురేఖలను మారుస్తాను

**ప్రశ్న:** ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?

**సమాధానం :** ఊరిలో ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. ఎవరికైన రేషన్‌కార్డు లేకుంటే ఇప్పిస్తాను. మంత్రిగారి సహకారంతో ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదలకు ఇప్పించే బాధ్యత నాదే

**ప్రశ్న :** చివరగా ఏమైనా చెప్పాలనుకుంటున్నారా?

**సమాధానం :** నా గెలుపులో సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత కృషి వెలకట్టలేనిది. అలాగే మహిళలు చూపిన ఆధార అభిమానాలు మరువలేనివి. ప్రధానంగా నా భర్త వెన్నంటే ఉంటూ ఇచ్చిన ప్రోత్సాహం నా అదృష్టం. ఈ అవకాశం ప్రజసేవకే అంకితం చేస్తాను.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ...

# ఎట్టకేలకు ఓరుగల్లు కల సాకారం



నెరవేర్చుకున్న సిఎం ఎన్నికల హామీ

రూ.5,257.20 కోట్లు మంజూరు చేస్తూ జీవో జారీ

**ప్రజాపక్షం/హనుమకొండ :** ఓరుగల్లు ప్రజల దశాబ్దాల కల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నెరవేరబోతున్నది. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చుకున్నారు. రాష్ట్ర రాజధాని తర్వాత అతిపెద్ద నగరమైన గ్రేటర్ వరంగల్‌లో మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూడిజి) ప్రాజెక్టుకు ఎట్టకేలకు శ్రీకారం చుడుతున్నారు. ఈ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5,257.20 కోట్లు మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది. ఏప్రిల్లో మొదటి దశ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ ప్రాజెక్టును 4 ప్యాకేజీలు, 9 జోన్లు, 13 సబ్ జోన్లుగా విభజించి చేపట్టనున్నారు. వచ్చే 2, 3 ఏండ్లలో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2025 నాటికి గ్రేటర్ వరంగల్ జనాభా 11,24,336 కాగా, 2057 నాటికి 22 లక్షలకు పెరుగుతుందని అంచనా, దీనిని దృష్టిలో పెట్టుకుని మొత్తం 2.739 కిలోమీటర్ల యూడీసీ నెట్ వర్క్ నిర్మించనున్నారు.

**నెరవేర్చుకున్న సిఎం ఎన్నికల హామీ**

వరంగల్‌లో యూడీఎస్ ప్రతిపాదనను 1995లో అప్పటి కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి ముందుకు తీసుకు వచ్చినా తరువాత ప్రాజెక్ట్ నిలిచిపోయింది. అప్పటి నుంచి ప్రతి ఎన్నికల్లో ఇది రాజకీయ హామీగానే మిగిలింది. తాజాగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో వరంగల్‌కు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి యూడీసీ నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. ఆ వెంటనే డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితోపాటు ఎంపీ కడియం కావ్య గ్రేటర్ పరిధి ఎమ్మెల్యేలు కొండా సురేఖ, కేఆర్. నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, మేయర్ సుధారాణి, జీడబ్ల్యూఎంసీ కమి షనర్ అధికారులను సమన్వయం చేస్తూ ప్రణాళిక సిద్ధం చేయడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

**2.92 లక్షల ఇండ్లకు కనెక్షన్లు..**

గ్రేటర్ వరంగల్ నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 66 డివిజన్లు. 42 విలీన గ్రామాల్లో వి స్తరించి ఉంది. మొత్తం 407.7 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 3,137 కి.మీ. రోడ్లు ఉన్నాయి. పక్కా డ్రైన్ 882.20 కి.మీ.. కచ్చ డ్రైన్ 1897.80 కి.మీ., వరద నీటి కాలువలు 99.80కి.మీ. కలిపి మొత్తంగా 2,780 కి.మీ. డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులో ఉంది. ఈ క్రమంలో జీడబ్ల్యూఎంసీ అధికా రులతో కలిపి రాజస్థాన్‌కు చెందిన ఎన్.కే. బిల్డ్ కాన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ యూడీఎస్ నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ రెడీ చేసింది. 2027 నాటికి నగరంలోని 2,92,194 ఇండ్లకు సీవరేజీ కనెక్షన్లు ఇవ్వాలని ప్రణాళిక రూపొందించారు.

**మురుగునీటి శుద్ధికి 23 ఎస్టీపీలు..**

నగరంలోని మురుగునీటిని శుద్ధి చేయడానికి సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)లు కీలకం కానున్నాయి. ప్రస్తుతం 20 ఎంఎల్డీ సామర్థ్యం ఉన్న రెండు ఎస్టీపీలు ఉండగా, మరో 204 ఎంఎల్డీ సామర్థ్యంతో 21 కొత్త ఎస్టీపీలు నిర్మించనున్నా రు. మొత్తం 23 ఎస్టీపీలు, 7 సీవేజ్ పంపింగ్ స్టే షన్లు. 12 కమ్యూనిటీ స్టెబిలైజేషన్ ట్యాంకులతో యూడీసీ వ్యవస్థ పనిచేయనుంది. శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలు, నగర పచ్చదనం కోసం విని యోగించనున్నారు..

**మొదటి దశలో వర్ధన్నపేట నియోజకవర్గంలో..**

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు 9 జోన్లు, 13 సబ్ జోన్ల పరిధిలో చేపడుతుండగా.. ప్రారంభం మాత్రం వర్ధన్నపేట నియోజకవర్గంలోని జోన్ 1 పరిధిలోని ఉనికిచర్ల, దేవన్నపేట, చింతగట్టు, హసన్‌పర్తి తదితర ప్రాంతాల్లో చేపట్టనున్నారు. తరువాత దశలవారీగా ఇతర జోన్లలో పనులు విస్తరించనున్నాయి. దీంతో వరంగల్ నగరంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.



## సెమినార్‌లో పరిశోధన పత్రాలు సమర్పించిన నిట్ విద్యార్థులు

**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ కళాశాలలో జాతీయ విద్యావిధానం 2020పై నిర్వహించబడ్డ జాతీయ సెమినార్‌లో విద్యా విభాగానికి చెందిన 17 మంది నేషనల్ ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ వరంగల్ (నిట్) విద్యార్థులు పాల్గొని తమ పరిశోధన పత్రాలు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌లో చాలా చక్కగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్స్‌ను పొందిన సందర్భంలో నిట్ విద్యా విభాగపు అధిపతి ప్రొఫెసర్ డీ.శ్రీనివాసాచార్య పరిశోధకులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు సెమినార్‌లో పరిశోధనా పత్రాలను సమర్పించిన విద్యార్థులను అభినందిస్తూ, విద్యార్థులందరూ మరిన్ని జాతీయ సెమినార్లలో, పాల్గొని పత్రాలను సమర్పించి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మార్క శంకర్ నారాయణ విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆల్ఫా శాంతా కుమారి, విద్యార్థులు సత్యప్రకాష్, శ్రద్ధానంద, చిత్తరంజన్, అపర్ణ, నేహా కె నాయర్, జ్యోత్స్న, ప్రనూష, బాలసమీంద్ర, అభిలాష్ అయ్యప్పన్, భార్గవ్, అభినవ్ సింగ్, అమన్ కుమార్, చంద్ర తేజస్వి, వర్ష, తబిత, ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

## అప్పల బాధతో యువరైతు ఆత్మహత్య

**ప్రజాపక్షం/నెక్కొండ :** వరంగల్ జిల్లా నెక్కొండ గ్రామానికి చెందిన యువ రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే... నెక్కొండ గ్రామానికి చెందిన సంకినేని సాంబరాజు(33)కు ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఆయనకు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. కుటుంబ పోషణ కోసం వ్యవసాయం చేస్తూ రోజువారీ కూలి పనులు కూడా చేసేవాడు. అయితే కుటుంబ అవసరాల నిమిత్తం తీసుకున్న అప్పులు పెరగడంతో తీవ్ర మనస్థాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మార్చి 8న ఉదయం సుమారు 11.30గంటల సమయంలో తన పంట పొలాల కోసం తెచ్చుకున్న గడ్డి మందును తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు వెంటనే అతన్ని హన్మకొండలోని చక్రవర్తి ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ మార్చి 9 సాయంత్రం 5.54గంటలకు మృతి చెందాడు. మృతుడి తండ్రి సంకినేని లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నెక్కొండ సబ్ ఇన్స్పెక్టర్ ఎం.మహేందర్ తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## భార్యను రోకలి బండతో కొట్టి చంపిన భర్త

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** వరంగల్ నగరంలోని ఎస్ఆర్‌నగర్‌లో సోమవారం రాత్రి దారుణ ఘటన చోటు చేసుకున్నట్లు తెలిసింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆటో డ్రైవర్ అబ్బరబోయిన రాజు తన భార్య అనిత (40)పై రోకలిబండతో దాడి చేసినట్లు సమాచారం. తలపై బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడిన అనితను కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు ఆసుపత్రి వర్గాల సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న ఎనుమాముల పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిసింది. కుటుంబ కలహాలే ఘటనకు కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలం



ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించగలమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఐడిఓసి కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల ఆధ్వర్యంలో మెడికవర్, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించగలరని తెలిపారు. అందుకే ప్రభుత్వం ఉద్యోగుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఇలాంటి ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, ఉద్యోగులు తమ ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పరీక్షించుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, టిజిఓ కార్యదర్శి సునీల్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ మహమ్మద్ సంధాని, కార్యవర్గ సభ్యులు డా॥ మధుసూదన్, ఫణి కుమార్, డా॥ వెంకన్న, సంతోష్, శ్రీనివాసరావు, స్వాతి టీజీఓ ప్రతినిధులు, మెడికవర్, ప్రభుత్వ వైద్యులు డా శ్రీదేవి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు



**ప్రజాపక్షం/వరంగల్ :** సావిత్రిబాయి పూలే సమాజానికి, మహిళా లోకానికి అందించిన సేవలు ఎనలేనివని, చదువుల తల్లిగా, సంఘసంస్కారిణిగా ఆమె ప్రజల హృదయాలలో చిరస్థాయిగా ఉంటుందని బిసిహక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా వరంగల్ కొత్తవాడలో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు దీక్షతో కృషి చేయడమే నిజమైన నివాళులన్నారు. ఈ కార్యక్రమంలో లింగబత్తిని శంకర్, బాసబత్తినిశ్రీనివాస్, లింగాల శ్రీనివాస్, ప్రశాంత్, లక్ష్మి, రమాదేవి, ఎం పద్మ, పుణ్యవతి, రజిత, రమా, రాధ, నగ్మా, భాను, ప్రియాంక, లలిత, రాణి, అనూష తదితరులు పాల్గొన్నారు.



## అందరి భాగస్వామ్యంతో ప్రణాళిక

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ప్రజాపక్షం/ములుగు :** అందరి భాగస్వామ్యంతో జిల్లాలో ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేస్తామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ములుగు పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నగరంలో 2కే రన్ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి జంక్షన్ బండారుపల్లి రోడ్డు నుండి చేపట్టిన ఈ పరుగును జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, మున్సిపల్ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రి జంక్షన్ బండారుపల్లి రోడ్డు ప్రధాన మార్గం మీదుగా జీవాంతరావుపల్లి ఎక్స్ రోడ్డు నుండి తిరిగి ప్రభుత్వ ఆసుపత్రి జంక్షన్ వరకు 2కే రన్ కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి 2కే రన్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంచేందుకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు. 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ నిరోధం కోసం హెచ్‌పివి వ్యాక్సిన్ తప్పక ఇప్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, మున్సిపల్ సిబ్బంది, యువత, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి

ఎల్కతుర్తి రైతు వేదికలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'

మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** గ్రామాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంపై మండల స్థాయి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ, విద్య, వైద్య ఆరోగ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి, పోలీస్, రవాణా తదితర శాఖల అధికారులతో మంత్రి 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పాలన అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. పది ముఖ్య అంశాలతో రూపొందించిన ఈ కార్యక్రమం మార్చి 6 నుండి జూన్ 12 వరకు కొనసాగుతుందని తెలిపారు. అదేవిధంగా 2026–27 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెరగాలని మంత్రి సూచించారు. జిల్లాలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు చెందిన డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేయాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి కోరారు. ఈ సందర్భంగా ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి, మిషన్ భగీరథ ఎస్ఈ చలమారెడ్డి, డీఈ గాయత్రి, డీఈవో గిరిరాజ్ గౌడ్, డీఆర్డీఓ మేన శ్రీను, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, రవాణా శాఖ డిటిసి సురేష్ రెడ్డి, కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి తదితరులు, వివిధ గ్రామాల సర్పంచులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ప్రసాదరావు, ఎంపీడీవో విజయ్ కుమార్, పాలక మండలి చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**ఎల్కతుర్తిలో జెండర్ రిసోర్స్ భవనం ప్రారంభం**

అనంతరం ఎల్కతుర్తిలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన జెండర్ రిసోర్స్ భవనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని, ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని అన్నారు. పర్యావరణానికి ముప్పుగా మారుతున్న ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ మేన శ్రీను, ఇతర అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సక్సెస్ కావాలంటే ఫోకస్ పెట్టాల్సిందే



స్టూడెంట్లు స్కూల్ యూనిఫామ్ ధరించకపోవడం పట్ల అసహనం : జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్

**ప్రజాపక్షం/నర్సింహులపేట :** సూడెంట్లు చదువులో సక్సస్ కావాలంటే దానిపై ఫోకస్ తప్పనిసరిగా పెట్టాలని జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజులలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టెన్త్ స్టూడెంట్లను సబ్జెక్టుల వారీగా సామర్థ్యాలను పరిశీలిచి పలు సూచనలు చేశారు. మోడల్ స్కూల్లో అన్ని రకాల వసతులు ఉన్నాయని నైపుణ్యం కలిగిన టీచర్లు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందని వీటిని స్టూడెంట్లు సద్వినియోగంచేసుకోవాలన్నారు. ఎక్కువ స్ట్రెస్ ఫీల్ కాకుండా చదువుకోవాలని పాస్ కావాలనే ఫీలింగ్ కాకుండా టాప్‌లో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఎక్కువ మంది స్టూడెంట్లు గణితం, సైన్స్‌లో వెనుకబడుతున్నారని వీటి కోసం మరో రెండు గంటలు టైం కేటాయించాలని తెలిపారు. స్కూల్లో ఎక్కువ మంది స్టూడెంట్లు యూనిఫామ్ ధరించకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఆనంతరం సూడెంట్లు రాసిన పరీక్ష పత్రాలను పరిశీలించారు. చదువులో రాణించి అత్యుత్తమ ఫలితాలు సాధించి పేరెంట్స్, టీచర్లకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న కామన్ డైట్ మెనూను పకడ్బందీగా అమలు చేయాలని స్టూడెంట్లు ఆరోగ్యంగా ఉంటే చదువుపై దృష్టి సారిస్తారని చెప్పారు. డైనింగ్ హాల్, తాగు నీటి వసతులపై వివరాలు అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధిక, ఎంఈవో రామ్మోహన్‌రావు, ఎంపీవో యాకయ్య, డిప్యూటీ తహశీల్దారు సుదకర్,ఆర్ఐ అఖిల్,స్థానిక సర్పంచ్ పెదమాముల యాకయ్య,ఉపసర్పంచ్ కాస యాకయ్య పాల్గొన్నారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశీరాం నాయక్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** గిరిజన ఆశ్రమ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఆధునిక సౌకర్యాలతో విద్యార్థులకు ఉన్నత స్థాయికి తీసుకువెళ్ళాలనే లక్ష్యంతో గిరిజన సంక్షేమ శాఖ పనిచేస్తోందని మహబూబాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశీరాం నాయక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో దేశీరాం చేతుల మీదుగా ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు స్టడీ మెటీరియల్, నైట్ డ్రెస్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల అసెంబ్లీలో పాల్గొన్న అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి నిమిషం ఎంతో విలుగా తీసుకుని పరీక్షలకు హాజరు కావాలని, ఉత్తమ ఫలితాలు సాధించి చదువు చెప్పిన గురువులతో పాటుగా పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. పదవ తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలని సాధించాలని అన్నారు. పాఠశాలలో ప్రిన్సిపాల్, సిబ్బంది మెనూ ప్రకారం భోజనం అందించాలని, విద్యార్థులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందులకు యోగా, క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దాలని డిడి సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎటిడిఓ ఉపేందర్, డిఆర్‌పి శ్రీకాంత్, పాఠశాల హెచ్ఎం నర్సయ్య, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందాలి

కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



**ప్రజాపక్షం/జనగామ:** ప్రజలందరికి నాణ్యమైన వైద్యం అందించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం జనగామ పట్టణంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పివి) టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హ్యూమన్ పాపిలోమా వైరస్ టీకా బాలికలను సర్వికల్ క్యాన్సర్ నుండి రక్షించడంలో ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. తల్లిదండ్రులు ఈ టీకా కార్యక్రమానికి సహకరించి బాలికలు తప్పనిసరిగా టీకా తీసుకునేలా చూడాలన్నారు. హెచ్‌పివి టీకా సర్వీకల్ క్యాన్సర్ నివారణకు సురక్షితమైన, సమర్థవంతమైన రక్షణ చర్య అని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.మల్లికార్జున్‌రావు, డాక్టర్ శ్యామ్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ కమల్ హాసన్, కనకరాజు, శిశు వైద్య నిపుణుడు డాక్టర్ అనురాధ, మెడికల్ ఆఫీసర్ యుపిహెచ్‌సి డాక్టర్ రేవతి పాల్గొన్నారు.

**ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల తనిఖీ**

ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పరిశీలించారు. మంగళవారం జనగామ పట్టణంలోని ధర్మకంచె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను పరిశీలించి కేంద్రంలో విద్యార్థుల హాజరు, గైర్హాజరుపై ఆరా తీశారు. పరీక్షలు పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా సజావుగా నిర్వయించాలన్నారు. విద్యార్థులకు తాగు నీరు, లైట్లు, ఫ్యాన్లు, మెడికల్ సౌకర్యాలు కల్పించాలన్నారు. మొబైల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికాలు కేంద్రంలోకి అనుమతించరాదన్నారు.

## ఎట్టకేలకు సొంత జిల్లాలకు పంచాయతీ కార్యదర్శులు

నాలుగేళ్లుగా ఎదురుచూసిన బదిలీలు పూర్తి

**ప్రజాపక్షం/నెక్కొండ :** గత ప్రభుత్వ కాలంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఇతర జిల్లాలకు బదిలీ చేయడం వలన అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. దూర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించాల్సి రావడంతో కుటుంబాల నుండి దూరంగా జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టి ప్రభుత్వాన్ని ఒప్పించడంతో జీవో నెంబర్ 317 అమలులోకి వచ్చింది. ఈ జీవో అమలుతో రాష్ట్రంలోని వివిధ శాఖల ఉద్యోగులు స్వంత జిల్లాలకు బదిలీ అయ్యారు. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న సుమారు 30 నుండి 40 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు మాత్రం కొన్ని సాంకేతిక కారణాల వలన వెంటనే స్వంత జిల్లాలకు వెళ్ళలేకపోయారు. వారు పనిచేస్తున్న గ్రామ పంచాయతీలు గ్రేడ్‌లో లేకపోవడం వలన బదిలీలు నిలిచిపోయాయి. దాదాపు నాలుగేళ్ల పాటు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల పరిస్థితులు అనుకూలించడంతో చివరికి వారు కూడా తమ స్వంత జిల్లాలకు వెళ్లే అవకాశం లభించింది. నెక్కొండ మండల పరిధిలోని రెడ్లవాడ గ్రామ పంచాయతీ కార్యదర్శి వేణు, వెంకటాపురం కార్యదర్శి శిరీషలు తమ స్వంత జిల్లా కరీంనగర్‌కు బదిలీ కాగా, ముదిగొండ గ్రామ కార్యదర్శి షరీఫ్ నిర్మల్ జిల్లాకు వెళ్ళిపోయారు. రెడ్లవాడ గ్రామ పంచాయతీకి అజ్మీర్ మంగ్య నాయక్ తండా పంచాయతీ కార్యదర్శి రంజిత్ కుమార్, వెంకటాపురం గ్రామానికి బొల్లికొండ పంచాయతీ కార్యదర్శి పెంటయ్య, ముదిగొండ గ్రామ పంచాయతీకి హరిచంద్ తండా పంచాయతీ కార్యదర్శి స్వామిలను ఇన్‌చార్జిలుగా నియమించినట్లు ఎంపిడిఓ ఎం.లావణ్య, కార్యాలయ అధికారి దయాకర్ తెలిపారు.

## సమస్యల బోర్డ్ మెడలో ధరించి సిపిఐ కౌన్సిలర్ల వినూత్న నిరసన



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మహబూబాబాద్ మున్సిపాలిటీ మొదటి సమావేశం సందర్భంగా సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ 33 వ వార్డు కౌన్సిలర్ బి.అజయ్ సారథి రెడ్డి ఆధ్వర్యంలో సిపిఐ కౌన్సిలర్లు రేషపల్లి నవీన్ నర్రా సంధ్య శ్రావణ్ లతో కలిసి వార్డుల్లో ముఖ్యంగా మహబూబాబాద్ పట్టణంలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని సమస్యల బోర్డు మెడలో ధరించి వినూత్నంగా మున్సిపాలిటీ సమావేశంలోకి వెళ్లారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ సమావేశానికి హాజరు అయ్యారు. ఈ సందర్భంగా సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ 33వ వార్డు కౌన్సిలర్ బి.అజయ్ సారథి రెడ్డి మాట్లాడుతూ 33, 18, 25 వార్డులతో పాటు పట్టణంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ముఖ్యంగా 33వ వార్డులో మార్కెట్‌ను గాంధీ పార్క్ నుండి నూతనంగా నిర్మించిన మార్కెట్లోకి తీసుకుపోయే విధంగా చర్యలు తీసుకోవాలని, శ్రీరాముని కళ్యాణం గాంధీ పార్క్‌లో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని 18 25 వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, పట్టణంలో ఇంటి నెంబర్లు ఇవ్వాలని, యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ముఖ్యంగా కొత్త బజార్‌లో కరెంటు బిల్లులు కట్టే ఆఫీస్ వెంటనే ఏర్పాటు చేయాలని వివిధ సమస్యలను తెలియజేస్తూ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు కౌన్సిలర్ దేశపల్లి నవీన్, 25వ వార్డు కౌన్సిలర్ సంధ్యా శ్రావణ్‌లతోపాటు పార్టీ శ్రేణులు పెరుగుకుమార్, చింతకుంట్ల వెంకన్న, వెలుగు శ్రావణ్,తోట రమేష్,మంద శంకర్,తండా శ్రీనాథ్ పాల్గొన్నారు.

## ప్రపంచకప్ జట్టులో
# నలుగురికి చోటు

టీ20 ప్రపంచకప్ 2026లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన ఆటగాళ్లతో ఐసిసి అత్యుత్తమ జట్టును ప్రకటించింది. ఈ జట్టులో భారత్ నుంచి నలుగురు ఆటగాళ్లు అవకాశం అందుకున్నారు. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ సంజూ శాంసన్‌తో పాటు ఇషాన్ కిషన్, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా చోటు దక్కించుకున్నారు. ఈ టోర్నీ టాప్ స్కోరర్‌గా నిలిచిన పాకిస్థాన్ ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్‌కు కూడా ఈ జట్టులో చోటు దక్కింది. పాకిస్థాన్ నుంచి ఈ జట్టుకు ఎంపికైన ఏకైక ఆటగాడు అతను. సౌతాఫ్రికా నుంచి ఎయిడెన్ మార్క్‌రమ్, లుంగి ఎంగిడి అవకాశం అందుకోగా.. ఇంగ్లాండ్ నుంచి విల్ జాక్స్, ఆదిల్ రషీద్ చోటు దక్కించుకున్నారు. వెస్టిండీస్ నుంచి జాసన్ హోల్డర్‌కు అవకాశం దక్కింది. జింబాబ్వే బౌలర్ ముజరబాని అవకాశం అందుకోగా.. అమెరికా పేసర్ షాడ్లీ వాన్ షాక్ 12వ ఆటగాడిగా ఎంపికయ్యాడు. ఐసిసి టీమ్ ఆఫ్ ది టోర్నీ జట్టుకు ఎయిడెన్ మార్క్‌రమ్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేయగా.. సంజూ, ఫర్హాన్ ఓపెనర్లుగా.. ఇషాన్ కిషన్, మార్క్‌రమ్ మిడిలార్డర్ బ్యాటర్లుగా ఎంపికవ్వగా.. హార్దిక్ పాండ్యా, విల్ జాక్స్, జాసన్ హోల్డర్ ఆల్‌రౌండర్లుగా అవకాశం అందుకున్నారు. బుమ్రా, ఎంగిడి, ముజరబాని పేసర్లుగా ఎంపికవ్వగా.. ఆదిల్ రషీద్ స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా అవకాశం అందుకున్నాడు. అయితే ఈ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్ నుంచి ఒక్క ఆటగాడికి అవకాశం దక్కకపోవడం గమనార్హం. భారత విజయంలో కీలక పాత్ర పోషించిన శివమ్ దూబేకు ఈ జట్టులో చోటు దక్కలేదు. ఐసిసి టీమ్ ఆఫ్ ది టోర్నీ: సాహిబ్‌జాదా ఫర్హాన్, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, ఎయిడెన్ మార్క్‌రమ్(కెప్టెన్), హార్దిక్ పాండ్యా, విల్ జాక్స్, జాసన్ హోల్డర్, జస్‌ప్రీత్ బుమ్రా, లుంగి ఎంగిడి, ఆదిల్ రషీద్, ముజరబాని, షాడ్లీ వాన్ షాక్(12వ ఆటగాడు).



## టీమిండియాకు
# బిసిసిఐ భారీ నజరానా!

ఐసిసి టీ20 ప్రపంచకప్ 2026లో విజేతగా నిలిచిన భారత జట్టుపై భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ) కనక వర్షం కురిపించింది. ఏకంగా రూ. 131 కోట్ల భారీ క్యాష్ ప్రైజ్ ప్రకటించింది. భారత క్రీడా చరిత్రలోనే అత్యధిక రివార్డ్ ఇది. గతంలో కంటే రూ.6 కోట్లు ఎక్కువగా నజరానా ప్రకటించింది. ఐసిసి టీ20 ప్రపంచకప్ 2024లో విజేతగా నిలిచిన రోహిత్ సేనకు బిసిసిఐ రూ.125 కోట్ల క్యాష్ ప్రైజ్ అందజేసింది. అప్పుడు జట్టు మెంబర్స్ తలో రూ.5 కోట్లు తీసుకోగా.. రిజర్వ్ ప్లేయర్లకు రూ.1 కోటి చొప్పున క్యాష్ ప్రైజ్ దక్కింది. ఐసిసి టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్లో న్యూజిలాండ్‌ను 96 పరుగులతో చిత్తు చేసిన టీమిండియా వరుసగా రెండో టైటిల్ గెలవడంతో పాటు మూడో ట్రోఫీని ఖాతాలో వేసుకుంది. అంతేకాకుండా సొంతగడ్డపై టీ20 ప్రపంచకప్ గెలిచిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించింది. దాంతో సూర్యసేనకు బిసిసిఐ రూ.131 కోట్ల భారీ రివార్డ్ ప్రకటించింది. ఈ మేరకు బిసిసిఐ మంగళవారం ఓ ప్రకటనను విడదలు చేసింది. 'ఐసిసి టీ20 ప్రపంచ కప్ 2026లో సాధించిన ఘనవిజయానికి గుర్తుగా.. భారత క్రికెట్ జట్టుకు బిసిసిఐ రూ. 131 కోట్ల రూపాయల నగదు బహుమతిని ప్రకటించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్‌ను ఓడించిన భారత్ ప్రతిష్ఠాత్మక ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ విజయంతో టీమిండియా తన టైటిల్‌ను నిలబెట్టుకోవడంతో పాటు ఐసిసి పురుషుల టీ20 ప్రపంచ కప్ చరిత్రలో వరుసగా రెండుసార్లు టైటిల్ నెగ్గిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించింది. అంతేకాకుండా, మూడుసార్లు టీ20 ప్రపంచ కప్‌ను గెలుచుకున్న తొలి జట్టుగా కూడా అవతరించింది. ఈ ఫార్మాట్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన జట్టుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ఈ చారిత్రాత్మక విజయం నేపథ్యంలో ఆటగాళ్లను, సహాయక సిబ్బందిని, సెలెక్టర్లను బోర్డు మరోసారి అభినందిస్తూ.. భవిష్యత్తులో కూడా వారు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించింది.'అని బిసిసిఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఐపిఎల్-2026 షెడ్యూల్ రిలీజ్ డేట్ ఫిక్స్



ఐపిఎల్ 2026కు సంబంధించి మొదటి 20 రోజుల షెడ్యూల్‌ను బిసిసిఐ మార్చి 12న విడుదల చేయనుంది. ఈ విషయాన్ని బిసిసిఐ సెక్రటరీ దేవిత్ సైకియా ధ్రువీకరించారు. ఐపిఎల్ 19వ సీజన్ ప్రారంభ తేదీని మార్చి నట్లు నిర్వాహకులు అధికారికంగా ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. గతంలో ఈ మెగా టోర్నీని మార్చి 26న ప్రారంభించనున్నట్లు తెలిపారు. తాజాగా దీన్ని మార్చి 28కి వాయిదా వేసినట్లు ప్రకటించారు. కొత్త సీజన్‌కు ముందు ఆటగాళ్లు, ఫ్రాంచైజీలకు కాస్త సమయం ఇచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.'మేం ఐపిఎల్ 2026 షెడ్యూలును మార్చి 12న విడుదల చేయనున్నాం. ప్రస్తుతానికి 20 రోజుల షెడ్యూలును మాత్రమే ప్రకటించనున్నాం' అని బిసిసిఐ సెక్రటరీ దేవిత్ సైకియా ఓ వార్తాసంస్థకు మంగళవారం తెలిపారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మిగతా షెడ్యూలును తర్వాత విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఐపిఎల్లో పాల్గొనబోయే జట్లు ఇప్పటికే తమ ప్రాక్టీస్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. 'బిసిసిఐ అవార్డుల ప్రదానోత్సవం మార్చి 15న ఢిల్లీలో జరగనుంది. టీ20 ప్రపంచ కప్ ఛాంపియన్లతో పాటు ఇతర ఐసిసి టోర్నమెంట్ విజేతలు, కోచ్‌ను ఆహ్వానించబోతున్నాం. సీనియర్ పురుషుల జట్టుతో పాటు, 2025లో ట్రోఫీని గెలుచుకున్న సీనియర్ మహిళల జట్టు, అండర్ 19 బాలుర జట్టు, అండర్ 19 బాలికల జట్టు రానున్నాయి. 2025 ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ విన్నింగ్ టీమ్‌ను కూడా సన్మానించనున్నాం' అని సైకియా పేర్కొన్నారు..

## మహిళ



## సమాజం పాత్ర...

సమాజం తరచుగా ఈ సమస్యలను వ్యక్తిగత వైఫల్యాలుగా చూస్తుంది. బాధితురాలినే ప్రశ్నించే ధోరణి ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఈ దృక్పథం మారాల్సిన అవసరం ఉంది. అమ్మాయిలను తప్పుపట్టడం కాకుండా, వారిని రక్షించాల్సిన బాధ్యత సమాజంపై ఉంది. సామాజిక చైతన్య కార్యక్రమాలు, బహిరంగ చర్చలు, మీడియా ద్వారా బాధ్యతాయుత కథనాలు అవసరం. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు, అన్ని స్థాయిల్లోనూ ఈ అంశంపై ఓపెన్ డైలాగ్ జరగాలి. మౌనం సమస్యను పరిష్కరించదు. అది మరింత లోతుగా పాతుకుపోయేలా చేస్తుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను రక్షించాలనే ఉద్దేశంతో అధిక నియంత్రణకు పాల్పడటం సాధారణమే. కానీ కేవలం నిషేధాలు విధించడం వల్ల సమస్య పరిష్కారం కాదు. పిల్లలతో నమ్మకమైన సంబంధం నిర్మించడం అత్యంత కీలకం. అమ్మాయిలు తమ సందేహాలను, అనుభవాలను భయంలేకుండా తల్లిదండ్రులతో పంచుకునే వాతావరణం ఉండాలి. సోషల్ మీడియా వాడకం గురించి అవగాహన కల్పించడం, ఆన్‌లైన్ భద్రతపై చర్చించడం, నిజమైన ప్రేమకు, మోసపూరిత ఆకర్షణకు మధ్య తేడాను వివరించడం తల్లిదండ్రుల ప్రధాన పాత్ర. తల్లిదండ్రులు కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని అర్థం చేసుకుని, పిల్లల ప్రపంచాన్ని తెలుసుకోవాలి. కిశోర వయసులో స్నేహితుల ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. సహచరుల అంగీకారం కోసం అమ్మాయిలు కొన్ని సార్లు తమ అంతర్గత స్వరాన్ని పక్కన పెడతారు. ఈ సందర్భంలో పాజిటివ్ పీర్ కల్చర్‌ను ప్రోత్సహించడం అవసరం. స్నేహితులు ఒకరినొకరు రక్షించుకునే, హెచ్చరించే, సహాయపడే వాతావరణం ఉండాలి. పాఠశాలలు, కళాశాలలు కేవలం అకడమిక్ జ్ఞానాన్ని అందించే కేంద్రాలు మాత్రమే కావు. అవి వ్యక్తిత్వ వికాసానికి కీలకమైన వేదికలు. ఉపాధ్యాయులు అమ్మాయిల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనించే స్థితిలో ఉంటారు. భావోద్వేగ ఒత్తిడి, ఒంటరితనం, భయాలు వంటి సంకేతాలను గుర్తించి, సరైన మార్గదర్శకత్వం ఇవ్వగలరు. జీవన నైపుణ్యాలపై, సంబంధాలపై, డిజిటల్ లిటరసీపై విద్యా కార్యక్రమాలు అవసరం. విద్యా సంస్థల్లో కౌన్సెలింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా అనేక సమస్యలను ముందుగానే నివారించవచ్చు.

### భావోద్వేగాల తుఫాను

కిశోర వయస్సు అనేది శారీరక, మానసిక, భావోద్వేగ మార్పులతో నిండిన దశ. ఈ దశలో అమ్మాయిలు తమ గుర్తింపును అన్వేషిస్తారు, ఇతరుల అంగీకారాన్ని కోరుకుంటారు, ప్రేమ, ఆకర్షణ, స్నేహం వంటి భావాలను తొలిసారిగా లోతుగా అనుభవిస్తారు. ఇది సహజమైన ప్రక్రియే అయినప్పటికీ, సరైన మార్గదర్శకత్వం లేకపోతే ఈ భావాలే వారికి ప్రమాదంగా మారుతాయి. చిన్న ప్రశంస కూడా పెద్ద మోహంగా మారవచ్చు. కొద్దిపాటి శ్రద్ధ, తప్పుడు ప్రేమాభినయం, మాయమాటలు అమ్మాయిలను మోసపూరిత సంబంధాల్లోకి నెట్టే అవకాశం ఉంది. అవాంఛిత ఆకర్షణలు అంటే కేవలం ప్రేమాభిమానాలకే పరిమితం కావు. అవి భావోద్వేగ ఆధిపత్యం, మానసిక దోపిడీ, లైంగిక వేధింపులు, ఆర్థిక మోసాల వరకు విస్తరిస్తాయి. కొందరు వ్యక్తులు అమ్మాయిల బలహీనతలను గుర్తించి, వారి ఆత్మవిశ్వాస లోపాన్ని ఉపయోగించుకుని నెమ్మదిగా తమ ఆధీనంలోకి తీసుకుంటారు. మొదట స్నేహంగా ప్రారంభమై, ఆపై ప్రేమగా, తరువాత బెదిరింపుగా మారే ఈ ప్రయాణం చాలా మందికి తెలియకుండానే జరుగుతుంది. బాధితురాలు పరిస్థితిని గ్రహించేలోపే, ఆమె సామాజికంగా, మానసికంగా ఒంటరిగా మారిపోతుంది. పరువు లేదా భయం, సిగ్గు లేదా భవిష్యత్తు ఏమవుతుందోనన్న ఆందోళన... కారణం ఏదైతేనేం? అత్యధిక శాతం వేధింపుల కేసులు వెలుగు చూడకుండానే ముగుస్తున్నాయి. బయటపడుతున్న కేసులు కేసులు పది ఉంటే, బయటకురానివి అందుకు కనీసం రెండు లేదా మూడు రెట్లు ఉండవచ్చన్న వాదన బలంగా వినిపిస్తుంది.

# దీర్ఘకాలిక వ్యాధిగా పిసిఒఎస్!



పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పిసిఒఎస్)ను దీర్ఘకాలిక పరిస్థితిగా పరిగణించాలా అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ప్రస్తుతం లేదు. అయితే ప్రస్తుత నిర్వచనాల ప్రకారం చూస్తే, పిసిఒఎస్ అనేక సందర్భాల్లో దీర్ఘకాలిక వ్యాధి లక్షణాలకు సరిపోతుంది. అమెరికాలోని సెంటర్ ఫర్ డిసీజెస్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సిడిసి) ప్రకారం, ఒక పరిస్థితి ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలం కొనసాగుతూ, నిరంతర వైద్య సంరక్షణ అవసరం ఉండి, లేదా వ్యక్తి రోజువారీ కార్యకలాపాలను పరిమితం చేస్తే దానిని దీర్ఘకాలిక పరిస్థితిగా పరిగణించవచ్చు. కాగా, అసమాన మాసిక ధర్మం, అధిక ఆండ్రోజెన్ లక్షణాలు, బరువు పెరగడం, ఇన్సులిన్ రెసిస్టెన్స్, వంధ్యత్వ సమస్యలను పిసిఒఎస్ లక్షణాలుగా చెప్పుకోవచ్చు. చాలా సందర్భాల్లో సంవత్సరాల పాటు కొనసాగుతాయి. దీర్ఘకాల నిర్వహణ అవసరం అవుతుంది. ఈ కోణంలో చూస్తే, పిసిఒఎస్‌ను దీర్ఘకాలిక పరిస్థితిగా వర్గీకరించడం సమంజసం అనిపిస్తుంది. కొంతమంది మహిళలకు పిసిఒఎస్‌ను దీర్ఘకాలికంగా గుర్తించడం పెద్దగా ప్రాధాన్యం లేకపోవచ్చు. కానీ మరి కొందరికి ఇది వారి అనుభవానికి ఒక ధృవీకరణలా ఉంటుంది. ఎందుకంటే పిసిఒఎస్ కేవలం శారీరక సమస్య మాత్రమే కాదు... మానసిక, భావోద్వేగ, సామాజిక పరమైన ప్రభావాలు కూడా కలిగిస్తుంది. పరిశోధనలు చూపుతున్నట్లుగా, పిసిఒఎస్ ఉన్న మహిళలు ఆందోళన, డిప్రెషన్‌కు ఎక్కువగా గురయ్యే అవకాశముంది. దీర్ఘకాలిక బరువు నియంత్రణ ప్రయత్నాలు, వంధ్యత్వ చికిత్సలు, చర్మ సమస్యలు వంటి అంశాలు వారి జీవన నాణ్యతను ప్రభావితం చేస్తాయి. పిసిఒఎస్ నిర్వహణ సాధారణంగా దీర్ఘకాలికంగా ఉంటుంది. జీవనశైలి మార్పులు, ఆహార నియంత్రణ, వ్యాయామం, హార్మోనల్ మందులు, ఇన్సులిన్ సెన్సిటైజింగ్ ఔషధాలు, వంధ్యత్వ చికిత్సలు వంటి పద్ధతులు అనేక సంవత్సరాల పాటు కొనసాగవచ్చు. ఈ పరిస్థితి పూర్తిగా నయమవడం కంటే నిర్వహించడం ప్రధాన లక్ష్యం. ఈ లక్షణం దీర్ఘకాలిక వ్యాధుల సాధారణ లక్షణంతో సరిపోతుంది. అధికారికంగా ప్రతి సంస్థ పిసిఒఎస్‌ను దీర్ఘకాలిక వ్యాధిగా గుర్తించకపోయినా, దీని దీర్ఘకాలిక స్వభావం, నిరంతర నిర్వహణ అవసరం. జీవన నాణ్యతపై ప్రభావం దృష్ట్యా, అనేక సందర్భాల్లో దీనిని దీర్ఘకాలిక పరిస్థితిగా పరిగణించడం శాస్త్రీయంగా సమర్థించదగినదే. భవిష్యత్తులో నిర్వచనాలు విస్తరించే అవకాశముంది.

# రాష్ట్ర బడ్జెట్‌లో బిసిలకు రూ.50 వేల కోట్లు కేటాయించాలి

- బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు
- హన్మకొండ జిల్లాకలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా



**ప్రజాపక్షం/హనుమకొండ :** రాష్ట్ర శాసన సభలో ఈనెల 20వ తేదీన ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బిసిల సంక్షేమానికి అభివృద్ధికి రూ.50 వేల కోట్లు కేటాయించాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ 1930 నుండి నేటి వరకు కులగణనలో బిసి జనాభా లెక్క తేల్చందున బహుజనులు అన్ని రంగాల్లో అవకాశం కోల్పోయారని సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా సాంఘికంగా వెనుకకు నెట్టివేయబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్ అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎంపిటిసి జెడ్‌పిటిసి ఎన్నికలైనా 42 శాతం రిజర్వేషన్ నిర్ణయించిన తర్వాతనే జరపాలన్నారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో చేసిన వాగ్దానాలను అమలు జరపకుంటే బిసిల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం దేశ జనగణనలో కులగణన కచ్చితంగా జరిపి తీరాలని, జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని, కేంద్రంలో బిసి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చట్టసభలలో బిసిలకు 50% రిజర్వేషన్ కల్పించాలని, మహిళా రిజర్వేషన్లలో బిసి కోటా నిర్ణయించాలని లేనిచో దేశ వ్యాప్తంగా బిసి ఉద్యమాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం తరహా బిసి రక్షణ చట్టం తెచ్చి అమలు జరపాలని, రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టులన్నింటిలో బిసిలకు 50 శాతం కేటాయించి అభివృద్ధిలో బహుజనులను భాగస్వాములు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, బిసి హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కుంటి రాజేందర్, జిల్లా నాయకులు ప్రవీణ్ కుమార్, పొనుగోటి రామ్ గోపాల్ చారి, పూజారి అమృత, పూజారి నరేందర్ , సుతార్ అన్వేష్, సుతారి మహేష్, సుర పద్మ , కస్తూరి, రజిత, మడికొండ శిరీష, వైనాల సుమలత, తదితరులు పాల్గొన్నారు.



# అంగన్‌వాడీ రిటైర్డ్ టీచర్ల బెనిఫిట్స్ తక్షణమే విడుదల చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రాష్ట్రంలో ఏళ్ల తరబడి సేవలు అందించి పదవీ విరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో రంగారెడ్డి జిల్లాకు చెందిన అంగన్‌వాడీ రిటైర్డ్ టీచర్లు తమ సమస్యల పై కూనంనేని సాంబశివరావుకు వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీల ప్రధాన డిమాండలైన రిటైర్మెంట్ పారితోషికం గతంలో ప్రభుత్వం ప్రకటించిన విధంగా రిటైర్ అయిన టీచర్ల కు రూ. 2,00,000, ఆయాలకు రూ.100,000 తక్షణమే చెల్లించాలని, సుదీర్ఘ కాలం సేవలు అందించిన వీరికి గౌరవప్రదమైన నెలవారీ పెన్షన్ అందించాలని,గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు, బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని కోరుతూ అంగన్వాడి రిటైర్డ్ టీచర్లు న్యాయమైన డిమాండ్లను శాసన సభలో ప్రస్తావించి పరిష్కారం కోసం కృషి చేస్తానని కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశా రు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, ఓరుగంటి యాదయ్య,జిల్లా అధ్యక్షుడు కె. రా మస్వామి,జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు,బి కెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య, అంగన్‌వాడీ రిటైర్డ్ టీచర్స్ యూనియన్ నాయకురాలు ఏ. యామిని, జి. నాగమణి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిన సిలిండర్ ధరలు తక్షణమే ఉపసంహరించుకోవాలి

ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం పెరిగిన గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని కరీమాబాద్ ఎస్‌బిఐ కూడలి వద్ద ఎంసిపిఐ (యూ) కరీమాబాద్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సిలిండర్ ధర గృహ వినియోగదారులకు రూ.60, కమర్షియల్ వారికి రూ.115 పెంచడం జరిగింది. ఇప్పటికే పెరిగిన గ్యాస్ ధరల మూలంగా పేద ప్రజలు చిన్న చిన్న కొట్టు వ్యాపారస్తులు హోటల్ యజమానులు రోడ్డు మీద బండ్లల్లో ఇడ్లీ పూరీలు అమ్ముకునే చిన్న వ్యాపారస్తులు బతకలేని స్థితిలో పొట్టకూటి కోసం జీవనం కొనసాగిస్తూ ఉంటే మరోసారి గ్యాస్ ధరలు పెరగడం మూలంగా కొనలేని స్థితిలో ఇబ్బందులు ఎదురుకునే పరిస్థితి ఉందన్నారు. ఇక కట్టెలపోయే శరణ్యమని మహిళలు ఆవేదన చెందుతున్నారు. ఒక పక్కన ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాల మూలంగా బిజెపి ప్రభుత్వం శాంతిని నెలకొల్పే విధంగా ప్రయత్నం కొనసాగించకుండా దేశంలో నిత్యం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల సరుకుల ధరలను అదుపు చేయకుండా ఆదాని, అంబానీ కార్పొరేట్ శక్తుల సంపద పెరగడం కోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టే విధంగా మోడీ విధానాలు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికైనా పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని లేనిచో రాబోయే రోజులలో పెద్దయెత్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కరీమాబాద్ ఏరియా కార్యదర్శి ఐతం నగేష్, ఎగ్గని మల్లికార్జున్, మాలి సత్యనారాయణ, ఏఐఎఫ్‌డిఎస్ వరంగల్ జిల్లా కార్యదర్శి చుక్క ప్రశాంత్, హమాలీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కనీస వేతనం రూ.26 వేల కోసం పోరుబాట

తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కనీస వేత నం రూ.26,000 అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ పోరుబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పారిశుధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్‌వైజర్ విభాగాల కార్మికుల ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి. సురేష్ మాట్లాడుతూ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతన జిఒలను సవరించాల్సిన లేబర్ శాఖ 2012 నుండి ఇప్పటి వరకు సవరించి వేతనాలు పెంచాకుండా మొద్దు నిద్ర పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని ఫలితంగా కార్మిక వర్గం తీవ్రమైన ఆర్థిక నష్టానికి గురవుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వైద్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు లేబర్ శాఖ జిఒలు వర్తింపచేయకుండా పిఆర్‌సి జిఒ 60 అమలు చేశారని జిఒ 60 ఒకే శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్క్ కాంటాక్టు ఏజేన్సీల ఉద్యోగులకు సిబ్బందికి చెల్లిస్తున్న వేతనాలలో వారి వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. ఒకే శాఖ ఒకే జిఒ ఉన్నప్పటికీ కార్మికుల సంక్షేమం కోసం కాంట్రాక్టు ఏజెన్సీల దోపిడి కోసమా ఎవరి లబ్ధికోసం వ్యత్యాసాలుగా విభజించారో బహిరంగ ప్రకటన చేయాలన్నారు. మూడు సంవత్సరాలుగా కాంట్రాక్టు ఏజేన్సీలు కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. ఏజెన్సీల కాల పరిమితి ముగిసి 8 నెలలు దాటిపోతున్న ఇప్పటికి న్యూ టెండర్ పాలసీని ప్రకటించకుండా పాత ఏజేన్సీలకే గడువులు పెంచడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ వైద్యాన్ని విస్తరించాలని సంకల్పంతో రోజురోజు కు కొత్త వార్డులు పడకల సామర్థ్యం పెంపు విస్తరిస్తున్న పనిచేసే కార్మికుల సంఖ్య మాత్రం పెంచడం లేదని దీంతో కార్మికులపై అదనపు పనిభారం పడుతూ కార్మికుల తీవ్రమైన అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. కనుక కార్మికులకు కనీస వేతనం రూ.26000 అందే విధంగా తక్షణం చర్యలు చేపట్టాలని, ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్ న్యూ టెండర్ పాలసీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి బ్రాంచ్ ఎఐటియుసి మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షులు రంగన్న నాయకులు, కార్మికులు, బి.చెన్నయ్య, బాలకోటి, గోపాల్ నాయక్, భీమయ్య, అంజి, యాదయ్య, మన్యం, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి ఫూలేకు బిసి హక్కుల సాధన సమితి ఘన నివాళి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్త్రీల విద్యాభివృద్ధి, హక్కుల పోరాడిన తొలితరం మహిళా నేత సావిత్రిబాయి పూలే అని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి పురస్కరించుకుని మంగళవారం హైదరాబాదులోనిబిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ధనుంజయ నాయుడు మాట్లాడుతూ భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి పూలే భారతదేశంలో మనుధర్మ శాస్త్ర ప్రకారం చదువుకోలేని మహిళలకు చదువు చెప్పేందుకు ఆనాటి చాందసవాదులు ఎన్ని అవమానాలు తలపెట్టినా ఎన్ని కష్టనష్టాలు పెట్టినా, వాటిని భరించి మహిళా జాతి అభ్యున్నతికే తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలని కొనియడారు. మహిళలపై జరుగుతున్న అన్ని రకాల నిర్బంధాలు దౌర్జన్యాలు తొలగిపోవాలంటే చదువు ఉండాలని మహిళలు విద్యావంతురాలై విజ్ఞానవంతులై సమాజ అభివృద్ధికి తోడ్పాటు కావాలని అలాంటి ఆలోచన చేసి మన మహిళా జాతికి విముక్తిని, ఆలోచనను అందించినటువంటి సావిత్రిబాయి పూలే జీవితాన్ని ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్ ,వనపర్తి జిల్లా సిపిఐ కార్యదర్శి కె. విజయ రాములు, ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ఎం ప్రభాకర్ రెడ్డి, మంచిర్యాల జిల్లా సిపిఐ కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్ , శాంతిసంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెపిఎల్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొపొప్పొజు సూర్యనారాయణ, యల్లావుల రాములు, రచ్చ కిషన్ కాసోజు మహాలక్ష్మి నరసమ్మ పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తలకు కనీస వేతనం చెల్లించాలి



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్ :** ఆశా కార్యకర్తలకు రూ. 26 వేలు కనీస వేతనాలు చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షురాలు ఎ. చంద్రకళ డిమాండ్ చేశారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా బజారహత్నూర్ మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ దేశంలో అత్యంత తక్కువ వేతనంతో ఆశా కార్యకర్తలు శ్రమిస్తున్నారని, ప్రభుత్వం వారిని తక్షణమే ఆదుకోవాలని అన్నారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా కార్యకర్తలు కేక్ కట్ చేసి తినిపించుకున్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు కల్పన, ఉపాధ్యక్షురాలు కళా, కార్యదర్శి గంగమణి పాల్గొన్నారు.

## రుణాలు పొందిన వారు తిరిగి చెల్లించాలి



**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకున్న వారు తిరిగి బ్యాంకుకు అట్టి రుణాలను చెల్లించాలని కామారెడ్డి జిల్లా డిఆర్‌డిఎపిడి విజయలక్ష్మి సూచించారు. మంగళవారం నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామంలో బ్యాంకు లింకేజీ రుణాలు పొంది చెల్లించని మొండి బకాయిలు ఉన్న సంఘ సభ్యుల ఇంటింటికి వెళ్లి తీసుకున్న అప్పు చెల్లించాలని ఆదేశించారు. డ్వాక్రా ద్వారా తీసుకున్న రుణాలు మాఫీ కావని, తప్పనిసరిగా చెల్లించవలసిందేనన్నారు. ఖాతా రెగ్యులర్ చేయడం వలన తిరిగి మరింత రుణ సదుపాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. మార్చి 15వ తేదీ వరకు బకాయిలు అన్ని క్లియర్ చేసుకుని కొత్త రుణాలు పొందాలని కోరారు. గ్రామ సర్పంచ్ సుమిత్ర మాట్లాడుతూ బకాయిలు చెల్లించడం వలన ఇందిరమ్మ ఇండ్లకు రుణాలు పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి బ్యాంకు లింకేజీ డీపీఎం రాజయ్య, ఏపీఎం ప్రసన్నరాణి, సీసీలు సాయిలు, శ్రీను, గ్రామ పంచాయతీ కార్యదర్శి భారతి, కారోబార్ కృష్ణ, విఒ మాజీ అధ్యక్షురాలు సావిత్రి, లక్ష్మణ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

కౌటాల ఆసుపత్రిలో కలెక్టర్ కె. హరిత ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం / కౌటాల :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కౌటాల మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించగా, అక్కడ వైద్యాధికారి లేకపోవడాన్ని గమనించారు. డాక్టర్ పవన్ కల్యాణ్ రాజీనామా చేయడంతో ప్రస్తుతం వైద్యుడు అందుబాటులో లేరని సిబ్బంది వివరించారు. రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్, పలువురు సిబ్బంది విధులకు హాజరుకాకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డేటా ఎంట్రీ గది మూసి ఉండటం, కంప్యూటర్లపై దుమ్ము పేరుకుపోయి ఉండటంపై సిబ్బందిని మందలించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం జిల్లా పరిషత్ సెకండరీ హాస్టల్‌ను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల నేపథ్యంలో భయం వీడి ప్రశాంతంగా చదువుకోవాలని, వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం, వసతులపై ఆరా తీశారు. అనంతరం బిసి బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని వార్డెన్‌కు సూచించారు. పర్యటనలో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిని సందర్శించి నీటి లభ్యత, ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలాభివృద్ధి అధికారి ప్రసాద్, తహసీల్దార్ ప్రమోద్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**ప్రజాపక్షం/పాపన్నపేట :** ఆటో అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలై ఒకరు మృతి చెందిన సంఘటన పాపన్నపేట గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు పాపన్నపేట గ్రామానికి చెందిన ఆరే కటికే మోహన్ (53) ఏడుపాయల వద్ద మేకల కట్టింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఏడుపాయలకు వెళ్తున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఏడుపాయలకు వెళ్లి ఆటోలో ఇంటికి తిరిగి వస్తుండగా పాపన్నపేట శివారులోని రాగానే ఇతను ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది.దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మోహన్ కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## పట్టణ అభివృద్ధికి సహకరించాలి

మున్సిపల్ చైర్మన్ నాగమణి




**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** పట్టణ ప్రగతికి ప్రతిఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ నాగమణి అన్నారు. ఈస ందర్భంగా మంగళవారం నిర్వహించిన సాధారణ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని, పట్టణాన్ని కలిసికట్టుగా అభివృద్ధి చేద్దామన్నారు. పలు అంశాలను కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. ఎజెండా అంశాలను కౌన్సిలర్లకు చదివి వినిపించారు. వివిధ శాఖల అధికారులు వారి శాఖకు సంబంధించిన అంశాలను కౌన్సిల్ వారికి చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్ సంటి లత, కౌన్సిలర్లు పర్సకుశ లత, తోట సతీష్, గులన్నా బాలలక్ష్మి , బోదిరే లావణ్య, మహ్మద్ అంజుమ్ అలీ, సందీప్, నీలం రవి, సంగ్యానాయక్, మల్లెల అనుపమ, మేనేజర్ నరేందర్, డాక్టర్ అజయ్‌పవర్, మున్సిపల్ , ఎలక్ట్రికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




**ప్రజాపక్షం / సంగారెడ్డి :** మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే ఏ లక్ష్యాన్నైనా సాధించగలరని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళా శిశు ,వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జయప్రకాశ్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించగలరన్నారు. ఒకప్పటి కంటే ఇప్పుడు పబ్లిక్ సర్వీసుల్లో మహిళా ఉద్యోగులు, ప్రజాసేవలో మహిళా ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారని తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలు తమ ప్రత్యేకతను చాటుకుంటూ సమాజ అభివృద్ధికి తోడ్పడుతున్నారని పేర్కొన్నారు. మహిళలకు దూరదృష్టి ఎక్కువగా ఉంటుందని పనులను క్రమబద్ధంగా నిర్వహించే సామర్థ్యం మహిళలలో ఎక్కువగా ఉంటుందన్నారు. మహిళలకు ప్రోత్సాహం కల్పించి వారి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తే అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణించగలరన్నారు. ఇందిరా మహిళ శక్తి కార్యక్రమం ద్వారా మహిళలను అన్ని విధాల ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అన్ని కార్యక్రమాల్లో మహిళలను భాగస్వామ్యులను చేస్తున్నామని స్వయం సహాయక సంఘాల మహిళలందరికి పూర్తి ఆరోగ్య ప్రొఫైల్ రూపొందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపే మహిళలు తమ ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మహిళల ఉన్నతి సమాజాభివృద్ధి కి దోహదపడుతుందని తెలిపారు . టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మహిళలు ,పురుషులు సమానులని అన్నారు. పిల్లలకు మొదటి గురువు తల్లేనని ఆడ ,మగ అన్న తేడా లేకుండా పిల్లలను క్రమశిక్షణతో పెంచి మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిపైనే ఉంటుందని పేర్కొన్నారు. సమాజంలో మార్పు రావాలంటే ముందుగా మహిళల్లో మార్పు రావాలని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు మహిళల పేరిట అందుతున్నాయని తెలిపారు. మహిళలు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ కుమార్, డిడబ్ల్యుఒ లలిత కుమారి, డిఆర్‌డి జ్యోతి అధికారులు ,డిఎంఅండ్‌హెచ్‌ఒ, సిడిపిఒలు, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రణాళికను పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/దండేపల్లి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను పకడ్బందీగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన పారిశుద్ధ్య నిర్వహణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని, నర్సరీలలో మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ద్వారక గ్రామంలో ఎస్టీ వసతి గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, రెబ్బెనపల్లిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన నాణ్యతను, విద్యాబోధనను పరిశీలించారు. వార్షిక పరీక్షల దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పల్లె దవాఖానాలను సందర్శించి మందుల నిల్వలు అందుబాటులో ఉంచాలని, వేసవి దృష్ట్యా వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యులకు తెలిపారు. గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి అవసరమైన భూములను పరిశీలించి నివేదిక అందించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులకు భయపడేది లేదు

ఉద్యమాల ద్వారానే రాజకీయాల్లోకి వచ్చా

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్



**ప్రజాపక్షం / చెన్నూర్ :** వారసత్వ రాజకీయాల ద్వారా తాను రాలేదని, ఉద్యమాల ద్వారానే నాయకుడిగా ఎదిగానని మంచిర్యాల జిల్లా బిఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. అక్రమ కేసులకు తాను భయపడేది లేదని, న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు. గత ఎన్నికల సమయంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేసినందుకు నమోదైన కేసు విచారణలో భాగంగా మంగళవారం ఆయన చెన్నూర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టుకు హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్యాతనపల్లి మున్సిపాలిటీలో ప్రజలు బిఆర్‌ఎస్ పార్టీకి పట్టం కడితే, ఆ తీర్పును ఓర్వలేక మంత్రి వివేక్ అక్రమ దారిలో పదవులు పొందాలని చూస్తున్నారని విమర్శించారు. మంత్రి వివేక్ తనపై అక్రమ కేసులు బనాయించి, జైలుకు పంపి రాక్షసానందం పొందుతున్నారని మండిపడ్డారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం సాక్షిగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ఎన్నో కేసులు, జైలు జీవితం అనుభవించానని, తనకు జైలు కొత్తేమీ కాదని అన్నారు. ఎన్నికల హామీ మేరకు చెన్నూర్ నియోజకవర్గంలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి 45 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్ హయాంలో 200 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, దమ్ముంటే మంత్రి 300 కోట్లతో అభివృద్ధి చేసి చూపాలని సవాల్ విసిరారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పి వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అటెండర్ ఆత్మహత్యాయత్నం

డిఎఒ వేధింపులే కారణమని ఆరోపణ

**ప్రజాపక్షం / మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో విధులు నిర్వర్తించే అటెండర్ బొల్లి శ్రీనివాస్ మంగళవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. స్థానికులు, బాధితుడి కథనం ప్రకారం.. 2024 జూలైలో జిల్లా ప్రధాన కార్యాలయంలో అటెండర్‌గా చేరిన శ్రీనివాస్ గత 20 నెలలుగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా ఇన్ చార్జి డిఎఒ సురేఖ గత ఐదు నెలలుగా తనను మానసిక వేధింపులకు గురిచేస్తోందని, నిత్యం ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇబ్బందులు పెడుతోందని బాధితుడు ఆరోపించారు. మంగళవారం ఉదయం ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినందుకు తనను తీవ్రంగా తిట్టడంతో మనస్తాపం చెంది కార్యాలయంలోనే క్రిమిసంహారక మందు తాగినట్లు పేర్కొన్నారు. కార్యాలయ సమయం ముగిసినా రాత్రి 9 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నా, ఉద్దేశపూర్వకంగానే తనపై ఆగ్రహం వ్యక్తం చేసేవారని శ్రీనివాస్ వాపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. తన భర్త ఆత్మహత్యాయత్నానికి ఇన్ చార్జి డిఎఒ సురేఖ వేధింపులే కారణమని శ్రీనివాస్ భార్య శ్రీలక్ష్మి ఆరోపించారు. పనిచేతకాదని తిడుతూ, కుటుంబం ఉన్నదనే విచక్షణ లేకుండా రాత్రి వరకు పని చేయించుకునేవారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# నూతన ప్రజాప్రతినిధులకు శిక్షణ




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజా పాలనప్రగతిప్రణాళికలో అందరిని భాగస్వాములు చేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సూచించారు. ఈనెల 12న నూతనంగా ఎన్నికైనసర్పంచ్‌లు, మున్సిపల్ వార్డు సభ్యులు, చైర్మన్లు, మేయర్లకు నిర్వహించే శిక్షణా కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వంప్రతష్టాత్మకంగా అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యాచరణపై వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమంపై సిఎస్ రామకృష్ణారావు మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్, మున్సిపల్ పరిపాలన కార్యదర్శి టికె.శ్రీదేవి, సెర్ప్ సీఈఓ దివ్య, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ ఉప్పల్‌లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు గురవారం శిక్షణనిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని సిఎస్ దృష్టికి తెచ్చారు. నగర పాలక సంస్థ పరిధిలోని మేయర్ డిప్యూటీ మేయర్ కార్పోరేటర్లతో పాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల చైర్మన్లు, కౌన్సిలర్లకు జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో, గ్రామపంచాయతీల సర్పంచ్‌లకు మరో వేదికలో మాస్టర్‌ట్రేనర్లచే నిర్దేశిత అంశాలపై శిక్షణనిప్పిస్తామన్నారు. వారికి మెటీరియల్ గుర్తింపు కార్డులు అందించేలా చర్యలు తీసుకున్నామని, అందరి భాగస్వామ్యంతో జిల్లాలో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, సీపీఓ రతన్, మున్సిపల్ కమీషనర్లు జాదవ్ కృష్ణ, ఉమామహేశ్వర్,గంగాధర్ పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తా...

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



**ప్రజాపక్షం/రామాయంపేట:** వేసవికాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రతి గ్రామంలో బోర్లు వేయించడం జరుగుతుందని మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రజలకు హామీ ఇచ్చారు. మంగళవారం రామాయంపేట, నిజాంపేట మండలాలకు సంబంధించిన క్యాంపు కార్యాలయాన్ని రామాయంపేటలో ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బోర్లు వేయించి గ్రామానికి రెండు మోటార్లు తన స్వంత నిధులతో అందజేస్తానన్నారు. మెదక్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఇకపై రెండు మండలాల ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పర్సనల్ సెక్రటరి రంగరాజకిషన్‌ను కలిసి సమస్య వివరిస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రామాయంపేట పట్టణ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేయాలని నిదుల భరోసా నేను చూసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం శారద ఫంక్షన్‌హాల్లో జాతీయ రహదారిలో భూములు కోల్పోతున్న రైతుల పక్షాన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, కలెక్టర్ ప్రతిమా సింగ్, ఆర్డీవో రమాదేవిలతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించి భూ బాధితులకు సరైన నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అభివృద్ధి కావాలంటే కొంతమందికి అన్యాయం జరుగుతున్న మాట వాస్తవమేనని వారికి ప్రభుత్వంతో పాటు మేము కూడా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అంతకు ముందు మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేయగా హన్మంతరావు స్పందించి ఎన్ని నిధులైన ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు అంజనేయులు గౌడ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పోచమ్మ, నవనీత గణేష్, నాయకులు, మహిపాల్‌రెడ్డి, సరాపు యాదగిరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏసుగారి రమేష్‌రెడ్డి, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, గుగులోతు రవి, బైరం స్వప్నకుమార్, పుట్టి సందీప్, దేవుని రంజిత్, డాకి శ్యామల స్వామి, మండల పార్టీ అధ్యక్షుడు బండారి మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చింతల స్వామి, అమరసేనారెడ్డి, దేమె యాదగిరి, విప్లవ్‌కుమార్, కల్వకుంట చింతల స్వామి, రవీందర్ రెడ్డి, రంగరాజాకిషన్, వెంకటేష్‌గౌడ్‌తో పాటు ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కట్టడి పేరుతో బలవంతపు లేఖలా?

ఎంజెపి హాస్టల్ ఉపాధ్యాయుల నిర్వాకం




**ప్రజాపక్షం / చెన్నూర్ :** కట్టుబాట్ల పేరుతో మహాత్మా జ్యోతిబా పూలే (ఎంజెపి) ప్రభుత్వ హాస్టల్ ఉపాధ్యాయులు మంగళవారం చేసిన ఓ నిర్వాకం స్థానికంగా తీవ్ర విమర్శలకు దారితీసింది. హాస్టల్‌లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం సంభవించినా దానికి పూర్తి బాధ్యత తల్లిదండ్రులదేనంటూ ఉపాధ్యాయులు బలవంతంగా లేఖలు రాయించుకోవడం కలకలం రేపింది. కనీస వసతులు లేని, ప్రమాదకరంగా ఉన్న భవనంలో హాస్టల్ నిర్వహిస్తూ.. బాధ్యత నుంచి తప్పుకునేందుకు ఉపాధ్యాయులు తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చారని బాధితులు ఆరోపించారు. భవనం పక్కనే ప్రధాన రహదారి ఉందని, పిల్లలు ఆటలు ఆడుకోవడానికి లేదా బయటకు వెళ్లినప్పుడు ఏదైనా ప్రమాదం జరిగినా యాజమాన్యానికి సంబంధం లేదన్నట్లుగా లేఖలు ఇవ్వాలని కోరడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ హాస్టల్ ఎదుట తల్లిదండ్రులు ఆందోళన నిర్వహించడంతో ఉపాధ్యాయులు వెనక్కి తగ్గారు. ప్రభుత్వ హాస్టల్ నిర్వహణకు అనుకూలంగా లేని భవనంలో విద్యార్థులను ఉంచడం అధికారుల అలసత్వమేనని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా హాస్టల్‌ను సురక్షితమైన భవనంలోకి మార్చి విద్యార్థులకు రక్షణ కల్పించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

# పర్యాటకంలో అధికారుల 'నిద్ర'.. కబ్జాదారుల 'జాతర'!

కోటల సాక్షిగా కోట్లు స్వాహా..

కాగితాలకే పరిమితమైన అభివృద్ధి!

**ప్రజాపక్షం/నిర్మల్ :** చారిత్రక కట్టడాలకు,అద్భుతమైన శిల్పకళకు నిలయమైన నిర్మల్ జిల్లాలో పర్యాటక రంగం నేడు పడకేసింది. ఒకప్పుడు శత్రు దుర్భేద్యమైన కోటలతో విరాజిల్లిన ఈ గడ్డ, నేడు అధికారుల అసమర్థతకు, కబ్జాదారుల అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది.నిధులు మంజూరవుతున్నా, అభివృద్ధి మాత్రం 'అడుగు తీసి అడుగు వేయడం లేదు'.''వేసిన గొంగళి అక్కడే'' అన్న చందంగా పర్యాటక శాఖ తీరు ఉండటం గమనార్హం..

**అధికారుల ఉదాసీనత..ఏసీ గదులకే పరిమితమైన పాలన..!**

పర్యాటక అభివృద్ధి పేరుతో ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు విదిలిస్తున్నా అవి క్షేత్రస్థాయిలో పనులకు కాకుండా 'నీళ్ల పాలు' అవుతున్నాయి. శ్యాంగఢ్, బత్తీస్‌గఢ్ వంటి చారిత్రక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని గొప్పలు చెబుతున్న అధికారులు, పనుల పర్యవేక్షణలో మాత్రం ''నిమ్మకు నీరెత్తినట్లు'' వ్యవహిస్తున్నారు. పనులు ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా, కనీసం ఒక ఇటుక కూడా పడకపోవడం వెనుక ఉన్న మతలబు ఏమిటో అర్థం కావడం లేదు.అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితమై,క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో పట్టించుకోకపోవడం వల్లే నిర్మల్ పర్యాటకానికి ఈ గతి పట్టింది.





**కబ్జాదారుల కబంధ హస్తాల్లో చారిత్రక సంపద!**

పర్యాటక కేంద్రాల కోసం కేటాయించిన భూములు, పురాతన కోటల పరిసరాలు నేడు ప్రైవేట్ వ్యక్తుల 'అడ్డా'గా మారాయి. విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేసి,సెటిల్‌మెంట్లు చేస్తూ,అక్రమంగా ప్రైవేట్ వెంచర్లు వేస్తున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదు.అధికారుల పరోక్ష సహకారంతోనే ఈ అక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు బాహాటంగానే విమర్శిస్తున్నారు.చారిత్రక కట్టడాల ఆనవాళ్లు మాయమవతున్నా, పురావస్తు శాఖ గానీ,జిల్లా యంత్రాంగం గానీ స్పందించకపోవడం గమనార్హం.

**కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న పట్టణం..!**

పట్టణం వేగంగా విస్తరిస్తున్నా,ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే ఒక్క పార్కు కూడా అందుబాటులో లేదు.ప్రభుత్వం పార్కుల ఏర్పాటుకు స్థలం లేదని సాకులు చెబుతుంటే,మరోవైపు ఉన్న స్థలాలన్నీ కబ్జాదారుల పాలవుతున్నాయి. బహిరంగ ప్రదేశాలు లేకపోవడంతో చిన్న పిల్లలు ఇళ్లకే పరిమితమై,మొబైల్ ఫోన్లు , టీవీలకు బానిసలవుతున్నారు. ఇది వారి మానసిక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అధికారుల నిర్లక్ష్యం కేవలం పర్యాటకాన్ని మాత్రమే కాదు,తర్వాతి తరం భవిష్యత్తును కూడా దెబ్బతీస్తోంది.

**బహిరంగ ప్రశ్నలు..**

జవాబుదారీతనం ఎక్కడా?, పర్యాటక అభివృద్ధి కోసం విడుదలైన నిధుల లెక్కలేవి..? కబ్జాదారులకు అధికారులకు ఉన్న లోపాయికారి ఒప్పందం ఏమిటి..? శ్యాంగఢ్,బత్తీస్‌గఢ్ అభివృద్ధి ఎప్పటికి పూర్తవుతుంది?

**ఇప్పుడైనా మేల్కొంటారా?**

నిర్మల్ జిల్లా పర్యాటక రంగం పునర్జీవం పోసుకోవాలంటే అధికారుల్లో చలనం రావాలి.కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుని,చారిత్రక స్థలాలను రక్షించాలి.లేనిపక్షంలో చరిత్ర గతిలో నిర్మల్ తన ఉనికిని కోల్పోవడం ఖాయం.అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు తిరుగబడకముందే దిద్దుబాటు చర్యలు చేపట్టాలి.

# హుజురాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

అట్టహాసంగా మున్సిపల్ చైర్మన్ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం
దశాబ్దాల తరువాత హుజురాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం సంతోషకరం
మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

**ప్రజాపక్షం/హుజురాబాద్:** హుజురాబాద్ ప్రాంత ప్రజల మనోభావాలకు అనుగుణంగా ఈ ప్రాంత అభివృద్ధికి తామంతా కట్టుబడి ఉన్నామని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. మంగళవారం రోజున హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ సుహాసిని పదవీ బాధ్యతలు స్వీకరణ మహోత్సవ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితెల ప్రణవ్ హజరయ్యారు. ఈ సందర్భంగా హుజురాబాద్ అంబేద్కర్ చౌక్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మార్గ మధ్యలో మాజీ రాజ్యసభ సభ్యులు రాజేశ్వర్ రావు, జగ్జీవన్ రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వొడితెల ప్రణవ్ మాట్లాడుతూ కొన్నేళ్ల నుండి హుజురాబాద్ ప్రాంతంతో మంచి సంబంధాలు కలిగిన పొన్నం ప్రభాకర్ ఈ ప్రాంతానికి పెద్దన్న పాత్ర పోషించాలని ఎంపిగా ఉన్న సమయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారని అన్నారు. అటు హుస్నాబాద్ ఇటు హుజురాబాద్‌ను రెండు కళ్లతో చూస్తు అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుజురాబాద్ అభివృద్ధికి సియం రేవంత్ రెడ్డి సహకరిస్తామని తన మాటగా ప్రత్యేకంగా చెప్పారని అన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ప్రజల ఆకాంక్షలకు



అనుగుణంగా పని చేయాలని పిలుపునిచ్చారు. హుజురాబాద్ మున్సిపల్ అభివృద్ధి కోసం 300 కోట్ల ప్రతిపాదనలు ఇచ్చారని, ఎంపి సహకారంతో అభివృద్ధి చేస్తామని, మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం దోహదం చేస్తుందని అన్నారు. సియం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ఒక్కో హామీని నెరవేరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అహ్మద్ సయ్యద్, మున్సిపల్ అధికారులు, పలు వార్డుల కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా పాల్గొన్నారు.

## సావిత్రిబాయిపూలే వర్ధంతి వేడుకలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో చదువుల తల్లి సావిత్రి బాయి పూలే 129వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు ఎల్కపల్లి సురేష్ అధ్యక్షత వహించగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, సీనియర్ ఉపాధ్యాయురాలు శ్రీదేవి లు ముఖ్య అతిథిగా హాజరై సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతీయ సంఘ సంస్కర్త,ఉపాధ్యాయిని, రచయిత్రి,ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ పూలే భార్య అని, కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి, ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె, తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించిందని,కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారని, నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం పణంగా పెట్టి సమష్టిగా పోరాటం చేసిందని. ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి ని అని ఆయన అన్నారు. సమ్మక్క సారక్క, చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని, ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అనుప్, సాయి, జశ్వంత్, అభిషేక్, చైత్ర, సాయి శరణ్య, అమీనా, ప్రహర్షిని తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జిఒ ప్రకారం బిఎల్ఒ విధులను రద్దు చేయాలి



**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లాలోని అంగన్వాడీ టీచర్స్ కు గ్రామాలలో బూతు లెవెల్ ఆఫీసర్ బిఎల్ఓ విధుల నుండి ప్రభుత్వ జీవో ప్రకారం రద్దు చేయాలని మంగళవారం జిల్లా రెవిన్యూ డివిజన్ అధికారికి వినతిపత్రం అందజేశారు. దేశవ్యాప్తంగా అంగన్వాడీ టీచర్స్ ను కేంద్ర ప్రభుత్వం ఎన్నికల విధులకు మీనాయింపు ఇవ్వాలని గత సంవత్సరం మార్చి లో దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సర్కులర్ జారీ చేయడం జరిగినదని, ఈ సర్కులర్ ప్రకారం రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు అంగన్వాడీ టీచర్లను బిఎల్ఓ డ్యూటీ ల నుండి మినహాయింపు ఇవ్వాలని రికమండేషన్ చేస్తూ జిల్లా కలెక్టర్ కు సర్క్యులర్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సర్కులర్ ప్రకారం ఏ జిల్లా కలెక్టర్ కూడా అంగన్వాడీ టీచర్లకు మీనాయింపు ఇవ్వలేదని, వెంటనే ప్రభుత్వ జీవో ప్రకారం అంగన్వాడీ టీచర్లకు బిఎల్ఓ డ్యూటీలను వెంటనే రద్దు చేయాలని అలాగే బిఎల్ఓ డ్యూటీ చేసిన వారికి అంగన్వాడీ టీచర్లకు పారితోషకం ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ అసోసియేషన్ ఏఐటియుసి కరీంనగర్ జిల్లా గౌరవ అధ్యక్షులు సమ్మయ్య, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఏ.రజిత, డి.రజిత, జిల్లా నాయకులు, రాజా దేవి, విజయ, కవిత, ఫరీదా, బి.కవిత, అరుణ, సుమలత, రమాదేవి, సుమలత, రమ, అంజలి, మంగ, పాల్గొన్నారు.

## స్పెషల్ డ్రైవ్: 57 ఆటోల స్వాధీనం



**ప్రజాపక్షం/కరీంనగర్:** నగరంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. మంగళవారం స్థానిక బస్టాండ్ ఇన్ గేట్ వద్ద ట్రాఫిక్ పోలీసులు భారీ స్థాయిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహన తనిఖీలు చేపట్టారు. ఆటోలపై దృష్టి సారించిన పోలీసులు, సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం. టాప్ నంబర్లు ప్రదర్శించకపోవడం. వాహన ధ్రువ పత్రాలు (ఆర్‌సి, ఇన్‌సురెన్స్) లేనివి. నెంబర్ ప్లేట్లు సరిగ్గా లేని 57 ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల యజమానులకు, డ్రైవర్లకు మోటార్ వాహన చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. అనంతరం ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, అన్ని రకాల పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో రిజర్వు ఇన్స్పెక్టర్ కుమారస్వామి, ఎస్సై ప్రమోద్ రెడ్డితో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.

## బెల్ట్ షాపులు మూసే వరకూ ఉద్యమం



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గ్రామ గ్రామాల్లో నడుస్తున్న బెల్ట్ షాపులను తక్షణమే మూసివేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు తీవ్ర హెచ్చరిక చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో నర్సింగారావు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం నర్సింగరావు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా మండలాలలోని పలు గ్రామాలలో బెల్ట్ షాపులపై ప్రతిరోజు వందలాది ఫిర్యాదులు వస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాలలో బెల్ట్ షాపులు అర్ధరాత్రి వరకు మద్యం విక్రయించడం వల్ల యువత చెడు దోవ పడుతున్నారని, మహిళలు ఫిర్యాదులు చేయడం ద్వారా ఆవేదనకు గురవుతున్నానని తెలిపారు. ప్రతి గ్రామంలో సర్పంచ్‌లు, కార్యకర్తలను కలుపుకొని ముందుండి బెల్ట్ షాపులని మూసి వేసే విధంగా చూడాలని, పోలీస్, ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.నర్సింగరావు చేసిన వ్యాఖ్యలు మండలంలో హాట్ టాపిక్ గా మారింది, నర్సింగారావు చేసిన వ్యాఖ్యలు మహిళల్లో సంతోషాన్ని ఇచ్చే వార్త ఆయిన మండలంలో బెల్ట్ షాపులు నిజంగా మూతపడతాయా లేదా చూడాలి.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు,వైస్ చైర్మన్ ఎల్లాల వెంకటరెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు ,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోదాం వద్ద అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లా కేంద్రం కలెక్టర్ కార్యాలయం సమీపంలోనీ ఈవీఎం గోదాంను మంగళవారం జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా రాజకీయ పార్టీ ప్రతినిధిలతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం ల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదాం వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీసీ ఫుటేజ్ ల గదుల పనితీరు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ లక్ష్మి కిరణ్ ఆర్డీవో కె. మహేశ్వర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేనీ శ్రీనివాస్, బిజెపి పార్టీ ప్రతినిధి దేవిశెట్టి నవీన్ కుమార్, టిడిపి పార్టీ ప్రతినిధి ఎర్రవెళ్ళి రవీందర్ బీఎస్పీ పార్టీ ప్రతినిధి సిరిసిల్ల అంజయ్య ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## ఇవిఎం గోదాం వద్ద పటిష్ట భద్రత



**ప్రజాపక్షం/జగిత్యాల :** ఈవీఎం గోదాం వద్ద పటిష్ట భద్రత చేబడుతున్నట్లు జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో ఈవీలంలను భద్రపరిచిన గోదాంను కలెక్టర్ తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి నెల ఈవీఎం గోదాం తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. గోడౌన్‌లో యంత్రాల భద్రత, సీసీ కెమరాల పనితీరు, సాంకేతిక పరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరిగిందన్నారు. గోదాం వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమౌన భద్రత ఉండాలని, నిత్యం అప్రమత్తతతో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. అదనపు కలెక్టర్ బిఎస్ లత, ఆర్డీవో మధుసూదన్, కలెక్టరేట్ ఏవో హకీమ్, అర్బన్ తహసీల్దార్ రాంమోహన్ తదితరులు ఉన్నారు.

## విదేశీయులకు దేశ ప్రయోజనాలు తాకట్టు

ఎంపి గడ్డం వంశీకృష్ణ



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** భారతదేశ ప్రయోజనాలను విదేశీయులకు మొదటి ప్రభుత్వం తాకట్టు పెడుతుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ విమర్శించారు. మంగళవారం రోజున ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత కొన్ని నెలలుగా ప్రధాన మంత్రి మోదీ రాజీ పడినట్టుగా ప్రవర్తిస్తున్నారని ఆయన విమర్శించారు. అణు చట్ట సవరణల విషయాన్ని ప్రస్తావిస్తూ, అణు సరఫరాదారులపై ఉన్న బాధ్యతలను తొలగించడం దేశ ప్రయోజనాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. అణు ప్రమాదం లేదా నిర్వహణలో లోపం సంభవించినప్పుడు దేశాన్ని భారీ నష్టాల నుంచి రక్షించేందుకు ఆ బాధ్యతలు అత్యంత ముఖ్యమని తెలిపారు.కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించిన తాజా బడ్జెట్‌పై కూడా ఆయన నిరాశ వ్యక్తం చేశారు. ఆ బడ్జెట్ పూర్తిగా నిరాశ కలిగించే విధంగా ఉందని, అది అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సూచనలకు అనుగుణంగా రూపొందించినట్టుగా కనిపిస్తోందని అన్నారు. గత తొమ్మిదిన బడ్జెట్లలో ప్రకటించిన అనేక పథకాలు ఇప్పటికీ భూమిపై అమలు కాలేదని, అవి కేవలం కాగితాలపై మాటలుగానే మిగిలిపోయాయని విమర్శించారు.దేశ వ్యాప్తంగా బీజేపీ చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నాణ్యతపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. అనేక ప్రాజెక్టులు పూర్తయిన కొద్ది నెలల్లోనే దెబ్బతింటున్నాయని, అవి కార్డ్‌బోర్డ్ ముక్కల్లా కూలిపోతున్న పరిస్థితి కనిపిస్తోందని,ప్రస్తుత పరిస్థితుల్లో మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ప్రధాన మంత్రి మోదీ అమెరికా సూచనల మేరకు నిర్ణయాలు తీసుకుంటున్నట్టుగా కనిపిస్తోందని ఎంపీ వంశీకృష్ణ పేర్కొన్నారు. గత పార్లమెంట్ సమావేశంలో కూడా "భారత పార్లమెంట్ ఢిల్లీలో నడుస్తుందా, లేక వాషింగ్టన్ డీసీ సూచనలతో నడుస్తుందా?" అని తాను ప్రశ్నించినట్లు గుర్తు చేశారు. దేశం ఎదుర్కొంటున్న ఈ పరిస్థితులపై ప్రధాన మంత్రి ఇప్పటివరకు స్పష్టమైన అధికారిక ప్రకటన చేయకపోవడం బాధాకరమని అన్నారు. ఈ పరిస్థితికి ప్రధాన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు.అమెరికా "మేము అమెరికా ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకుంటాం, అవి భారతదేశానికి వ్యతిరేకంగా ఉన్నా కూడా" అని స్పష్టంగా చెబుతోందని ఆయన విమర్శించారు. ప్రధాన మంత్రి మోదీ దేశ ప్రయోజనాల కంటే విదేశీ ఒత్తిడికి లోనై నిర్ణయాలు తీసుకుంటున్నట్టుగా కనిపిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానం దేశంలోని సాధారణ ప్రజల ప్రయోజనాలకు అనుకూలంగా లేదని స్పష్టం చేశారు.

## ప్రజలకు చేరువలో ప్రభుత్వ కార్యాలయాలు

ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, కలెక్టర్ శ్రీ కోయ హర్ష




**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** నూతనంగా ప్రారంభించిన మండల రెవెన్యూ అధికారి కార్యాలయం ద్వారా మండల ప్రజలకు మెరుగైన సేవలు వేగవంతంగా అందాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కాల్వ శ్రీరాంపూర్ మండలంలో 75 లక్షల రూపాయల గ్రాంట్ నిధులతో నూతనంగా నిర్మించిన మండల రెవెన్యూ అధికారి కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ డి.వేణు లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ కాల్వ శ్రీరాంపూర్ మండలంలో ఎం.ఆర్.ఓ కార్యాలయ నిర్మాణం చాలా రోజులుగా పెండింగ్ లో ఉందని, 75 లక్షల రూపాయలతో అన్ని వసతులతో కూడిన నూతన తహసిల్దార్ కార్యాలయాన్ని నిర్మించుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. నూతన కార్యాలయం నుంచి ప్రజలకు మెరుగైన సేవలు అందాలని, వారి సమస్యలు సత్వరపు పరిష్కారం అయ్యే దిశగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు.రెవెన్యూ గ్రామాలను క్లస్టర్ గా విభజించి ప్రతి క్లస్టర్ కు గ్రామ పరిపాలన అధికారి నియమించామని తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులు క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత డిస్పోజ్ చేయాల్సి ఉంటుందని , ప్రతి దరఖాస్తు వీలైనంత త్వరగా పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందించే రెవెన్యూ శాఖకు మండలంలో మంచి కార్యాలయం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు.99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేస్తున్నట్లు తెలిపారు.పేద రైతులకు ఉన్న భూ హక్కుల సంరక్షణ కోసం భూ భారతి చట్టం ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ జగదీశ్వర్ రావు, ఎంపిడిఓ రామ్మోహన్ చారి,ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు కూల్చివేసిన అధికారులపై చర్యలు

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు న్యాలపట్ల రాజు

**ప్రజాపక్షం/కరీంనగర్:** 58వ డివిజన్ లోని బోయవాడకు చెందిన నిరుపేద అయిన లైన్ మంగ కు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్న సమయంలో ప్రహరీ గోడను ప్రజా ప్రతినిధుల అండ తో మునిసిపల్ అధికారులు కూల్చివేశారని ఇది దుర్మార్గమైన చర్య అని, బాధ్యులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు న్యాలపట్ల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కూల్చిన ప్రహరీ గోడను సిపిఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాలపట్ల రాజు మాట్లాడుతూ, నగరపాలక సంస్థ పరిధిలో నాయకులు మారారు తప్ప ప్రజల జీవన ప్రమాణాలు మారలేదని పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటే కూడా భరించలేని స్థితిలో ప్రజా ప్రతినిధులు ఉండడం సిగ్గుచేటన్నారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటున్న మహిళకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా డిఆర్ఎఫ్ సిబ్బంది వచ్చి గోడను అన్యాయంగా కూల్చివేశారని నగరంలో అధికారుల అవినీతికి అంతులేకుండా పోతుందని పేదవాడి కి ఒక న్యాయం, ఉన్నవాడికి ఒక న్యాయంగా అధికారులు వ్య వరిహరిస్తున్నారని అధికారుల తీరు చాలా దుర్మార్గంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటన వెనుక బిజెపి నేతలు హస్తము ఉన్నట్లు అనుమానాలున్నాయని గతంలో బిఆర్ఎస్ నాయకులు ఇలా చేస్తే నగరంలో ప్రజలు ఛీ కొట్టారని అది బిజెపి నాయకులు గుర్తు పెట్టుకోవాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించలేని నాయకులు పేదలపై దౌర్జన్యం చేస్తుంటే చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు. ఒక బడా వ్యాపారవేత కోసం ఓ కార్పొరేటర్ ఆ స్థలాన్ని అమ్మమని ఒత్తిడి చేయడంతో సదరు కుటుంబం అమ్మకుండా ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటుందనె నేపంతో గోడను కూల్చివేయడం దారుణమన్నారు. భూ యజమానికి వెంటనే కూల్చిన ప్రహరీ గోడ నిర్మించి ఇవ్వాలని లేని పక్షంలో ఆందోళన పేదల పక్షాన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, బాధితురాలు లైన్ మంగా, లైన్ మల్లేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## గీత కార్మికులకు మోకుల పంపిణీ

**ప్రజాపక్షం/చందుర్తి:** మండలం లోని నర్సింగాపూర్ , మూడపల్లి , అనంతపల్లి గ్రామాల గీత కార్మిక సహకార సంఘం సభ్యులకు మంగళవారం శిక్షణ ఇచ్చి మోకులు పంపిణీ చేసినట్టు జిల్లా గౌడ సంక్షేమ సంఘం కార్య నిర్వాహక సభ్యులు బైరగోని రమేష్ గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వం గీత కార్మికులు కు ఇచ్చిన హామీలను నెరవేర్చి , బకాయి పడిన ఎక్స్‌గ్రేషియో నిధులు విడుదల చేసి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ మరాఠి మల్లిక్ , ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ , ఎస్ఐ రవి,జిల్లా గౌడ సంక్షేమ సంఘం సలహాదారు సంపునూరి మల్లేశం గౌడ్ , ట్రైనర్స్ తోడేటి జితేందర్ గౌడ్ , కాటా రవీంధర్ గౌడ్ , గుర్రం శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## తుమ్మడిహెట్టి బ్యారేజ్ నిర్మాణానికి నిధులు కేటాయించాలి

మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**ప్రజాపక్షం/జగిత్యాల :** కేవలం ఒకే ఒక లిఫ్ట్‌తో ప్రాణహిత నదీ జలాలను ఎల్లంపెల్లి వరకు తరలించే అవకాశమున్న తుమ్మడి హెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి కావలిసిన నిధులను రానున్న బడ్జెట్‌లో ప్రాధాన్యతతో కేటాయించాలని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇంధిరా భవన్‌లో మంగళవారం జీవన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి సీఏం రాజశేఖర్ రెడ్డి ఉత్తర తెలంగాణ ప్రాంతానికి సాగు, త్రాగు నీటి సౌకర్యం మెరుగుపరచడంతో పాటు హైదరాబాద్ నగరానికి త్రాగునీటితో పాటు పారిశ్రామిక అవసరాల కోసం చేవెళ్ల వరకు నీరు సమకూర్చేవిధంగా ఎస్సారెస్పీ దిగువ నుండి వృథాగా పోతున్న గోదావరి నదీ జలాలను వినియోగంలోకి తీసుకవచ్చారన్నారు. ప్రాణహిత నదీ జలాలను ఎల్లంపెల్లి వరకు అక్కడి నుండి చెవెల్ల వరకు తరలించేందుకు గాను తుమ్మడి హెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజ్ నిర్మాణం చేపట్టాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ డ్రీమ్ ప్రాజెక్టు అని పేర్కొన్నారు. 2014లో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తుమ్మడి హెట్టి బ్యారేజ్ నిర్మాణ ప్రతిపాదన టెండర్ ధశలోనే ఆగిపోయిందన్నారు. మేడిగడ్డ ప్రాంతంలో దిగువన 100 మీటర్ల లెవల్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి ఎగువకు మూడు లిఫ్టుల ద్వారా నీటిని తరలించేలా కేసీఆర్ ప్రభుత్వం చర్యలు చేపట్టారన్నారు. 2023 అక్టోబర్‌లో ప్రాజెక్టులోని 7వ బ్లాక్ వద్ద పగుళ్లు వచ్చి కుంగిపోవడంతో కాళేశ్వరం ప్రాజెక్టు నుండి నీటి తరలింపు నిలిచిపోయిందన్నారు. అప్పటి నుండి కేవలం ఎల్లంపెల్లి ద్వారా ఎగువకు నీటిని తరలిస్తున్నారన్నారు. గత రెండు సంవత్సరాలుగా పకృతి సహకరిస్తుండడంతో ఏవిధమైన సమస్యలు ఉత్పన్నం కాలేదన్నారు. భవిష్యత్‌లో ప్రకృతి సహకరించని పక్షంలో ఉత్తర తెలంగాణ ఎగువ ప్రాంతం ఇబ్బందులు ఎదుర్కనే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనలను పరిగణలోకి తీసుకుని అగ్రిమెంట్ దక్కించుకున్న ఎల్అంట్టీ, నవయుగ కంపెనీలు నిబంధనల ప్రకారం మేడిగడ్డ పగుళ్లతో పాటు అన్నారం, సుందిల్ల బ్యారేజీలకు సంబంధించిన మరమ్మత్తులు చేపట్టాలన్నారు. 2026 27 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో ఇరిగేషన్ పద్దులో భాగంగా ప్రత్యేకంగా తుమ్మడి హెట్ వద్ద బ్యారేజ్ నిర్మాణ పనులకు రూ. 10 వేల కోట్లు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొత్త మోహన్, జున్ను రాజేందర్, సరళ, కల్లెపెల్లి దుర్గయ్య, చంద రాధాకిషన్ రావు, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, సతీష్, శ్రీరాముల గంగాధర్, శీలం సురేందర్, తొపారపు రజనీ కాంత్, ద్యావర శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

లీడింగ్ తెలుగు ఓటీటీ ప్లాట్ ఫామ్ ఆహా మరో సరికొత్త వెబ్ సిరీస్ 'పోచమ్మ'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. మిస్టికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సిరీస్ టైటిల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. 'మీ పాపాలకు ఒక సాక్షి ఉంటుంది..' అనే ట్యాగ్ లైన్‌తో రిలీజ్ చేసారు. 'పోచమ్మ' సిరీస్ టైటిల్ గ్లింప్స్ ఆసక్తి రేపుతోంది.

# రీల్

## 'జెట్లీ' షూటింగ్ పూర్తి

నటుడు సత్య, దర్శకుడు రితేష్ రానా 'జెట్లీ'తో అలరించబోతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్టైన్మెంట్ చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన స్పెషల్ వీడియోలో సత్య ఫన్ మూమెంట్స్ ఆకట్టుకున్నాయి.ఈ చిత్రంతో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా తెలుగులో పరిచయం కానుంది. మత్తు వదలరా వెనుక ఉన్న మెయిన్ టీం ఈ సినిమాకు పని చేస్తున్నారు. మ్యూజిక్ కాల భైరవ, సినిమాటోగ్రాఫర్ సురేష్ సారంగం, ఎడిటర్ కార్తీక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైనర్ నార్ని శ్రీనివాస్ తో కలిసి రితేష్ రానా మరోసారి యూనిక్ సినిమాటిక్ యూనివర్స్ క్రియేట్ చేశారు. సత్య, రియా సింహ, వెన్నెల కిషోర్, అజయ్ నటిస్తున్న ఈ చిత్రానికి కథ స్క్రీన్‌ప్లే: రితేష్ రానా జయేంద్ర ఎరోలా, డైలాగ్స్: రితేష్ రానా, యాక్షన్ కొరియోగ్రఫీ: వింగ్ చున్ అంజి అందిస్తున్నారు.



## సమ్మర్‌లో 'దీవాన' రిలీజ్




శుభం సినిమాతో మంచివిజయాన్ని అందుకున్న నటుడు హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'దీవాన'. ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్‌పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కా ర్యంపూడి నిర్మిస్తున్నారు. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి రూపొందిస్తున్నారు. 'దీవాన' సినిమాను ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ గీతా ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సమ్మర్ లో 'దీవాన' థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. 'దీవాన' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ నుంచే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇ టీవల వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ చేసిన ఈ సినిమా స్టోరీ పోస్టర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రానికి కాస్ట్యూమ్స్ మానస, ప్రొడక్షన్ డిజైనర్ ఝూన్సీ గోజల, ఎడిటర్ హృషికేశ్ పా స్పల్, డీవోపీ వంశీ పచ్చిపులుసు, మ్యూజిక్ ఈశ్వర్ చంద్, డిజిటల్ మార్కెటింగ్ హౌస్ ఫుల్.

## సత్యవతిగా రీతు వర్మ



గోపీచంద్ హీరోగా దర్శకుడు సంకల్ప్ రెడ్డి కలసి శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి భారీ స్థాయిలో నిర్మిస్తున్న హిస్టారికల్ మూవీ గోపీచంద్33 తో రాబోతున్నారు. పవన్ కుమార్ ప్రెజెంట్స్ చేస్తున్న ఈ చిత్రం గోపీచంద్ కెరీర్లోనే అత్యంత భారీ చిత్రాలలో ఒకటిగా రూపొందుతోంది.ఈ చిత్రంలో రీతు వర్మ, టి గోపిచంద్ సరసన కథానాయికగా నటిస్తున్నట్లు ప్రకటించారు. ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆమె పాత్ర సత్యవతిని ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా పరిచయం చే శారు. పోసన్‌లో రీతూ వర్మ అద్భుతమైన గ్రేస్‌తో పాటు ఫియర్స్, కమాండింగ్ లుక్‌లో కనిపిస్తున్నారు. విల్లు ఎక్కుపెట్టి ఏకాగ్రతతో కనిపిస్తూ, ఒక యోధురాలిలా ధైర్యం, సంకల్పాన్ని ప్రతిబింబిస్తున్నారు. పీరియడ్ స్టైల్ దుస్తులు, సంప్రదాయ ఆభరణాలు, యుద్ధానికి సిద్ధంగా ఉన్న లుక్ ఆమె పాత్రలోని పవర్ ని స్పష్టంగా చూపిస్తున్నాయి.ఈ సినిమాలో రీతూ వర్మ పూర్తిగా కొత్త తరహా పాత్రలో కనిపించనున్నారు. 7వ శతాబ్దంలో పర్వత ప్రాంతాల్లో నివసించే ఒక గిరిజన తెగకు చెందిన మహిళగా ఆమె పాత్ర ఉంటుంది. ఆ తెగ సంస్కృతి, ధైర్యం, సహనాన్ని ప్రతిబింబించేలా సత్యవతి పాత్ర రూపుదిద్దుకుంది. తన నటన ద్వారా రీతూ వర్మ ఆ పాత్రకు సహజత్వం, భావోద్వేగాలను తీసుకురానున్నారు. సౌందర్ రాజన్ సినిమాటోగ్రాఫర్, అనుదీప్ దేవ్ సంగీత అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. అదే సమయంలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నాయి.


## 'ఉస్తాద్ భగత్ సింగ్'కు యు/ఎ సర్టిఫికెట్



పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న సినిమా ఉస్తాద్ భగత్ సింగ్ సెన్సార్ పనులు పూర్తయాయ్యి. శ్రీలీల, రాశి ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు హరీష్ శంకర్ దర్శకుడు. ఈనెల 19వ తేదీన విడుదల కానున్న ఈ సినిమాకు సెన్సార్ బోర్డు యు/ఎ సర్టిఫికెట్ ఇచ్చింది. 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా నుంచి ఇటీవల విడుదలైన గ్లింప్స్ అభిమానుల్లో భారీ ఉత్సాహాన్ని రేపుతోంది. ఈ గ్లింప్స్ విడుదలైన క్షణం నుంచే సామాజిక మాధ్యమాల్లో అద్భుతమైన స్పందన లభిస్తోంది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ స్క్రీన్ ప్రెజెన్స్, ప్రభావవంతమైన డైలాగులు,శక్తివంతమైన బాడీ లాంగ్వేజ్ అభిమానులు, ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ఈ చిన్న గ్లింప్స్ ఇప్పుడు సినీ ప్రియుల్లో చర్చనీయాంశంగా మారింది.గ్లింప్స్కు వస్తున్న అద్భుతమైన స్పందనపై చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తోంది.దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి పాటలను స్వరపరచగా, ఎస్. తమన్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు. దేవి శ్రీ ప్రసాద్ అందించిన పాటలు ప్రేక్షకులను డ్యాన్స్ చేయిస్తే, తమన్ తన నేపథ్య సంగీతంతో సినిమాని మరో స్థాయికి తీసుకెళ్ళనున్నారు. 'గబ్బర్ సింగ్' తరువాత పవన్ కళ్యాణ్, హరీశ్ శంకర్ కలయికలో వస్తున్న సినిమా కావడంతో 'ఉస్తాద్ భగత్ సింగ్'పై అంచనాలు భారీస్థాయిలో ఉన్నాయి. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి విడుదలైన ప్రతి కంటెంట్కు అద్భుతమైన స్పందన లభించింది. ఈ చిత్రాన్ని చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవి శంకర్ యలమంచిలి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

## వంశీ కొత్త సినిమా 'ఇంకా ఏం అనుకోలేదు'



నందిపాటి, మరోసారి ఈటీవీ విన్‌తో కలిసి ఇంకా ఎం అనుకోలేదు అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇంకా ఎం అనుకోలేదు చిత్రానికి రచయితదర్శకుల జోడీ ప్రణయ్ వల్లూరిపల్లి, గిరి పెమ్మసాని దర్శకత్వం వహిస్తున్నారు. సంగీతాన్ని సింజిత్ ఎర్రమిల్లి అందిస్తుండగా, సినిమాటోగ్రఫీని రేహాన్ షేక్ నిర్వహిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను మంగళవారం విడుదల చేశారు. సాధారణ ప్రమోషన్ విధానాన్ని కాకుండా, వినూత్నంగా మీమ్స్‌తో నిండిన సరదా వీడియో ద్వారా టైటిల్ను ప్రకటించారు. ఇందులో వ్యంగ్యంతో పాటు పాత ఈటీవీ థీమ్ను గుర్తుచేసే అంశాలు, హాస్యభరితమైన శైలి కనిపించాయి.వీడియోలో వివిధ మీమ్ రిఫరెన్స్‌ల, చమత్కారమైన పంచ్‌ల వినోదాన్ని పెంచాయి. ఇంట ర్నెట్ స్టైల్ కామెడీతో రూపొందిన ఈ క్లిప్ ప్రారంభం నుంచి చివరి వరకు ఆసక్తిని కలిగిస్తుంది.వంశీ నందిపాటి నిర్మిస్తున్న ఈ కామెడీ చిత్రానికి రమణా రెడ్డి, సమీర్ కన్ను సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది.

## గద్దర్ అవార్డులన్నీ అర్హులకే దక్కాయి ఆర్. నారాయణ మూర్తి




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక గద్దర్ అవార్డ్స్ లో ఈటీవి విన్ సత్తా చాటింది. ఈటివి విన్ తో కలసి నిర్మించిన చిత్రాలు ఏడు విభాగాల్లో అవార్డులు సొంతం చేసుకున్నాయి. బెస్ట్ ఫిలిం రాజు వెడ్స్ రాంబాయ్, బెస్ట్ చిల్డ్రన్స్ ఫిల్మ్ అనగనగా, సెకండ్ బెస్ట్ షార్ట్ ఫిల్మ్ మౌనమే నీ భాష, బెస్ట్ డైరెక్టర్ సాయిలు కంపాటి( రాజు వెడ్స్ రాంబాయి), బెస్ట్ డెబ్యూ ఫీచర్ ఫిల్మ్ డైరెక్టర్ సాయి మార్తాండ్ (లిటిల్ హార్ట్స్) బెస్ట్ మేల్ యాక్టర్ చైతు జొన్నలగడ్డ (రాజు రాంబాయి) ఉత్తమ నేపథ్య గాయకుడు అనురాగ్ కులకర్ణి (రాజు రాంబాయి)కు అవార్డులు దక్కాయి. ఈ సందర్భం ఈటివి విన్ నిర్మాతలు విజేతలతో కలసి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీపుల్ స్టార్ ఆర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ పెద్దలు తమ్మారెడ్డి భరద్వాజకి, అలాగే రాజు వెడ్స్ రాంబాయి చిత్రాన్ని నన్ను చూడమని ఆహ్వానించిన వేణు ఉడుగుకి ధన్యవాదాలు. ఉత్తమ నటులు ఉత్తమ గాయకులు ఉత్తమ దర్శకులు అందరూ కూడా యువత. యువతదే రాజ్యం అని నిరూపించిన సందర్భం ఇది. యువతరానికి నా సెల్యూట్. వీళ్ళని గుర్తించి గౌరవించిన జ్యూరీకి సెల్యూట్. ఈ సంవత్సరం అవార్డులన్నీ నిజంగా అర్హులకే ఇచ్చారనిపించింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఒకప్పుడు నంది అవారడ్స్ అంటే ఒక గౌరవం. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత గద్దర్ పేరుతో అవారడ్స్ పెట్టి సినిమా పరిశ్రమకు అవార్డులు ఇచ్చి ఒక ఉనికిని గుర్తింపుని మళ్లీ తీసుకొచ్చారు. గద్దర్ పేరు పెట్టడం అనేది నిజంగా సెల్యూట్. గద్దర్ ప్రజా కవి తెలంగాణ గడ్డమీద ప్రతి ఇంట్లో ఒక గద్దర్ ఉంటాడు. అసలు చిన్న సినిమాలు ఆగిపోయిన తరుణంలో ఈటీవీ విన్ అద్భుతం చేస్తుంది. కొత్తగా ఇండస్ట్రీకి వచ్చిన అందరికి కూడా ఒక కొత్త ధైర్యాన్ని ఇచ్చారు. ఈ సంవత్సరం గద్దర్ అవారడ్స్ చూస్తుంటే చాలా ఆనందంగా వుంది. జ్యూరీ కి హ్యాట్సాఫ్ చెప్పాలి. చాలా మంచి చిత్రాలకు అవార్డులు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి అభినందనలు. విజేతలకు, ఇలాంటి మంచి సినిమాలు తీస్తున్న అందరికీ అభినందనలు అని తెలిపారు. ఈటీవీ బిజినెస్ హెడ్ సాయి కృష్ణ, కంటెంట్ హెడ్ నితిన్, రాజు వెడ్స్ రాంబాయి నిర్మాత వేణు ఉడుగుల, దర్శకుడు సాయిలు కంపాటి, అనురాగ్ కులకర్ణి,సురేష్ బొబ్బిలి, ప్రొడ్యూసర్ రాహుల్, డైరెక్టర్ సాయి మార్తాండ్, ఆదిత్య హాసన్, డైరెక్టర్ సన్నీ, నిర్మాత రాకేష్, వర ముళ్ళపూడి ఈ ప్రెస్ మీట్ లో పాల్గొన్నారు.

## 13న 'డార్క్ నైట్' విడుదల



పూర్ణ ప్రదాన పాత్రలో రూపొందిన ఎ మోషనల్ థ్రిల్లర్ చిత్రం డార్క్ నైట్. మార్చ్13న థియేటర్లలో రిలీజ్ కాబోతుంది. జి. ఆర్. ఆదిత్య ఈ చిత్రానికి కథ రాసి దర్శకత్వం వహించారు. పూర్ణ ఇందులో హేమ పాత్రలో నటించి కథకు కీలకంగా నిలిచే పాత్రను పోషించారు. ఆమెతో పాటు త్రిగుణ్ (ఆదిత్ అరుణ్) రోషన్‌గా, విధార్థ్, సుభాశ్రీ రాయగురు సోఫియా పాత్రలో నటించారు. ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు ఆథిత్యా, సంగీత దర్శకుడు మిస్కిన్ మ్యూజిక్ అందించిన ఈ చిత్రాన్ని పట్లోళ్ల వెంకట్ రెడ్డి సమర్పణలో పి19 స్టూడియోస్ పతాకంపై సురేష్ రెడ్డి కొవ్వూరి నిర్మించారు. డార్క్ నైట్ నాలుగు ప్రధాన పాత్రల జీవితాల చుట్టూ తిరుగుతుంది. వారి మధ్య ఉన్న సంక్లిష్ట భావోద్వేగాలు, రహస్యాలు, సంఘర్షణలు కథను ఉత్కంఠ భరితంగా మలుస్తాయి. కథ ముందుకు సాగుతున్న కొద్దీ ప్రేక్షకులు భావోద్వేగాలతో నిండిన ప్రయాణాన్ని అనుభవిస్తారు. ఈ చిత్రంలో అతీంద్రియ అంశాలతో కూడిన ఒక ఊహించని ట్విస్ట్ కథను కొత్త మలుపు తిప్పుతూ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుందని నిర్మాత సురేష్ అన్నారు. ఈ చిత్రానికి దర్శకుడు : ఆథిత్యా, సహా నిర్మాతలు : శ్రీనివాస్ మేదరమెట్ల, జె. కొండల రావు, డైరెక్టర్ అఫ్ ఫోటోగ్రఫీ : కార్తీక్ ముత్తు కుమార్,ఎడిటర్ : ఇళయరాజా ఎస్.



## సూర్యాపేటకు ధర్మభిక్షం పేరు పెటాలి

### జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి: తెలంగాణ రాష్ట్ర గీత పని వారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సూర్యాపేట జిల్లాకు ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, సూర్యాపేట తొలి శాసన సభ్యులు, మాజి ఎంపి బొమ్మగాని ధర్మభిక్షం పేరు పెట్టాలని, ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర గీత పని వారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పైన బొమ్మగాని ధర్మభిక్షం కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని బొమ్మగాని ప్రభాకర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిలు గౌడ్, సమన్వయ కార్యదర్శి బి.నాగభూషణం, కెవిఎల్ తదితరుల బృందం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంను కలిసి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. గీత కార్మికులకు చెల్లించాల్సిన రూ. 13 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలను చెల్లించాలని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అన్ని స్థాయిలో అమలు చేసే విధంగా చూడాలని వారు కోరారు.

## అవయవ దానాలను ప్రోత్సహించేందుకు విధివిధానాలు సరళీకృతం



### మంత్రి దామోదర రాజనర్సింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అవయవ దానాలను ప్రోత్సహించేందుకు విధివిధానాలను సరళీకృతం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. అవయవ మార్పిడి చికిత్సలో తెలంగాణ రాష్ట్రం దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచే విధంగా కార్యాచరణను రూపొందించాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులలో అవయవ మార్పిడి చికిత్సల ధరలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యులకు కూడా అవయవ మార్పిడి చికిత్సకు అయ్యే ఖర్చును భరించే విధంగా ధరల నియంత్రణ ఉండాలని ప్రైవేట్ యాజమాన్యాల కు సూచించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో 'ట్రాన్స్ ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ యాక్ట్' పాలసీ రూపకల్పనపైన, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ అమలు తీరు పైన ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో మంత్రి దామోదర రాజనర్సింహ మంగళశారం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆర్గాన్ డొనేషన్స్ యాక్ట్ సమర్థవంతంగా అమలు జరిగేందుకు అవసరమైన సమగ్ర పాలసీ రూపకల్పన అంశంపైన చర్చించారు.రాష్ట్రంలో అన్ని ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స లకు అయ్యే టారిఫ్ పై నియంత్రణ ఉండేలా కార్యాచరణ కు శ్రీకారం చుట్టామన్నారు. ఈ విషయంలో మంత్రి సూచనలపైన ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు సానుకూలంగా స్పందించాయి. దాతలు ఇచ్చిన అవయవాలు వృధా కాకుండా ఆస్పత్రులు ప్రత్యేక చర్యలను తీసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. ఇతర దేశాల నుండి ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్ కోసం వచ్చే రోగుల కోసం నూతన విధివిధానాలను రూపొందించాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ అవయవ మార్పిడి చికిత్సలకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని, రాష్ట్రంలో చెయ్యి మార్పిడి చికిత్సకు నాలుగు ఆసుపత్రులకు అనుమతులు ఇచ్చినట్టు వివరించారు. రాష్ట్రంలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ అమలుపై మంత్రి ప్రవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చించారు. ఈ చట్టాన్ని రాష్ట్రంలో సమర్థవంతంగా అమలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అధికారుల మంత్రి ఆదేశించారు.ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరేంద్ర కుమార్, జీవన్ దాన్ డైరెక్టర్ డాక్టర్ భూషణ్ రాజ్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## వేం.నరేందర్ రెడ్డిని కలిసిన కూనంనేని



సిఎం ప్రభుత్వ మాజీ సలహాదారులు వేం.నరేందర్ రెడ్డి రాజ్యసభకు ఎన్నికైన సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివ రావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కఠిన నిబంధనలు సడలింపు

(మొదటి పేజీ తరువాయి)

అనుమతించాలని కొత్త విధానంతో నిబంధనలు సడలించినట్టు భావించాలి. భారత్‌లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెట్టే దేశాల జాబితాలో చైనా 23వ స్థానంలో ఉంది. కేవవలం 0.32 శాతం ఎఫ్‌డిఐ వాటా మాత్రమే భారత్‌లో చైనాకు ఉంది. ఇప్పుడు బంగ్లాదేశ్, నేపాల్‌లలో కొత్త ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కొలువుదీరాయి. మయన్మార్‌లో కూడా జుంటా సైనికులు ఏకపక్షంగా నిర్వహించిన ఎన్నికల ద్వారా పాక్షిక ప్రజాస్వామ్య ప్రభుత్వం కొలువుదీరింది. ఈ పరిస్థితుల్లో సంబంధాల వృద్ధికి ఈ నిబంధనల సడలింపు ఎంతో ప్రయోజనాత్మకంగా ఉంటుందని కేంద్రం భావిస్తున్నది. అన్నింటికంటే ముఖ్యం గా చైనాతో ఇప్పుడిప్పుడే సంబంధాలు మెరుగుపడుతున్నాయి. 2024–25 లో భారత్ నుండి చైనాకు 14.5 బిలియన్ డాలర్లు విలువైన ఎగుమతులు జరిగా యి. ఆ దేశం నుండి అంతకుముందు సంవత్సరంలో 16.66 బిలియన్ డాలర్ల దిగుమతులు జరిగాయి.

**మరో రెండేళ్ళు జల్ జీవన్ మిషన్**
**రూ.8.70 లక్షలకోట్లకు కేటాయింపు పెంపు**

గ్రామీణ భారతదేశంలో ప్రజలకు పంపుల ద్వారా మంచినీటి సరఫరాకు సంబంధించిన జల్ జీవన్ మిషన్ (జెజెఎం)ను 2028 డిసెంబరు వరకూ పొడిగిస్తూ మంత్రివర్గం తీర్మానం చేసింది. జల్ జీవన్ ప్రణాళికకు పెట్టుబడులను రూ.8.70 లక్షల కోట్లుకు పెంచామని మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2019లో ఈ ప్రాజెక్టును ఆవిష్కరించారు. ఈ పథకంలో కేంద్ర ం వాటా రూ.3.59 లక్షల కోట్లుగా ఉంది. తొలుత ప్రాజెక్టులో ఈ వాటాను రూ.2.08 లక్షల కోట్లుగా ఆమోదించారు. సుజల భారత్ పేరుతో దేశం అంతటా ఒకే డిజిటల్ ఫ్రేమ్ వర్కును ఏర్పాటు చేస్తారు. ప్రతి గ్రామానికి సుజల్ గోయన్ లేదా సర్వీస్ ఏరియా ఐడి ఇస్తారు. కాగా పశ్చిమ బెంగాల్‌ను జార్ఖండ్‌ను అనుసంధానిస్తూ రెండు మల్టీ–ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. ఈ ప్రాజెక్టులకు రూ.4,474 కోట్లు ఖర్చు అవుతుంది. సైంథియా–పాకూర్, సత్రగచ్చి–ఖరగ్‌పూర్ మధ్య ఈ మల్టీ ట్రాకింగ్‌లను నిర్మిస్తారు. ఇది ఈ మార్గాలలో నాలుగో రైల్వే లైను. అదేవిధంగా 5,652 గ్రామాలకు రైల్వే అనుసంధానం లభిస్తుంది. ఈ నిర్మాణం వల్ల తూర్పు రైల్వే వ్యవస్థలో రవాణా అనుసంధానం పెరుగుతుందని, దేశ ఆర్థిక సామర్థ్యాన్ని ఈ ప్రాజెక్టులు ఉద్దీపనం చేస్తాయని ఎక్స్ వేదికగా మోదీ పోస్టింగ్ పెట్టారు. సరుకు రవాణా కార్యకలాపాలు శరవేగంగా పెరుగుతాయని, మంచి స్థిరత్వం ఈ ప్రాంతానికి చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణం వల్ల పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాలలో ఐదు జిల్లాలకు ప్రయోజనం కలుగుతుంది. కొత్తగా మరో 192 కి.మీ రైల్వేమార్గం దేశంలో అందుబాటులోకి వస్తుంది. దీనివల్ల పర్యాటక రంగానికి కూడా కొత్త ప్రోత్సాహం కలుగుతుంది. ప్రజల రవాణా అవసరాలు తీరతాయి. కాగా, దివాళా చట్టం, కంపెనీ లా లకు సవరణలు చేసేందుకు వీలుగా కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. వీటికి సంబంధించిన ప్రత్యేక వివరాలు వెంటనే అందుబాటులోకి రాలేదు. దివాళా చట్టానికి సంబంధించిన 2013 నాటి కంపెనీ లాలో అనేక సవరణలకు ఈ తీర్మానం ద్వారా వీలు కల్పించింది. గత ఏడాది ఆగస్టులో సంబంధిత మంత్రిత్వశాఖ లోక్‌సభలో ఐబిసి (ఇన్‌సాల్వెన్సీ–బాంక్రప్టసీ కోడ్)కి సవరణ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అందుబాటులోకి వస్తుంది. ఈ బిల్లును సెలక్ట్ కమిటీ పరిశీలనకు పం పారు. గత ఏడాది డిసెంబరులో లోక్‌సభ సెలక్ట్ కమిటీ తన నివేదికను సమర్పించింది. గతనెలలో మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ ఐబిసి బిల్లును బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెడతామని చెప్పారు.

## శాశ్వత భవనాలు

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయాలు కలిపి నిర్మించే అవకాశాలు పరిశీలించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యం పై దృష్టి పెట్టాలని సూచించారు. చిన్నారుల మెదడు బలంగా ఎదిగేందుకు అవసరమైన పౌష్టిక ఆహారంతో పాటు బోధనా పద్ధతుల తో వారికి తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. క్యూర్, ప్యూర్ రేర్ పాలసీకి అనుగుణంగా వచ్చే పరిశ్రమలను దృష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సులు ప్రవేశపెట్టాలి, స్కిల్ యూనివర్సిటీతో అనుసంధానం చేసుకోవాలని సమంత అధికారులను ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక మైనింగ్ ట్రైబల్ ఏజెన్సీల ద్వారా మాత్రమే జరగాలని ఈ క్రమంలో ఏజెన్సీలకు ఐటీడీఏ ల నుంచి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని వారిని ఆర్థికంగా బలోపేతం చేసి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని డిప్యూటీ సీఎం సంబంధిత అధికారులకు సూచించారు. కవ్వాల్, శ్రీశైలం వంటి టైగర్ జోన్లు అభివృద్ధి చేసుకోవాలని పర్యాటకులను ఆకర్షించే విధంగా ఎకో, టెంపుల్ టూరిజం ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించేందుకు యువతను చైతన్యం చేయాలని, డ్రగ్స్ వినియోగం ద్వారా జరిగే నష్టాన్ని కళ్లకు కట్టినట్టు చూపించే విధంగా గ్రామస్థాయిలో కళారూపాలు ప్రదర్శించేలా సాంస్కృతిక శాఖ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా కళాకారులకు జీవనోపాధి కలగడంతో పాటు సమాజంలో మంచి మార్పు కనిపిస్తుందని అన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీ రాజ్ శాఖ స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, సిసిఎల్ఎ సెక్రటరీ లోకేష్ కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ అనిత రామచంద్రన్, దివ్య దేవరాజ్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, గృహ నిర్మాణ శాఖ సెక్రటరీ గౌతం , డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తులు ఇడి జప్తు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ జోనల్ కార్యాలయం అధికారులు రూ.29.76 కోట్ల విలువైన సుమారు 50 స్థిరాస్తులను తాత్కాలికంగా జప్తు చేశారు. జప్తు చేసిన ఆస్తుల్లో డాక్టర్ నమ్రత తో పాటు ఆమె కుమారుల పేర్లపై ఉన్న భూమి, ఫ్లాట్లు, అలాగే ఆసుపత్రి భవనం ఉన్నాయి. ఈ ఆస్తుల ప్రస్తుత మార్కెట్ విలువ దాదాపు రూ.50 కోట్లకు పైగా ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అక్రమ సరోగసీ కార్యకలాపాల ద్వారా వచ్చిన నిధులను స్థిరాస్తుల కొనుగోలు వంటి మార్గాల్లో మళ్లించినట్లు ఈడీ అనుమానం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆస్తులను తాత్కాలికంగా అటాచ్ చేస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన మరిన్ని ఆర్థిక లావాదేవీలు, సంబంధిత వ్యక్తుల పాత్రపై కూడా విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. అక్రమ సరోగసీ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, ఈడీ చర్యలతో కేసులో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com